గురువారం
31•10•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 125
• పేజీలు : 14 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD





చర్లపల్లి కేంద్రకారాగారాన్ని సందర్శించిన తెలంగాణ, ఏపీ రాష్ట్రాల జడ్జీల బృందంతో జైలు అధికారులు

# చర్లపల్లి జైలును సందర్శించిన జడ్జీల బృందం

- ఖైదీల సంక్షేమంపై తెలంగాణ, ఏపీ న్యాయమూర్తుల ఆరా

**చర్లపల్లి:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన జడ్జీల బృందం బుధవారం చర్లపల్లి కేంద్ర కారగారాన్ని సందర్శించింది. సికింద్రాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర జుడిషియల్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో భాగంగా కేంద్ర కారాగారాన్ని జడ్జీల బృందం సందర్శించి ఖైదీల సంక్షేమానికి చేపడుతున్న సంస్కరణలు, పలు కార్యాక్రమాలను జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. కారగారంలోని వివిధ బ్యారక్‌లను పరిశీలించి ఖైదీల సమస్యలను తెలుసుకున్నారు. సక్రమ మార్గంలో పయనిస్తూ, జైలులో ప్రవేశపెడుతున్న శిక్షణను సద్వినియోగం చేసుకుంటున్నామని ఖైదీలు వివరించారు. అనంతరం జైలు అధికారులు ఖైదీల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలు, అందిస్తున్న భోజనం, విద్య, మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉపాధి, శిక్షణ వివరాలను వారికి వివరించారు. ఖైదీలకు అందిస్తున్న వైద్యం వివరాలు, ఖైదీలు పండిస్తున్న పంటలు, పరిశ్రమలలో వారి పనితీరును బృందం సభ్యులకు అధికారులు వివరించారు. అనంతరం జడ్జీల బృందం మాట్లాడుతూ.. ప్రభుత్వం ఖైదీల జీవితాలను మార్చేందుకు అనేక సంస్కరణలు ప్రవేశపెట్టడం హర్షణీయమని, ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేంద్ర కారాగారం సూపరింటిండెంట్ ఎం సంపత్, డిప్యూటీ సూపరింటెండెంట్లు సమ్మయ్య, చింతల దశరథం, జైలర్లు రామకృష్ణ, దేవిసింగ్, మొగిలేశ్, జ్యోతీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

# పాడిపశువుల పంపిణీకి మార్గదర్శకాలు

- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రైతులకు పాడి పశువుల పంపిణీ మార్గదర్శకాల్లో మార్పులు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. లబ్ధిదారుల ఎంపికతోపాటు నాణ్యమైన పశువుల గుర్తింపు, కొనుగోలు ప్రాంతాల ఎంపిక, కొనుగోలుకు డెయిరీ కమిటీలు సిఫారసు చేయాల్సి ఉంటుంది. రాష్ట్రంలోని విజయ, నార్మూల్, ముల్కనూర్, కరీంనగర్ డెయిరీల పరిధిలో ఇప్పటికే 5,202 మంది లబ్ధిదారులను గుర్తించి రైతుల వాటా డీడీలను సేకరించారు. ఇందులో 2,000 మందికి దీపావళికి ముందే పాడిపశువులను పంపిణీ చేశారు. ఈ పథకాన్ని విజయవంతం చేసేందుకు పశుసంవర్ధకశాఖ డైరెక్టర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ నేతృత్వంలో జిల్లాస్థాయి కమిటీలను ఏర్పాటుచేశారు. పాడిపశువుల కొనుగోలు సందర్భంలో పత్రాలు, లబ్ధిదారు చిత్రం, వీడియో, సంతకంతోపాటు ధ్రువపత్రాన్ని లబ్ధిదారు నుంచి తీసుకునేలా ఏర్పాట్లు చేయాలని పశుసంవర్ధకశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఆదేశించారు.



# కృష్ణవేణికి తగ్గిన వరద



ఎస్సారెస్పీ 16 వరద గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు



నాగార్జునసాగర్ డ్యాం క్రస్టుగేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

- జూరాల, ఆల్మట్టి, నారాయణపుర, తుంగభద్ర నుంచి తగ్గిన ఇన్‌ఫ్లో
- శ్రీశైలం నాలుగు గేట్లు, సాగర్ ఎనిమిది గేట్లు ఎత్తి నీటి విడుదల
- గోదావరి బేసిన్‌లో వరద పరవళ్లు
- ఎస్సారెస్పీ 16 గేట్లు, బాబ్లీ మూడు గేట్లు ఎత్తివేత

**నమస్తే తెలంగాణ, నెట్‌వర్క్:** కృష్ణాబేసిన్‌లో వరద ప్రవాహం క్రమంగా తగ్గుతున్నది. మరోవైపు గోదావరి పరవళ్లు తొక్కుతున్నది. కృష్ణా ప్రాజెక్టులైన జూరాల, ఆల్మట్టి, నారాయణ, తుంగభద్ర నుంచి గతంతో పోలిస్తే ఇన్‌ఫ్లోలు క్రమంగా తగ్గాయి. బుధవారం సాయంత్రం జూరాలకు ఇన్‌ఫ్లో 89 వేల క్యూసెక్కులు ఉండగా.. అవుట్ ఫ్లో 88,228 క్యూసెక్కులు నమోదైంది. ప్రాజెక్ట్ నిండుకుండలా ఉండటంతో ఐదు గేట్లు ఎత్తి 52,340 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదలచేస్తున్నారు. ఎగువనున్న ఆల్మట్టి ప్రాజెక్ట్‌లో ఇన్‌ఫ్లో 31,718 క్యూసెక్కులు.. అవుట్ ఫ్లో 24,797 క్యూసెక్కులు రికార్డయింది. నారాణయపురకు ఇన్‌ఫ్లో 20 వేల క్యూసెక్కులు.. అవుట్‌ఫ్లో 19,920 క్యూసెక్కులు నమోదైంది. కర్ణాటకలోని ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర జలాశయానికి వరద వస్తుండటంతో ప్రాజెక్టు ఐదు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. బుధవారం ఇన్‌ఫ్లో 35,503 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 26,120 క్యూసెక్కులు నమోదైంది. శ్రీశైలం ప్రాజెక్టుకు తొమ్మిది రోజులుగా వస్తున్న నీటి ఉధృతి దాదాపుగా తగ్గింది. బుధవారం సాయంత్రానికి జూరాల నుంచి 37,419 క్యూసెక్కులు, సుంకేశుల నుంచి 64,665 క్యూసెక్కులు కలిపి 1,02,084 క్యూసెక్కుల నీళ్లు వస్తున్నాయి. దీంతో ప్రాజెక్టు గరిష్ఠ మట్టం 885 అడుగులకుగాను 884అడుగులకు చేరుకొంది. నాలుగు క్రస్ట్ గేట్ల ద్వారా 1,11,384 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో స్థిరంగా కొనసాగుతుండటంతో ఎనిమిది క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగిస్తున్నారు. శ్రీశైలం నుంచి 1,71,473 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో అంతే మొత్తంలో వదిలేస్తున్నారు. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 637.10 అడుగులకు పెరిగింది.

### ఎస్సారెస్పీకి మళ్లీ వరదపోటు

ఎస్సారెస్పీ జలాశయానికి మళ్లీ వరద పోటెత్తడంతో బుధవారం ఉదయం 16 వరద గేట్లను ఎత్తి దిగువకు జలాలను వదిలారు. ఎగువన మహారాష్ట్రలో బాబ్లీ ప్రాజెక్టు గేట్లన్నింటినీ అధికారులు మంగళవారం మధ్యాహ్నం మూసివేశారు. మంగళవారం రాత్రి నుంచి 35 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో అర్ధరాత్రి బాబ్లీ మూడు గేట్లను మహారాష్ట్ర అధికారులు ఎత్తి గోదావరిలోకి నీటిని వదులుతున్నారు. మంగళవారం ఎస్సారెస్పీకి 14 వేల క్యూసెక్కులకు తగ్గిపోయిన ఇన్‌ఫ్లో.. బుధవారం ఉదయం 68,360 క్యూసెక్కులకు పెరుగడంతో 16 గేట్లు ఎత్తివేసి 50 వేల క్యూసెక్కుల జలాలను గోదావరిలోకి వదులుతున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 622 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1405.00 అడుగులు కాగా, ప్రస్తుతం 1389.28 అడుగుల నీరున్నది.

### లక్ష్మీ(మేడిగడ్డ) బరాజ్‌లో 23 గేట్లు ఎత్తివేత

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లి పరిధిలో కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మించిన లక్ష్మీ (మేడిగడ్డ)బరాజ్‌లో బుధవారం 23 గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదిలారు. బరాజ్‌లో 95.10 మీటర్ల ఎత్తులో 4.726 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన సరస్వతీ(అన్నారం) బరాజ్ నాలుగు గేట్లు ఎత్తి నీరును దిగువకు వదులుతున్నారు. బరాజ్‌కు బుధవారం ఉదయం ఇన్‌ఫ్లో 66 వేల క్యూసెక్కులురాగా 10 గేట్లు ఎత్తి 80 వేల క్యూసెక్కులు దిగువకు వదిలారు. సాయంత్రం ఇన్‌ఫ్లో 32 వేలకు తగ్గడంతో నాలుగు గేట్లు ఎత్తి 36 వేల క్యూసెక్కుల నీరును దిగువకు వదులుతున్నారు. బరాజ్‌లో 09.00 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.



జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓ వీధిలో వరదనీటిలో వెళ్తున్న ఆటో



రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాలలో నీట మునిగిన పత్తి పంట



మంథని రూరల్‌లో వర్షంతో దెబ్బ తిన్న పంటను చూపుతున్న రైతు

# 11 జిల్లాల్లో ఓ మోస్తరు వాన

- ఖానాపూర్ డివిజన్‌లో 5 సెం.మీ. వర్షం
- ములుగు జిల్లాలో పిడుగుపాటుకు వ్యక్తి మృతి
- పలుచోట్ల పంట నష్టం
- నేడు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వానలు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** రాష్ట్రంలోని 11 జిల్లాల్లో బుధవారం చిరుజల్లుల నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. నిర్మల్ జిల్లా ఖానాపూర్ వ్యవసాయ డివిజన్ పరిధిలో అత్యధికంగా 5 సెం.మీ. వర్షం పడగా, ములుగు జిల్లాలోని వెంకటాపురం(నూగూరు)లో 4.9 సెం.మీ., జగిత్యాల జిల్లాకేంద్రంలో 4 సెం.మీ వర్షపాతం నమోదైంది. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం కేశవాపురం గ్రామానికి చెందిన రైతు దేవేందర్‌రావు పిడుగుపాటుతో మృతి చెందగా, నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం మస్కాపూర్‌లో నాలుగు బర్రెలు, జగిత్యాల జిల్లా మద్దులపల్లిలో 8 మేకలు, రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలోని మర్రిగడ్డలో ఒక ఎద్దు మృత్యువాతపడింది. పలు జిల్లాల్లో పంటలకు నష్టం వాటిల్లింది.

### రహదారులు జలమయం

నిర్మల్ జిల్లా ఖానాపూర్ వ్యవసాయ డివిజన్ పరిధిలో బుధవారం 5 సెం.మీ. వర్షం కురిసింది. కామారెడ్డి జిల్లా కేంద్రంతోపాటు గాంధారి, లింగంపేట్, బీబీపేట్‌లో వర్షం కురిసింది. ములుగు జిల్లాలో 1.3 సెం.మీ. వర్షపాతం నమోదుకాగా, వెంకటాపురం(నూగూరు)లో 4.9 సెం.మీ. వర్షం కురిసింది. జగిత్యాల జిల్లా కేంద్రంతో 4 సెం.మీ వర్షం కురవగా, జిల్లావ్యాప్తంగా 3 సె.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లా కేంద్రంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. వరంగల్ నగరంలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్, మాక్లూర్, నందిపేట్, భీమ్‌గల్, కమ్మర్‌పల్లి, వేల్పూర్, డిచ్‌పల్లి, ఇందల్వాయి, జక్రాన్‌పల్లి మండలాలతోపాటు నిజామాబాద్ నగరంలో చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, కొత్తపల్లి, చొప్పదండి, గంగాధర, రామడుగు, గన్నేరువరం, మానకొండూర్, హుజూరాబాద్, జమ్మికుంటల్లో ఓ మోస్తరు వర్షం కురవగా, శంకరపట్నం, తిమ్మాపూర్, వీణవంక మండలాల్లో భారీ వర్షం పడింది. పలు మండలాల్లో వరిచేలు నీట మునిగాయి. మంచిర్యాల జిల్లాలో దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో ఓ మోస్తరు వాన పడగా, 16 మండలాల్లో చిరు జల్లులు కురిశాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఓదెల, కాల్వశ్రీరాంపూర్, మంథని మండలాల్లో భారీ వర్షం కురిసింది. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో రోడ్లు జలమయయ్యాయి. జిల్లావ్యాప్తంగా 5 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఆయా మండలాల్లో కోతకు వచ్చిన వరి చేలకు నష్టం వాటిల్లింది. సూర్యాపేట జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. నడిగూడెంలో 2.5 సెం.మీ వర్షం పడింది.

### నేలకొరిగిన వరి..

జగిత్యాల జిల్లాలో 3 వేల ఎకరాల్లో వరి పొలాలు నేలకొరిగాయి. ములుగు జిల్లాలోని ములుగు, వెంకటాపూర్, ఏటూరునాగారం, గోవిందరావుపేట, వెంకటాపురం(నూగూరు) మండలాల్లో 2,260 ఎకరాల వరి పంటకు నష్టం వాటిల్లినట్టు జిల్లా వ్యవసాయ అధికారి కేపీ గౌస్‌హైదర్ తెలిపారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ వ్యవసాయ డివిజన్‌లో ఈదురుగాలులతో కూడిన వర్షానికి వరిపంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఖానాపూర్, కడెం మండలాల్లోని సదర్‌మాట్ దిగువన, కడెం, దస్తురాబాదు మండలాల్లోని కడెం ప్రధాన కాల్వ కింద వరి పంట నేలకొరిగింది. డివిజన్ పరిధిలో 1,700 ఎకరాల్లో వరి నేలకొరిగినట్టు ప్రాథమిక సమాచారం. సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, బోయినపల్లి, కోనరావుపేట, చందుర్తి, రుద్రంగి మండలాల్లో వర్షానికి కోతకు వచ్చిన వరి, పత్తి పంటలకు నష్టం వాటిల్లింది.

## నేడు రాష్ట్రంలో ఓ మోస్తరు వానలు

**హైదరాబాద్ సిటీబ్యూరో / హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆగ్నేయం వైపు నుంచి వీస్తున్న తేమగాలుల వల్ల రాగల 24 గంటల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. శ్రీలంక, తమిళనాడు మధ్యలోని కోమోరిన్ దాని పరిసర ప్రాంతాల్లో తీవ్ర అల్పపీడనం కేంద్రీకృతమైందని, దీనికి అనుబంధంగా సముద్రమట్టానికి 5.8 కి.మీ. ఎత్తువరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నదని చెప్పారు. ఇది 24 గంటల్లో లక్షదీవులు, మాల్దీవులు దానిని ఆనుకుని ఉన్న అరేబియా సముద్రం ప్రాంతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉన్నదని వివరించారు.

### చల్లబడ్డ గ్రేటర్ హైదరాబాద్

గ్రేటర్‌లోని పలుచోట్ల రాగల 24 గంటల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. బుధవారం ఉదయం నుంచి గ్రేటర్‌లో వాతావరణం చల్లగా మారింది. గరిష్ఠ ఉష్ణోగ్రత 29.1 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 21.6 డిగ్రీలు, గాలిలో తేమ 72 శాతంగా నమోదైందని అధికారులు తెలిపారు.



పీయూసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జీవన్‌రెడ్డిని అభినందిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, వీ శ్రీనివాస్‌గౌడ్

# పీయూసీ చైర్మన్‌గా జీవన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ చైర్మన్‌గా ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆయనను సీట్లో కూర్చోబెట్టి అభినందించారు. అసెంబ్లీ అవరణలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ టీ పద్మారావు, మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్, మహమూద్ అలీ, ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్, మాజీ స్పీకర్ కేఆర్ సురేశ్‌రెడ్డి, ప్రభుత్వవిప్ అరికెపూడి గాంధీ, ఎంపీలు రంజిత్‌రెడ్డి, బడుగుల లింగయ్యాయాదవ్, ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గణేశ్ గుప్తా, ఎమ్మెల్సీలు ఎం శ్రీనివాస్‌రెడ్డి, గంగాధర్ గౌడ్, నారదాసు లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో కీలకమైన పీయూసీ చైర్మన్‌గా అవకాశం కల్పించారని.. కేసీఆర్ నమ్మకాన్ని నిలబెడుతానన్నారు.

# అ'ద్వితీయం'గా ఐటీ అభివృద్ధి

- జిల్లాల్లోనూ ఐటీ పార్కుల ఏర్పాటు
- మౌలిక వసతుల కల్పనతో ముందుకొస్తున్న కంపెనీలు
- ప్రత్యేక ప్రోత్సహకాలతో ప్రభుత్వం చేయూత
- భారీగా పెరుగనున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- ఐటీ విస్తరణతో ఆర్థిక వ్యవస్థ బలోపేతం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉమ్మడి రాష్ట్రంలో కేవలం హైదరాబాద్‌కే పరిమితమైన ఐటీ పరిశ్రమ ఇప్పుడు జిల్లాలకూ విస్తరిస్తున్నది. హైదరాబాద్‌కు ప్రపంచస్థాయి ఐటీ కంపెనీల రాకను స్వాగతిస్తూనే, ద్వితీయశ్రేణి నగరాల్లోనూ ఐటీ పార్కుల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రభుత్వ చర్యలు, రాయితీల కారణంగా ఇప్పటికే వరంగల్‌లో ఐటీరంగం అభివృద్ధి చెందింది. కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోనూ ఐటీ టవర్ల నిర్మాణం జరుగుతున్నది. జడ్చర్ల, మంచిర్యాలలో ఐటీ పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయి. ఆదిలాబాద్, భూపాలపల్లి, నిర్మల్, మహబూబాబాద్, నాగర్‌కర్నూల్, గద్వాల తదితర ప్రాంతాల్లో ఐటీ పార్కుల స్థాపనకు కంపెనీల మొగ్గుచూపుతుడటంతో ఒక్కోచోట రూ.20 కోట్లతో రెండు వేలమందికి ఉపాధి కల్పించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

### ఐటీ విస్తరణకు మంత్రి కేటీఆర్ కృషి

రాష్ట్రంలో ఐటీ అభివృద్ధిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకొన్న మంత్రి కేటీఆర్.. ప్రతి విదేశీ పర్యటనతోపాటు ఐటీ దిగ్గజ సంస్థల ప్రతినిధులతో జరిపిన చర్చల్లో ద్వితీయ శ్రేణి నగరాలకు ఉండే సానుకూలతలను వివరించారు. బెంగళూరు సమీపంలోని మైసూర్‌లో ఐటీ రంగం విస్తరించినట్టే హైదరాబాద్ చుట్టుపక్కల గల ద్వితీయశ్రేణి నగరాలు ఐటీ పరిశ్రమల స్థాపనకు ఏవిధంగా అనుకూలమో వివరించి పలు అంతర్జాతీయ కంపెనీల రాకకు కారణమయ్యారు.

### వరంగల్, ఖమ్మం జిల్లాల్లో..

వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై మడికొండ వద్ద ఇప్పటికే 45 ఎకరాల్లో ఐటీ పార్కును ఏర్పాటుచేయడంతోపాటు అక్కడ రూ.4.5 కోట్ల వ్యయంతో ఇంక్యుబేషన్ సెంటర్ పూర్తయింది. ఈ సెజ్‌లోనే ఐదెకరాల్లో సీయెంట్ కంపెనీని స్థాపించారు. అంతర్జాతీయ ఐటీ కంపెనీ అయిన ఇన్ఫోసిస్ కూడా వరంగల్‌లో భారీ యూనిట్‌ను ప్రారంభించాలని భావిస్తున్నది. ఖమ్మంలో 1.21 ఎకరాల్లో రూ. 25 కోట్లతో కొత్త ఐటీ హబ్‌ను స్థాపించాలని నిర్ణయించిన ప్రభుత్వం.. అక్కడ మొత్తం 15 కంపెనీలకు స్థలాలు కేటాయించి 2,500 మందికి ఉపాధి కల్పించేలా చర్యలు చేపడుతున్నది.

### కరీంనగర్‌లో ఐటీ టవర్ నిర్మాణ పనులు పూర్తి



కరీంనగర్‌లో గతేడాది రూ.25 కోట్లతో ప్రారంభమైన ఐటీ టవర్ నిర్మాణ పనులు పూర్తికావస్తున్నాయి. ఈ టవర్‌లో 62 వేల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో లెర్నింగ్ సెంటర్‌తోపాటు, ఏసీ, నాన్ ఏసీ క్యాంటీన్లను ఏర్పాటుచేస్తున్నారు. ఈ టవర్ ద్వారా దాదాపు మూడు వేలమందికి ఉపాధి లభించే అవకాశమున్నది.

### నిజామాబాద్‌లో రూ.50 కోట్లతో...

నిజామాబాద్ జిల్లాలో ఐటీ పార్కు ఏర్పాటుకు తొలుత రూ.25 కోట్లు కేటాయించారు. అక్కడ కార్యాలయాలను ఏర్పాటుచేసేందుకు 45కుపైగా కంపెనీలు ముందుకురావడంతో కేటాయింపులను రూ.50 కోట్లకు పెంచి 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రెండు ఐటీ టవర్‌లను నిర్మిస్తున్నారు. తద్వారా 2,500 మందికి ఉపాధి లభించే అవకాశమున్నది.

### నేడు మహబూబ్‌నగర్‌లో భూమిపూజ

మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్మించే ఐటీ టవర్‌కు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ గురువారం (అక్టోబర్ 31న) భూమిపూజ చేయనున్నారు. ఈ కారిడార్‌లో అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో సాఫ్ట్‌వేర్, కాలుష్య రహిత పరిశ్రమలను ఏర్పాటుచేసి స్థానిక యువతకు ఉపాధి కల్పించనున్నారు. మహబూబ్‌నగర్‌లోని ఎదిర శివారులో నిర్మించే టవర్‌కు ఐటీశాఖ రూ.25 కోట్లు మంజూరుచేసింది. నాలుగు ఎకరాల్లో నిర్మితమయ్యే ఈ టవర్ పూర్తయిన వెంటనే దాదాపు 40 కంపెనీల కార్యాలయాలు ఏర్పాటయ్యేలా టీఎస్‌ఐఐసీ కార్యాచరణ రూపొందించింది.

### ద్వితీయశ్రేణి నగరాల్లో ప్రత్యేక రాయితీలు

ద్వితీయశ్రేణి నగరాల్లో కార్యాలయాలను స్థాపించే ఐటీ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలను అందజేయనున్నది. ఇందుకు సంబంధించిన విధివిధానాలు అందుబాటులోకి రావడంతో పలు ఐటీ కంపెనీలు ద్వితీయశ్రేణి నగరాల బాటపడుతున్నాయి.

## ప్రత్యేక రాయితీలకు ప్రతిపాదనలు

- ప్రతి పట్టణంలో మొదటి ఐదు ఐటీపార్కులు, ఐటీ కంపెనీలకు తొలి మూడేండ్లు మున్సిపల్ ట్యాక్స్‌లను రీయింబర్స్ చేస్తారు.
- ఐటీ ఈవెంట్ల నిర్వహణకయ్యే ఖర్చులో 50 శాతం లేదా రూ.5 లక్షలు (ఏది తక్కువైతే ఆ మొత్తాన్ని) రీయింబర్స్ చేస్తారు.
- ద్వితీయశ్రేణి నగరాల్లో నిర్వహించే ఎగ్జిబిషన్లలో 9 చదరపు మీటర్ల స్థలంలో స్టాళ్లు ఏర్పాటు చేసుకునే జాతీయ, అంతర్జాతీయ ఐటీ కంపెనీలకు అద్దెలో 50 శాతం సబ్సిడీ లేదా రూ.50 వేలు (ఏది తక్కువైతే అది) ఇస్తారు.
- ఐటీ కంపెనీలు ప్రారంభమైన నాటి నుంచి ఐదేండ్లవరకు విద్యుత్ చార్జీల్లో ప్రతి యూనిట్‌కు రూపాయి చొప్పున ఫిక్స్‌డ్ రీయింబర్స్‌మెంట్ ఇస్తారు.
- 250 మంది ఉద్యోగులున్న ఐటీ కంపెనీలకు మొదటి ఐదు యాంకర్ యూనిట్ల ఏర్పాటులో రూ.10 లక్షల సబ్సిడీ ఇవ్వడంతోపాటు ఆయా కంపెనీలు బీపీవో కార్యకలాపాలను ప్రారంభించేందుకు కూడా రాష్ట్ర ప్రభుత్వమే సహకారాన్ని అందజేస్తుంది. దీనిలో భాగంగా రూ.20 లక్షల పెట్టుబడితో ప్రారంభమయ్యే కంపెనీలకు మూల పెట్టుబడిపై 50 శాతం సబ్సిడీ ఇస్తుంది.
- ఇంటర్నెట్, టెలిఫోన్ చార్జీలపై 25 శాతం రీయింబర్స్‌మెంట్ ఇస్తుంది.
- ఐటీ కంపెనీలకు అవసరమైన మానవవనరులను సమకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నాన్-ఐటీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటుచేస్తుంది. ఒక్కో వ్యక్తికి ట్రైనింగ్ సబ్సిడీ కింద మూడునెలల వరకు రూ.2,500 ఇస్తుంది.
- ఐటీ కంపెనీలు ఏర్పాటయ్యే ప్రాంతాల పరిధిలోని కళాశాలలు, శిక్షణ కేంద్రాల్లో టాస్క్ (టీఏఎస్‌కే) కింద ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను ప్రభుత్వమే రూపొందిస్తుంది.



శ్రీరంగారావుతో ప్రమాణం చేయిస్తున్న సీఎస్ జోషి



శ్రీరంగారావును అభినందిస్తున్న సీఎండీ గోపాల్‌రావు

# బాధ్యతలు స్వీకరించిన శ్రీరంగారావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్ఈఆర్సీ) చైర్మన్‌గా తన్నీరు శ్రీరంగారావు బాధ్యతలు స్వీకరించారు. బుధవారం లక్డీకాపూల్‌లోని రెడ్‌హిల్స్ ఫ్యాప్సీ భవన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్కే జోషి.. శ్రీరంగారావుతో ప్రమాణం చేయించారు. సాంకేతిక, ఆర్థిక విభాగసభ్యులుగా ఎండీ మనోహర్‌రాజు, బండారు కృష్ణయ్య కూడా ప్రమాణం స్వీకరించారు. వీరి పదవీకాలం ఐదేండ్లు ఉంటుంది. కార్యక్రమంలో ప్రత్యేక ప్రధానకార్యదర్శి అజయ్ మిశ్రా ఇతర అధికారులు పాల్గొన్నారు. టీఎస్ఈఆర్సీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీరంగారావుది ఉమ్మడి కరీంనగర్ జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్. హైదరాబాద్ జిల్లా కోర్టులో 31 ఏండ్లుగా న్యాయవాదిగా పనిచేస్తున్నారు. తెలంగాణ ఉద్యమం సమయంలో న్యాయవాదులు జేఏసీ తరపున చురుకుగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు.

### అభినందించిన సీఎండీ గోపాల్‌రావు

టీఎస్ఈఆర్సీ చైర్మన్ శ్రీరంగారావు, సభ్యులు ఎండీ మనోహర్‌రావు, బండారు కృష్ణయ్యను ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు సన్మానించారు. బుధవారం ప్రమాణస్వీకారం అనంతరం వారిని కలిసిన గోపాల్‌రావు పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు.

# ధైర్యం కోసం కీర్తికి తాగించాడు

- ఆపై రజితను హతమార్చారు
- మునగనూరు హత్యకేసులో కీలక ఆధారాలు
- వైన్స్ షాపు, టోల్‌ప్లాజా, మరిన్ని సీసీ కెమెరాల పరిశీలన
- కొలిక్కివచ్చిన పోలీసుల దర్యాప్తు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ శివారు హయత్‌నగర్ మండలం మునగనూరు ద్వారకానగర్‌లో ఈ నెల 19న జరిగిన రజిత హత్యకేసు దర్యాప్తును పోలీసులు బుధవారం ఓ కొలిక్కి తీసుకొచ్చినట్టు తెలుస్తున్నది. హత్యకేసు ఆదివారం వెలుగులోకి వచ్చి.. తల్లిని చంపింది కూతురు కీర్తిరెడ్డి అని తేలినప్పటికీ.. ఈ కేసు రోజుకో మలుపు తిరుగుతూ సంచలనం సృష్టిస్తున్నది. నాలుగు రోజులుగా పోలీసుల అదుపులో ఉన్న కీర్తిరెడ్డి, ఆమెకు సహకరించిన శశికుమార్, కీర్తిరెడ్డి ప్రియుడు బాల్‌రెడ్డి అనేక విషయాలు వివరించినట్టు సమాచారం. తల్లిని చంపాలంటే ధైర్యం సరిపోదని భావించి కీర్తిరెడ్డికి శశికుమార్ మద్యం తాగించి ఆ తర్వాత చంపించాడని ప్రాథమికంగా తెలుస్తున్నది. అనుమానితులు వెల్లడించిన అంశాలను నిర్ధారించుకునేందుకు పనిచేస్తున్న మూడు పోలీసు బృందాలు.. శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానంతో క్రైమ్ సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేస్తున్నాయి. నిందితుల విచారణను వీడియో గ్రాఫ్‌తో పర్యవేక్షిస్తున్నట్టు తెలిసింది. ఈ ముగ్గురే కాకుండా మరికొంత మంది పాత్ర బయటపడినట్టు సమాచారం. వారిలో బాల్‌రెడ్డి తరపు కుటుంబసభ్యులు, శశికుమార్ కుటుంబసభ్యుల పాత్రలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం వీరెవరూ అందుబాటులోలేరని తెలుస్తున్నది.

### ఎన్ని రోజుల ముందు హత్యకు కుట్ర జరిగింది


రజిత హత్యకు కుట్ర ఎన్ని రోజుల ముందు జరిగిందనే అంశాలపై హయత్‌నగర్ పోలీసులు దృష్టి సారించారు. కీర్తిరెడ్డి, శశికుమార్, బాల్‌రెడ్డి ఫోన్ల డాటాను, వారి వాట్సాప్ చాటింగ్, ఫోన్ కాలింగ్ వివరాలను సేకరిస్తున్నారు. 15 రోజుల కిందట ముగ్గురికి సంబంధించిన టవర్ లొకేషన్స్ మ్యాపింగ్‌ను పరిశీలిస్తున్నారు. హత్య కుట్రలో శశికుమార్‌తోపాటు చాలామంది భాగస్వాములయ్యారని కీలక ఆధారాలు లభించాయి. మరికొందరిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తున్నది. ఆస్తి కాజేయాలనే ఉద్దేశంతో హత్యకు శశికుమార్ పథకం రచించినట్టు తెలుస్తుండగా.. రజిత మృతదేహాన్ని యాదాద్రి జిల్లా తుమ్మలగూడెం రైల్వేట్రాక్‌పైకి తరలించేందుకు శశికుమార్‌కు కొంతమంది సహకరించారని పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని తరలించిన కారులో ఎంతమంది ప్రయాణించారనే విషయాన్ని ధ్రువీకరించుకొనేందుకు వైన్స్ షాప్, టోల్ ప్లాజాతోపాటు మరిన్నిచోట్ల సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తున్నారు.

### మద్యం బాటిళ్లు స్వాధీనం

కేసు దర్యాప్తుచేస్తున్న పోలీసులు హత్యకు గురైన ఇంట్లోనుంచి పలు ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పెట్టిన గదిలో ఉన్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వాటిని తీసుకొచ్చిన మద్యం దుకాణం సీసీ కెమెరాల దృశ్యాలను సేకరించారు. బాల్‌రెడ్డితో కలిసి తిరిగినప్పుడు కీర్తిరెడ్డి గర్భం దాల్చడంతో దానిని తొలగించేందుకు శశికుమార్ సాయం తీసుకుని మహబూబ్‌నగర్ జిల్లాలోని ఓ వైద్యుడిని సంప్రదించారని సమాచారం. ఆస్తి కాజేయాలని కుట్రపన్నిన శశికుమార్.. కీర్తితో సన్నిహితంగా ఉన్నప్పుడు దిగిన ఫొటోలతో బ్లాక్‌మెయిల్ చేశాడని, తల్లి రజితను చంపి పెండ్లి చేసుకోవాలని కీర్తిని బెదిరించినట్టు స్థానికంగా ప్రచారం జరుగుతున్నది. బాల్‌రెడ్డి కూడా శశికుమార్‌తో చేతులు కలిపి కీర్తిరెడ్డిని రెచ్చగొట్టి తల్లిని చంపాలని పురమాయించి ఉంటాడనే వాదనలు వినిపిస్తున్నాయి. హత్యకు గల కారణాల గురించి పోలీసులు గురువారం అధికారికంగా వెల్లడించే అవకాశం ఉన్నది.



రజిత (ఫైల్)



బాల్‌రెడ్డి

గురువారం
31•10•2019
కరీంనగర్

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE










బుధవారం ఢిల్లీలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న రాష్ట్ర పురపాలక, ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు

# ఇక బంగారం లెక్క!



పరిమితికి మించి దాచినవారిపై నజర్

- క్షమాభిక్ష పథకం తేనున్న కేంద్రం
- స్వచ్ఛందంగా ప్రకటించి, పన్ను చెల్లిస్తే సరి
- లేనిపక్షంలో భారీ జరిమానాలే
- త్వరలో విధివిధానాలు
- కొత్తగా గోల్డ్ బోర్డు ఏర్పాటు
- భారతీయుల వద్ద 25 వేల టన్నుల బంగారం!

**న్యూఢిల్లీ, అక్టోబర్ 30:**

నల్లధనం నిర్మూలన కోసం మరో భారీ నిర్ణయంతో మోదీ సర్కారు ముందుకు రానున్నట్లు తెలుస్తున్నది. అక్రమార్కుల అవినీతి సంపదను వెలికి తీసేందుకు దాదాపు మూడేండ్ల క్రితం పెద్ద నోట్లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు బంగారం వంతు వచ్చింది. అందుకే పరిమితికి మించి బంగారాన్ని దాచిన వారి కోసం ఓ క్షమాభిక్ష పథకాన్ని తీసుకువచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. పెద్ద నోట్ల రద్దు తర్వాత చాలామంది తమ అక్రమార్జనను నగదు రూపంలో కాకుండా బంగారం రూపంలో భద్రపరుస్తున్నారు. దీన్ని గ్రహించిన కేంద్రం.. నిర్ణీత పరిమితి దాటి నిల్వచేసిన పసిడిని స్వచ్ఛందంగా ప్రకటించాలని, దానికి పన్ను చెల్లించాలని చెప్పన్నది. 2014-16 మధ్య కాలంలో వచ్చిన క్షమాభిక్ష పథకాల్లో అమలుచేసిన పన్ను రేటు పరిమాణంలోనే దీనికీ పన్ను ఉండొచ్చని ప్రభుత్వ అత్యున్నత వర్గాల ద్వారా తెలుస్తున్నది. 2016 నవంబర్ 8వ తేదీ రాత్రి రూ.1,000, 500 నోట్లు ఇక చెల్లబోవని స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంచలన ప్రకటన చేసిన సంగతి విదితమే. ఇది జరిగి మూడేండ్లు కావస్తుండగా, నల్లధనంపై పోరుకు మోదీ సర్కారు మరోసారి సిద్ధమవుతున్న సంకేతాలు రావడం ప్రాధాన్యం సంతరించుకున్నది. వచ్చే నెలలోనే ఈ క్షమాభిక్ష పథకం ప్రకటన ఉండొచ్చన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

**త్వరలో విధివిధానాలు**

ఈ పథకం నియమనిబంధనల్ని త్వరలోనే కేంద్రం ప్రకటించవచ్చని సంబంధిత వర్గాలు చెప్తున్నాయి. బంగారం నిల్వలకు పరిమితి తదితర అంశాలు అప్పుడే స్పష్టమవుతాయని పేర్కొంటున్నాయి. కాగా, ఈ పథకాన్ని తేలిగ్గా


మిగతా 8వ పేజీలో


# బాట ఇవ్వండి

కంటోన్మెంట్‌లో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సహకరించండి

- రక్షణ భూములు రాష్ట్రానికి ఇవ్వండి
- రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు కేటీఆర్ విజ్ఞప్తి
- మెట్రో బకాయిలు రూ.254 కోట్లు విడుదల చేయాలి
- ఘన వ్యర్థాల నిర్మూలన ప్రాజెక్టుకు రూ.400 కోట్లు ఇవ్వండి
- ఏరోస్పేస్ శిక్షణకు బేగంపేట ఎయిర్‌పోర్టు వినియోగానికి అనుమతించండి
- కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ పూరిని కోరిన మంత్రి కేటీఆర్

**హైదరాబాద్,నమస్తే తెలంగాణ:**

సికింద్రాబాద్ ప్రాంతంలోని కంటోన్మెంట్ ఏరియాలో నాగపూర్ పట్టణంతోపాటు యావత్ ఉత్తర తెలంగాణను రాష్ట్ర రాజధానితో అనుసంధానంచేసే రెండు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి రక్షణశాఖ భూములను బదలాయించాలని రాష్ట్ర పురపాలక, ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు.. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కోరారు. రెండురోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీకి వెళ్లిన మంత్రి కేటీఆర్.. రాజ్‌నాథ్‌తోపాటు, కేంద్ర పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ శాఖల మంత్రి హర్దీప్‌సింగ్‌పూరిని కలిసి రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. ముందుగా రాజ్‌నాథ్‌తో భేటీ అయిన మంత్రి కేటీఆర్ రక్షణ భూముల బదలాయింపునకు సంబంధించి రెండు లేఖలను అందించారు. హైదరాబాద్-నాగపూర్ జాతీయ రహదారిపై సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఏరియాలో 11 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి 39.40 ఎకరాల భూమి అవసరం అవుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా రామగుండం- హైదరాబాద్ రాష్ట్ర రహదారిలో జేబీఎస్ నుంచి తూంకుంట వరకు 19 కిలోమీటర్ల రోడ్డును విస్తరించడంతోపాటు ఇందులో నాలుగు కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి 66.37 ఎకరాల భూమి అవసరం అవుతుందని


మిగతా 4వ పేజీలో


# చెరవీడిన భూములు

14 వేల ఎకరాల అక్రమాల గుట్టురట్టు




- 'నమస్తే తెలంగాణ' కథనాలతో స్పందించిన అధికారులు • నల్లగొండ జిల్లా చందంపేట మండలంలో రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన
- ఆరుగ్రామాల్లో అక్రమాలపై రెండునెలలపాటు విచారణ • బయటపడిన దళారీలు- రెవెన్యూ అధికారుల కుమ్మక్కు
- కోట్ల రూపాయల్లో సాగిన అక్రమ లావాదేవీలకు తెర • వేల ఎకరాల అటవీ భూములకు విముక్తి
- రూ.7 కోట్ల రైతుబంధు చెక్కుల దుర్వినియోగానికి చెక్




చందంపేట భూములపై 9.8.2019న 'అడవిని అమ్మేశారు' అనే శీర్షికతో నమస్తే తెలంగాణ అందించిన కథనం

భారీ భూ కుంభకోణానికి తెరదిగింది. అత్తసొమ్ము అల్లుడు దానం చేసినట్టు సాగిన రెవెన్యూ అధికారుల అక్రమాలకు కళ్లెంపడింది. నల్లగొండ జిల్లా చందంపేట మండల పరిధిలోని నల్లమల అటవీప్రాంతాన్ని నామరూపాల్లేకుండా చేసేందుకు సాగిన కుట్రపుట్టలు పగిలాయి. 'నమస్తే తెలంగాణ' ప్రచురించిన సంచలనాత్మక కథనాలతో ఉలిక్కిపడిన అధికారులు.. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి రికార్డుల ప్రక్షాళన చేపట్టడంతో వేల ఎకరాల అటవీభూమి కబ్జాకోరల నుంచి చెరవీడింది. కేవలం ఆరు గ్రామాల పరిధిలోనే ఏకంగా పద్నాలుగు వేల ఎకరాల భూములకు అధికారులు అక్రమంగా పట్టాలు జారీచేసినట్టు విచారణలో వెల్లడైంది. ఈ గుట్టును విప్పేందుకు రెండునెలలపాటు విచారణ కొనసాగిందంటే అక్రమాలు ఏస్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఈ అక్రమాల చిట్టా వెలుగులోకి రావడంతో వేల ఎకరాల నల్లమల అటవీప్రాంతానికి విముక్తి లభించడంతోపాటు మహోన్నత ఆశయంతో తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న రైతుబంధు పథకం దుర్వినియోగానికీ అడ్డుకట్ట పడింది.

**గుండాల కృష్ణ - హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**


నల్లగొండ జిల్లా చందంపేట మండల రెవిన్యూ అధికారుల అక్రమాలు భారీస్థాయిలో బయటపడ్డాయి. మండలం పరిధిలో అనేక గ్రామాల్లోని ప్రభుత్వ, అటవీభూముల్ని ఇష్టానుసారంగా పంచిపెట్టిన వైనాన్ని గతంలో 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తెచ్చింది. అచ్చంపేట- పట్టి- చందంపేట గ్రామపరిధిలోని మూడు వందల ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములకు అక్రమంగా అధికారులు పట్టాలు జారీచేసిన వైనాన్ని, రూ.20వేలకు ఎకరం చొప్పున ఇష్టానుసారంగా పాస్ పుస్తకాలు జారీచేసిన అక్రమాలను, ఏకంగా ఆన్‌లైన్‌లోనూ ఆ వివరాల్ని నమోదు చేసిన విచిత్రాలను, మొత్తంగా అధికారికంగా ప్రభుత్వ భూమిని ఫలహారంగా పంచిన దుర్మార్గాన్ని నమస్తే తెలంగాణ 30.7.2019న 'భలే మంచి చౌకబేరము.. ఎకరా రూ.20 వేలే' అనే శీర్షికన వెలుగులోకి తెచ్చింది. ఇదే మండలంలోని పొగిళ్ల, చిత్రియాల, రేకులగడ్డ గ్రామాల పరిధిలో విస్తరించి ఉన్న నల్లమల అటవీ భూముల్ని మిఠాయిల్లా పంచిపెడుతున్న వైనాన్ని కూడా బయటపెట్టింది. ముఖ్యంగా పొగిళ్ల గ్రామంలో వాస్తవ పట్టా భూమి కంటే అదనంగా వేల ఎకరాలకు పాస్‌పుస్తకాలు జారీచేయటం.. తద్వారా


మిగతా 9వ పేజీలో


## మున్సిపల్ ఎన్నికలకు 4 లేదా 5న నోటిఫికేషన్?

- బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు రెండురోజుల్లో ఖరారు
- జూలై జాబితా ప్రకారం మొత్తం ఓటర్లు 50.37 లక్షలు
- జిల్లాల్లో నోడల్ అధికారుల నియామకం
- నేటి కోర్టు తీర్పుకోసం ఎదురుచూస్తున్న ఎస్ఈసీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**




రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు అధికారులు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. నవంబర్‌లో మున్సిపల్ ఎన్నికలను పూర్తిచేయాలని అటు ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ఎన్నికల సంఘం భావిస్తున్నాయి. గురువారం సింగిల్ జడ్జి ధర్మాసనం విచారణ అనంతరం జారీ అయ్యే ఉత్తర్వుల కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు. నవంబర్ నాలుగు లేదా ఐదో తేదీన మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేస్తారని తెలుస్తున్నది. ఇప్పటివరకు ఉన్న పరిణామాలు, కోర్టుకు సమర్పించిన నివేదికల ప్రకారం తీర్పు అనుకూలంగా వస్తుందని భావిస్తున్న ఎన్నికల సంఘం.. ఎన్నికలకు సన్నద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించింది. రెండురోజుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను ఖరారు చేయనున్నట్లు సమాచారం. మహిళల రిజర్వేషన్లను శుక్ర, శనివారాల్లో పూర్తిచేసే అవకాశాలున్నాయి. అనంతరం నవంబర్ 4 లేదా 5న మున్సిపల్ ఎన్నికలకు


మిగతా 4వ పేజీలో


| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 73.00 | రిటైల్ లైవ్ | 95.00 |
| డ్రెస్‌డ్ | 138.00 | స్కిన్‌లెస్ | 157.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 393.00 | రంగారెడ్డి | 393.00 |
| మెదక్ | 393.00 | కరీంనగర్ | 396.00 |
| వరంగల్ | 396.00 | చిల్లర ధర | 4.50 |

# పల్లె బస్సుల పరుగులు

- రోడ్డెక్కినవి 72.80% ఆర్టీసీ బస్సులు
- 100% తిప్పేలా చర్యలు
- గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో ట్రిప్పులు
- గ్రేటర్ హైదరాబాద్‌లో పెరిగిన సిటీ సర్వీసులు
- ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం



బుధవారం మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న విద్యార్థులు

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:**

రాష్ట్రంలో రోడ్డెక్కుతున్న ఆర్టీసీ బస్సు సర్వీసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో మెరుగైన సేవలందుతున్నాయి. రవాణా, ఆర్టీసీ, పోలీస్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా బస్సులను తిప్పుతుండటంతో సమ్మెలో ఉన్న ఆర్టీసీ ఉద్యోగులు కొన్నిచోట్ల బస్సులను అడ్డుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు బెడిసికొడుతున్నాయి. మరోవైపు ఆర్టీవో కార్యాలయాల్లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూములను నిరాటంకంగా కొనసాగిస్తున్నారు. కాగా బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 72.80 శాతం ఆర్టీసీ బస్సులు నడిచాయి.

**గ్రేటర్ హైదరాబాద్‌లో పెరిగిన సిటీ సర్వీసులు..**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సిటీ సర్వీసులను పెంచడంలో అధికారులు సఫలమయ్యారు. గతంతో పోలిస్తే బుధవారంనాటికి సిటీ సర్వీసులు పెరిగాయి. హైదరాబాద్ రీజియన్ పరిధిలో


మిగతా 7వ పేజీలో


## ఆర్టీసీని విలీనం చేయాల్సిందే

సకలజన భేరి సభలో ప్రతిపక్షాలు, సంఘాల డిమాండ్

ఆర్టీసీ లాభాల్లోకి వచ్చే అవకాశమే లేదన్న నేతలు

**హైదరాబాద్/ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** టీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని ప్రతిపక్షాలు, ఆర్టీసీ కార్మికసంఘాలు డిమాండ్‌చేశాయి. డీజిల్‌పై వ్యాట్ తదితర పన్నులు వేయడం, ఆర్టీసీ చార్జీలు పెంచకపోవడం వల్ల ఆర్టీసీ లాభాల్లోకి వచ్చే అవకాశమేలేదని, అందుకే సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్‌చేశాయి. బుధవారం సాయంత్రం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో టీఎస్‌ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో సకల జనభేరి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు తెలంగాణ ఉద్యమంలో కీలకభూమిక పోషించారని, వారి డిమాండ్లను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం మాట్లాడుతూ ఆర్టీసీ ఇబ్బందుల్లో ఉన్నదని, ఇబ్బందుల పరిష్కారానికి విలీనమే మార్గమని అన్నారు. ఆర్టీసీ లాభాల్లోకి వచ్చే పరిస్థితే


మిగతా 7వ పేజీలో


## చిన్న పరిశ్రమల దండుమల్కాపురం

దేశానికే ఆదర్శంగా రూపుదిద్దుకుంటున్న టీఎస్ఐఐసీ -టీఐఎఫ్- గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్

మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా రేపు ప్రారంభం



దండుమల్కాపురం ఇండస్ట్రియల్ పార్కు వద్ద ఏర్పాటుచేసిన పైలాన్

- 435 ఎకరాలు.. 450 పరిశ్రమలు.. 1553 కోట్ల పెట్టుబడులు
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 35 వేల మందికి ఉపాధి అవకాశాలు
- 1500 ఎకరాల భూ సేకరణతో మరో 50 వేల మందికి..


9


## నేటినుంచి జమ్ముకశ్మీర్ రెండు ముక్కలు

రాష్ట్రంగా గుర్తింపు గల్లంతు..

రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా ఆవిర్భావం

జమ్ముకశ్మీర్‌కు శాసనసభ.. లడఖ్‌కు ఉండదు

పాలన పగ్గాలు చేపట్టనున్న ఇద్దరు లెఫ్టినెంట్ గవర్నర్లు




**న్యూఢిల్లీ:** బుధవారం (అక్టోబర్ 30) అర్ధరాత్రి నుంచి మన దేశంలోని రాష్ట్రాల సంఖ్యలో ఒకటి తగ్గిపోయింది. అదే సమయంలో కేంద్ర పాలిత ప్రాంతాలు రెండు కొత్తగా ఆవిర్భవించాయి. ఇప్పటి వరకు రాష్ట్రంగా ఉన్న జమ్ముకశ్మీర్ రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా మారిపోవడమే దీనికి కారణం. జమ్ముకశ్మీర్ రాష్ట్రాన్ని విభజిస్తూ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆగస్టు 9న జారీ చేసిన ఉత్తర్వులు బుధవారం అర్ధరాత్రి నుంచి అమలులోకి


మిగతా 5వ పేజీలో


# తీర పట్నాలకు ముంపు ముప్పు



ముంబై తీర ప్రాంతం

30 ఏండ్లలో ముంబై మహానగరం సముద్రంలో మునిగిపోయే ప్రమాదం

- కోల్‌కతాకూ పెనుముప్పు
- భూతాపంతో పెరుగనున్న సముద్రమట్టాలు
- ప్రపంచవ్యాప్తంగా తీరప్రాంత నగరాలకు శాపం
- హెచ్చరించిన అమెరికా అధ్యయన సంస్థ

**2050 నాటికి** ముంబై మహానగరం సముద్రంలో మునిగిపోతుందని అమెరికాకు చెందిన క్లైమేట్ సెంట్రల్ సంస్థ హెచ్చరించింది. కోల్‌కతాకూ పెనుముప్పు పొంచి ఉన్నదని తెలిపింది. గ్లోబల్ వార్మింగ్ కారణంగా సముద్ర మట్టాలు వేగంగా పెరుగుతున్నాయని, మరో 30 ఏండ్లలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తీరప్రాంత నగరాల రూపురేఖలు మారిపోతాయని స్పష్టం చేసింది. ముంపు ప్రభావం ఇప్పటివరకు ఊహించినదానికన్నా మూడు రెట్లు ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నది. ప్రస్తుతం భూగోళంలో 15 కోట్ల మంది నివసిస్తున్న ప్రాంతాన్ని సముద్రం ఆక్రమిస్తుందని, 30 కోట్ల మంది నివసిస్తున్న ప్రాంతంపై భీకరమైన వరదలు విరుచుకుపడుతాయని స్పష్టంచేసింది. బాధితుల్లో 75 శాతం మంది భారత్, చైనా, బంగ్లాదేశ్, వియత్నాం, థాయిలాండ్, ఇండోనేషియాల్లోనే ఉంటారని వెల్లడించింది.


వివరాలు 5వ పేజీలో




బుధవారం ఢిల్లీలో మేకిన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన స్టేట్స్ కన్సల్టేషన్ సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కే తారకరామారావు

## 'కలర్స్'పై ఐటీ దాడులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కలర్స్ హెల్త్‌కేర్ సెంటర్లపై ఆదాయం పన్ను (ఐటీ) అధికారులు బుధవారం దాడులు జరిపారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కార్యాలయంతోపాటు దేశవ్యాప్తంగా 49 చోట్ల దాడులు జరిగినట్లు సమాచారం. మనుషుల బరువు తగ్గించడంలో పేరొందిన 'కలర్స్' సంస్థ ఆదాయం పన్ను లెక్కలు సరిగా చూపకపోవడంతో అధికారులు ఆ సంస్థ కార్యకలాపాలను, ఆదాయ, వ్యయాలను పరిశీలిస్తున్నారు.

## మెడికల్ కిట్ల గుట్టుపై ఆరా!

- మరింత లోతుగా ఏసీబీ అన్వేషణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఐఎంఎస్ (ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్) కుంభకోణంలో వెలుగు చూసిన కొత్తకోణంపై ఏసీబీ అధికారులు మరింత దృష్టిపెట్టారు. ఐఎంఎస్ డైరెక్టర్ డాక్టర్ దేవికా రాణి, జేడీ పద్మ, ఇతర సిబ్బంది కలిసి మెడికల్ కిట్ల కొనుగోలులో రూ.కోట్లు కొల్లగొట్టినట్టు ఇప్పటికే ప్రాథమికంగా ఆధారాలు సేకరించిన అధికారులు.. మరింత లోతుగా అన్వేషిస్తున్నట్టు సమాచారం. 2017-18లో మెడికల్ కిట్ల కోసం రూ.60 కోట్ల బడ్జెట్ విడుదల కాగా, వీటితో 22 ఇండెంట్లు పెట్టి కిట్లు కొనుగోలు చేసినట్టు రికార్డుల్లో నమోదైంది. వీటిలో ఇప్పటికే రెండు ఇండెంట్లు పరిశీలించిన ఏసీబీ అధికారులు.. రూ.1.79 కోట్ల అవినీతిని గుర్తించిన విషయం తెలిసిందే. ఇదే తరహాలో మరికొన్ని ఇండెంట్లను పరిశీలిస్తున్నట్టు సమాచారం. వీటిని విశ్లేషిస్తే ఇంకా ఎన్ని కోట్లు కొల్లగొట్టారన్నది తేలే అవకాశం ఉన్నది. ఈ మెడికల్ కిట్ల వ్యవహారంలో ఇంకా ఎవరెవరున్నారనే విషయంపై ఏసీబీ బృందాలు ఆరా తీస్తున్నట్టు తెలిసింది.

## వైద్యరంగంపై నేడు క్యాబినెట్ సబ్ కమిటీ భేటీ

- పాల్గొననున్న మంత్రులు ఈటల, కేటీఆర్, తలసాని, ఎర్రబెల్లి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆరోగ్య తెలంగాణ సాధన దిశగా రాష్ట్రంలో వైద్య రంగంలో చేపట్టాల్సిన ప్రాధాన్యాంశాలపై చర్చించి, తగిన ప్రతిపాదనలు రూపొందించేందుకు గురువారం క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశం కానున్నది. మధ్యాహ్నం ఎంసీహెచ్చార్డీలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొననున్నారు. వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు హాజరువుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేయడం, వనరులను సద్వినియోగం చేసుకుంటూ పేదలకు మెరుగైన వైద్యం అందించడం, వైద్యసేవల విస్తరణకు వెంటనే చేపట్టాల్సిన చర్యలు, తదితర అంశాలు సమావేశంలో చర్చిస్తారు.



# హైదరాబాద్-బెంగళూరు-చెన్నై పారిశ్రామిక కారిడార్

- కేంద్రానికి మంత్రి కేటీఆర్ సూచన
- ఫార్మా, ఏరోస్పేస్, రక్షణరంగాలకు ఊతం
- రాష్ట్రాల సంప్రదింపుల వర్క్‌షాప్‌లో మంత్రి కే తారకరామారావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్, బెంగళూరు, చెన్నైల మధ్య పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటుచేసే అంశాన్ని పరిశీలించాలని రాష్ట్ర ఐటీ, పురపాలక, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. బుధవారం ఢిల్లీలో.. మేకిన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కేంద్ర వాణిజ్యమంత్రి పీయూష్‌గోయల్ అధ్యక్షతన జరిగిన స్టేట్స్ కన్సల్టేషన్స్ వర్క్‌షాప్‌లో తెలంగాణ ప్రభుత్వం తరపున మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక విధానాలను వివరించారు. టీఎస్ఐపాస్ ద్వారా, ఇతర పారిశ్రామిక విధానాల ద్వారా రాష్ట్రంలో పారిశ్రామికవర్గాలకు చేయూతను అందిస్తున్న విధానం.. తద్వారా తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతున్న తీరును వెల్లడించారు. దీంతోపాటు దేశంలో పారిశ్రామికీకరణ మరింత వేగంగా జరుగటం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై అనేక సూచనలు, సలహాలను ఇచ్చారు. హైదరాబాద్ భౌగోళికంగా దేశానికి నడిబొడ్డున ఉన్నదని, ఈ నేపథ్యంలో హైదరాబాద్-బెంగళూరు-చెన్నై పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుచేసే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. ఐటీ రంగంలో దేశంలోనే అగ్రగామి నగరాలుగా ఉన్న హైదరాబాద్, బెంగళూరుతోపాటు పారిశ్రామిక రంగంలో ముందు వరుసలో ఉన్న చెన్నై నగరాన్ని కలిపి ఏర్పాటుచేసే పారిశ్రామిక కారిడార్ వల్ల అనేక ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు. అంతేకాకుండా హైదరాబాద్ నగరంలో ఉన్న ఫార్మా, ఏరోస్పేస్, రక్షణ రంగ పరిశ్రమలకు మరింత ఊతమిచ్చినట్లవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం నిర్దేశించుకున్న పద్నాలుగు ప్రాధాన్య రంగాల్లో పెట్టుబడులను ఏ విధంగా ఆకర్షిస్తున్నదీ మంత్రి కేటీఆర్ వివరించారు. పారిశ్రామికరంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు కేంద్రం నుంచి మరింత సహకారం కావాలని కోరారు.

# విద్యార్థుల ఫిర్యాదుల కోసం ప్రత్యేక సెల్

ఇంటర్ బోర్డులో ఏర్పాటుకు చర్యలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో వచ్చే ఏడాది మార్చిలో నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షలను దృష్టిలోపెట్టుకుని విద్యార్థుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, వెంటనే పరిష్కారం చూపాలని ఇంటర్ బోర్డు నిర్ణయం తీసుకున్నది. అందుకు ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఒక ప్రత్యేక సెల్‌ను త్వరలో ఏర్పాటుచేస్తామని, ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచుతామని ఇంటర్ బోర్డు కార్యదర్శి సయ్యద్ ఒమర్ జలీల్ తెలిపారు. విద్యార్థులకు పరీక్షలపై ఏమైనా సందేహాలు ఉన్నా, ఫిర్యాదులు చేయాలన్నా బోర్డులోని ఈ విభాగాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు. ఇంటర్ విద్యాశాఖ కమిషనర్ కార్యాలయ సేవలను పూర్తిగా ఈ-ఆఫీస్ పరిధిలోకి తీసుకెళ్లి, నవంబర్ 1 నుంచి సేవలను అందించనున్నామని తెలిపారు. తొలుత ఇంటర్ విద్యా కమిషనర్ కార్యాలయం, విద్యాశాఖ కార్యదర్శి కార్యాలయం వరకు ఈ-ఆఫీస్‌ను పరిమితం చేశామని, తర్వాత ఇంటర్ విద్యా ప్రాంతీయ విద్యాధికారి కార్యాలయానికి కూడా విస్తరించే ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు.

# బాట ఇవ్వండి

మూడోపేజీ తరువాయి...

రక్షణశాఖ మంత్రికి వివరించారు. దేశంలో ఆర్థికాభివృద్ధి జరగాలంటే రోడ్ల నెట్‌వర్క్ అభివృద్ధి కావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్తున్న విధంగానే తాము వ్యూహాత్మక రోడ్ల అభివృద్ధి ప్రణాళిక (ఎస్సార్డీపీ) కింద రామగుండం- హైదరాబాద్, నాగ్‌పూర్-హైదరాబాద్ రోడ్ల అభివృద్ధి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు మంత్రి కేటీఆర్ వెల్లడించారు. ఇందుకోసం నగర శివార్లలోని కంటోన్మెంట్ ఏరియా భూములు అవసరమవుతాయని తెలిపారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం వల్ల కంటోన్మెంట్ ప్రాంతంలో నిత్యం ఎదురయ్యే ట్రాఫిక్ సమస్యలు తొలిగిపోతాయని రక్షణమంత్రికి వివరించారు. అంతేకాకుండా హైదరాబాద్‌కు ఉత్తర తెలంగాణ పట్టణాలైన కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్, రామగుండం తదితర పట్టణాలకు రోడ్ నెట్‌వర్క్ పెరుగుతుందన్నారు. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి రక్షణశాఖ భూములను బదలాయించాలని సీఎం కేసీఆర్ ఇప్పటికే కోరిన విషయాన్ని మంత్రి కేటీఆర్ రాజ్‌నాథ్‌కు గుర్తుచేశారు. తాను రాజ్‌నాథ్‌ను కలిసి ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాన్ని కోరినట్లు ఆ తర్వాత ట్విట్టర్‌లో మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

### శానిటేషన్ హబ్‌కు రూ.100 కోట్లు ఇవ్వండి

తెలంగాణలో శానిటేషన్ హబ్ ఏర్పాటుకు వందకోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించాలని మంత్రి కేటీఆర్.. కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణశాఖల మంత్రి హర్దీప్‌సింగ్‌పూరిని కోరారు. శానిటేషన్ హబ్ ఏర్పాటును తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా డిసెంబర్ నెలలో ప్రకటిస్తుందని హర్దీప్‌సింగ్‌కు తెలిపారు. ఈ హబ్‌ద్వారా తెలంగాణకే కాకుండా ఇతర రాష్ట్రాలకు కూడా పారిశుద్ధ్యరంగంలో సమస్యలను అధిగమించేందుకు, పరిష్కారాలను కనుగొనేందుకు పరిశోధనలు కొనసాగుతాయని, పారిశుద్ధ్య రంగంలో ఆదర్శ విధానాలు, పరిశోధనలను పెంచేలా కార్యకలాపాలు జరుగుతాయని పేర్కొన్నారు. శానిటేషన్ హబ్‌కోసం తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాతో కలిసి పనిచేస్తున్నదని చెప్పారు.



ఢిల్లీలో కేంద్ర పట్టణాభివృద్ధి, గృహనిర్మాణశాఖ మంత్రి హర్దీప్‌సింగ్‌పూరికి జ్ఞాపికను బహూకరిస్తున్న ఐటీశాఖ మంత్రి కే తారకరామారావు. చిత్రంలో జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్ ఉన్నారు.

### సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టుకు రూ.400 కోట్లు ఇవ్వండి

హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ఘనవ్యర్థాల నిర్వహణ ప్రాజెక్టులో అదనంగా చేపట్టాల్సిన కార్యక్రమాలకోసం మరో రూ.400 కోట్లను స్వచ్ఛభారత్ మిషన్ లేదా, ఇతర కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాల కిందనైనా మంజూరు చేయాలని మంత్రి కేటీఆర్ కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్‌పూరిని కోరారు. ఇప్పటికే ప్రతి రోజూ ఏడు వేల టన్నుల వ్యర్థాలను సేకరిస్తున్నామని, జీహెచ్‌ఎంసీ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టును పీపీపీ పద్ధతిలో సేకరిస్తున్నదని చెప్పారు. 2018లో స్వచ్ఛభారత్ మిషన్ కింద ఉత్తమ రాజధాని నగరంగా హైదరాబాద్ ఎంపికైన విషయాన్ని మంత్రి కేటీఆర్ కేంద్ర మంత్రికి గుర్తుచేశారు. ప్రధాని ఇచ్చిన పిలుపుమేరకు పురపాలికలను స్వచ్ఛ పట్టణాలుగా మార్చడానికి నిబద్ధతతో పనిచేస్తున్నామని వివరించారు.

## మెట్రోరైల్‌కు రూ.254 కోట్ల బకాయిలు విడుదలచేయండి

**హైదరాబాద్** మెట్రోరైల్ ప్రాజెక్టు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కోసం కేటాయించిన నిధుల్లో కేంద్రం నుంచి రావాల్సిన రూ.254 కోట్లను వెంటనే విడుదల చేయాల్సిందిగా హర్దీప్‌సింగ్ పూరిని మంత్రి కేటీఆర్ కోరారు. ఏరోస్పేస్ రంగంలో తెలంగాణ ప్రభుత్వం యునైటెడ్ కింగ్‌డం (యూకే)లోని ప్రముఖ యూనివర్సిటీతో కలిసి శిక్షణ కార్యక్రమాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నదని, ఇందుకోసం బేగంపేట ఎయిర్‌పోర్టును ఉపయోగించుకునేలా వెసులుబాటు కల్పించాలని కోరారు. మంత్రి కేటీఆర్ వెంట కేంద్ర మంత్రులను కలిసిన వారిలో పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్, జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులున్నారు.

గురువారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, కేంద్ర వాణిజ్య, రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను మంత్రి కేటీఆర్ కలువనున్నారు.

## ..4 లేదా 5న నోటిఫికేషన్?

మూడోపేజీ తరువాయి...

షెడ్యూల్, నోటిఫికేషన్ వెలువరిస్తారని తెలుస్తున్నది. నవంబర్ 25 వరకు ఎన్నికల ప్రక్రియను పూర్తిచేయనున్నారు.

### ఓటర్లు 50.37 లక్షల మంది

ఈ ఏడాది జూలై 16న విడుదలచేసిన జాబితా ఆధారంగా రాష్ట్రంలో 121 మున్సిపాలిటీలు, 9 కార్పొరేషన్ల పరిధిలో 50,37,498 మంది ఓటర్లు ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికలసంఘం అధికారులు వెల్లడించారు. ఇటీవల మార్పులు, చేర్పులు, సవరణలకు అవకాశం కల్పించడంతో మరో నాలుగైదు లక్షలమంది ఓటర్లు పెరిగే అవకాశాలున్నాయని చెప్తున్నారు. జూలై నాటి జాబితా ఆధారంగా పోలింగ్ కేంద్రాలు, వార్డుల విభజన చేస్తున్నట్లు తెలుస్తున్నది. మరోవైపు ఎన్నికలు జరిగే మున్సిపాలిటీల పరిధిలో బ్యాలెట్ పత్రాల ముద్రణకు కలెక్టర్లకు ఆదేశాలిచ్చారు. గత ఎన్నికలతో పోల్చితే దాదాపు 10%-20% అదనంగా బ్యాలెట్ పత్రాలను ముద్రించుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని దాదాపు 50 మున్సిపాలిటీల పరిధిలో ఇంకా వార్డుల విభజన జాబితాను ఫైనల్ చేయకపోవడంపై ఎస్ఈసీ నాగిరెడ్డి మంగళవారం జరిగిన కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో పలు సూచనలు చేశారు. ఈ మేరకు ఈ ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలుస్తున్నది.

### అధికారులు, సిబ్బంది నియామకం

మున్సిపాలిటీలవారీగా ఎన్నికల అధికారులు, సిబ్బందిని నియమిస్తున్నారు. మంగళవారం కలెక్టర్ల సదస్సు అనంతరం సిబ్బందికి, అధికారులకు విధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి పీవో, ఏపీవోలు, ఓపీవోలను నియమించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం పీవోలను 20%, ఏపీవోలను 10% నుంచి 20%, ఓపీవోలను 10% నుంచి 30% వరకు అదనంగా నియమిస్తూ రిజర్వులో ఉండాలని ఆదేశాలిచ్చారు. మరోవైపు జిల్లాస్థాయి అధికారులను నోడల్ అధికారులుగా నియమించారు. నామినేషన్ల ప్రక్రియ, పోలింగ్ ప్రక్రియకు నోడల్ అధికారులను విభాగాలవారీగా నియమిస్తున్నారు.

## నేడు ఏక్తా దివస్

అన్ని కార్యాలయాల్లో ప్రతిజ్ఞ చేయాలని ఉత్తర్వులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గురువారం సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా జరుపుకొనే ఏక్తా దివస్‌ను పురస్కరించుకొని సాధారణ పరిపాలనశాఖ అధికారులు, ఉద్యోగులు ప్రతిజ్ఞచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఉత్తర్వులు జారీచేశారు. గురువారం ఉదయం 11 గంటలకు సచివాలయంలోని బీ-బ్లాక్ కారిడార్‌లో ప్రతిజ్ఞ చేయాలని సూచించారు.

### ముహూర్తం

సూర్యోదయం: 6.15 గంటలకు

సూర్యాస్తమయం: 5.41 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం, చతుర్థి, నక్షత్రం: జ్యేష్ఠ రాత్రి 9.30 వరకు, తదుపరి మూల, అమృతఘడియలు: మధ్యాహ్నం 12.53 నుంచి 2.27 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.23 నుంచి 2.49 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 10.03 నుంచి 10.49 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.38 నుంచి 3.24 వరకు, వర్జ్యం: శుక్రవారం ఉదయం 5.37 నుంచి 7.15 వరకు.

# ఎమ్మెల్యేగా సైదిరెడ్డి ప్రమాణం

- అభినందించిన స్పీకర్ పోచారం
- గన్‌పార్క్ వద్ద అమరుల స్తూపానికి నివాళులర్పించిన సైదిరెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో శాసనసభ్యుడిగా ఎన్నికైన శానంపూడి సైదిరెడ్డి బుధవారం ఎమ్మెల్యేగా ప్రమాణం చేశారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తన చాంబర్‌లో సైదిరెడ్డితో శాసనసభ్యుడిగా ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఆయనను స్పీకర్ పోచారం అభినందించారు. కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఉపసభాపతి టీ పద్మారావు, మంత్రులు మహమూద్‌అలీ, జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, వీ శ్రీనివాస్‌గౌడ్, సీహెచ్ మల్లారెడ్డి, ఎంపీలు బడుగుల లింగయ్యయాదవ్, రంజిత్‌రెడ్డి, నల్లగొండ జిల్లా ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, తేరా చిన్నపరెడ్డి, యాదాద్రి భువనగిరి జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్తూపానికి సైదిరెడ్డి నివాళి అర్పించారు. శానంపూడిని అభినందించడానికి నియోజకవర్గానికి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, టీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా టీఆర్‌ఎస్ పార్టీ ప్రధానకార్యదర్శి పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సొంత గడ్డ మీదనే సీఎం కేసీఆర్ దెబ్బ ఏమిటో రుచి చూపించామన్నారు. పదేండ్లలో హుజూర్‌నగర్‌లో ఎలాంటి పనులు జరుగలేదని.. ఇకనుంచి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తామని చెప్పారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తారని తెలిపారు. నవంబర్ 1న మంత్రి కేటీఆర్ హుజూర్‌నగర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారని వివరించారు. ఎమ్మెల్యే సైదిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత తనపై ఉన్నదని, పెద్దఎత్తున నిధులు కేటాయించిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.






శానంపూడి సైదిరెడ్డితో ఎమ్మెల్యేగా ప్రమాణం చేయిస్తున్న అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మారావు, మంత్రులు మహమూద్‌అలీ, శ్రీనివాస్‌గౌడ్, జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు ఉన్నారు. గన్‌పార్క్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి. పక్కన శానంపూడి సైదిరెడ్డి కూడా ఉన్నారు.

## పెరిగిన ప్రవేశాల స్థూల నిష్పత్తి

- గవర్నర్‌కు నివేదిక అందజేసిన ఉన్నత విద్యామండలి
- విజయవంతంగా అమలవుతున్న సీబీసీఎస్
- త్వరలో వర్సిటీల్లో 1,551 అధ్యాపక పోస్టుల భర్తీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉన్నత విద్య అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పలు చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు.. గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం చేపట్టిన చర్యలపై రూపొందించిన నివేదికను ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి.. ఇటీవల విశ్వవిద్యాలయాల వైస్‌చాన్స్‌లర్లతో జరిపిన సమావేశంలో గవర్నర్‌కు అందజేశారు. నివేదికను బుధవారం ఉన్నత విద్యామండలి అధికారులు విడుదలచేశారు. దీని ప్రకారం రాష్ట్రంలో కాలేజీల్లో విద్యార్థుల ప్రవేశాల స్థూల నిష్పత్తి (జీఈఆర్) దేశ స్థూల నిష్పత్తి కంటే ఎక్కువగా ఉన్నది. 2018-19 విద్యాసంవత్సరానికి దేశవ్యాప్తంగా జీఈఆర్ 26.3 నిష్పత్తి కాగా.. రాష్ట్రంలో 36.2గా నమోదైంది. కేంద్రం కంటే 9.9 సగటు నిష్పత్తి రాష్ట్రంలో అధికంగా నమోదైంది. దేశవ్యాప్తంగా ఒక కాలేజీకి సగటున 693 ప్రవేశాలు నమోదు కాగా.. తెలంగాణలో 554 ప్రవేశాలు జరిగాయి. ఈ క్రమంలో రాష్ట్రంలోని ఇంజినీరింగ్, మెడికల్, ఎంసీఏ, ఎంబీఏ వంటి పలు వృత్తివిద్యా కాలేజీల్లో నాణ్యమైన విద్యావిధానాన్ని అందుబాటులోకి తేవడం వల్ల సగటు ప్రవేశాల సంఖ్య నికరంగా ఉన్నదని నివేదికలో పేర్కొన్నారు.

### ఉన్నత విద్యలో సంస్కరణలు

రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతవిద్యలో సంస్కరణలు చేపట్టిందని, 2017-18 విద్యాసంవత్సరంలో వర్సిటీలకు రూ.420 కోట్ల నిధులు కేటాయించిందని, అన్ని వర్సిటీల్లో కలిపి 1,551 అధ్యాపక పోస్టుల భర్తీ ప్రక్రియ మొదలుకానున్నదని, తొలుత 1,061 పోస్టులను భర్తీ చేయనున్నదని నివేదిక ద్వారా గవర్నర్‌కు తెలిపారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం (సీబీసీఎస్)ను విజయవంతంగా అమలుపరుస్తున్నారని చెప్పారు. డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలను దోస్త్ పేరుతో తొలిసారి ఆన్‌లైన్ ద్వారా చేపట్టిన విధానం విజయవంతమైందని వివరించారు.



మహబూబాబాద్ జిల్లా పెద్దతండాలో విచారణ చేపడుతున్న తాసిల్దార్ పున్నంచందర్

## లోకం పోకడ




# పాస్‌బుక్ జారీకి చర్యలు

మహబూబాబాద్ జిల్లా పెద్దతండాలో తాసిల్దార్ విచారణ

ధర్మగంట నమస్తే ఎఫెక్ట్

**నెల్లికుదురు:** ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని పెద్ద తండా (చిన్నముప్పారం) గ్రామానికి చెందిన రైతు ధరావత్ చిరంజీవి భూమికి పట్టాదారు పాస్‌బుక్ జారీచేసేందుకు చర్యలు తీసుకుంటానని నెల్లికుదురు తాసిల్దార్ అనిశెట్టి పున్నంచందర్ అన్నారు. తన భూమిని పట్టా చేయడంలేదని రైతు చిరంజీవి మంగళవారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. బుధవారం తాసిల్దార్ పున్నంచందర్ పెద్దతండాకు వెళ్లి రైతు భూమిపై విచారణ చేపట్టారు. చిరంజీవి 658/బీ/2 సర్వేనంబర్‌లో 24 గుంటల భూమికి అనుభవదారుడిగా నమోదై ఉన్నాడని, తన సోదరుడు ధరావత్ రవి నుంచి 9 గుంటల భూమిని మే 2019న కొనుగోలు చేశాడని పున్నంచందర్ తెలిపారు. కానీ, నేటివరకు రిజిస్ట్రేషన్ చేసుకోలేదని చెప్పారు. చిరంజీవి కోరినప్పుడు రిజిస్ట్రేషన్ చేస్తానని స్థానిక సర్పంచ్ రాజునాయక్, రైతు సమన్వయ సమితి గ్రామ కో ఆర్డినేటర్ రాయిలీ ఉప్పలయ్యతోపాటు గ్రామ రైతుల సమక్షంలో రవి వాంగ్మూలం తీసుకున్నట్టు పేర్కొన్నారు. చిరంజీవి నుంచి సాదాబైనామా దరఖాస్తు తీసుకున్నామని, త్వరలో పట్టాదారు పాస్‌బుక్ జారీకి చర్యలు తీసుకుంటానని ఆయన భరోసా ఇచ్చారు.

# రాష్ట్రంలో 11% అడవులు కబ్జా

## మంత్రివర్గ ఉపసంఘానికి అటవీశాఖ నివేదిక

- కబ్జాదారుల చెరలో 2.94 లక్షల హెక్టార్లు
- ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు తీరని నష్టం
- అటవీ విస్తీర్ణం పెంపుదలపై సర్కార్ దృష్టి

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో దాదాపు 11 శాతం అడవులు కబ్జాదారుల చెరలో చిక్కాయి. రాష్ట్రవ్యాప్తంగా 2.94 లక్షల హెక్టార్ల (7.41 లక్షల ఎకరాలు) అటవీ భూమి ఆక్రమణల పాలయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలకుల నిర్లక్ష్యం కారణంగా తెలంగాణ ప్రాంతంలోని అటవీ సంపదకు అపార నష్టం వాటిల్లిందని తాజా నివేదికలో అటవీశాఖ పేర్కొన్నది. ఈ నివేదికను అడవుల రక్షణ, పచ్చదనం పెంపుపై ఏర్పాటైన క్యాబినెట్ సబ్‌కమిటీకి సమర్పించింది. ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో కబ్జాల ప్రభావం తీవ్రంగా ఉంది. మహబూబ్‌నగర్ జిల్లాలో అతి తక్కువ విస్తీర్ణంలో అడవులు కబ్జాకు గురయ్యాయి. అడవుల రక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవడంతోపాటు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పచ్చదనాన్ని పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై అధ్యయనం చేసేందుకు సీఎం కేసీఆర్ క్యాబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటుచేశారు. అటవీ, పర్యావరణశాఖల మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటైన ఈ కమిటీలో మంత్రులు కే తారకరామారావు, జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, ప్రశాంత్‌రెడ్డి ఉన్నారు. తెలంగాణ ఆవిర్భావానికి ముందు అడవుల పరిస్థితి, తాజా పరిస్థితిని అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా క్యాబినెట్ సబ్‌కమిటీకి వివరించారు. తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలుచేయడం ద్వారా రాష్ట్రంలోని చాలా చోట్ల పచ్చదనం పెరిగిందని, అడవుల పునరుజ్జీవనం మంచి ఫలితాలనిచ్చిందని వెల్లడించారు. ఆక్రమణకు గురైన అడవులను కబ్జాదారుల చెరనుంచి విడిపించి అటవీ విస్తీర్ణాన్ని పెంచడానికి చర్యలు తీసుకొంటున్నట్లు అధికారులు వెల్లడించారు.



### ఉమ్మడి జిల్లాల్లో ఆక్రమణకు గురైన అడవుల వివరాలు (హెక్టార్లలో..)

| జిల్లా | భౌగోళిక విస్తీర్ణం | అటవీ విస్తీర్ణం | కబ్జాకు గురైన అడవులు | ఆక్రమణ అడవుల శాతం |
|---|---|---|---|---|
| ఆదిలాబాద్ | 16,12,750 | 7,10,130 | 85,523 | 12.04 |
| ఖమ్మం | 13,18,017 | 5,99,526 | 1,08,194 | 18.05 |
| వరంగల్ | 12,83,192 | 4,02,345 | 57,883 | 14.39 |
| మహబూబ్‌నగర్ | 18,47,413 | 3,04,285 | 1,383 | 0.45 |
| కరీంనగర్ | 11,85,511 | 2,36,128 | 9,878 | 4.18 |
| నిజామాబాద్ | 7,96,835 | 1,76,842 | 10,751 | 6.08 |
| మెదక్ | 9,71,056 | 96,312 | 8,845 | 9.18 |
| నల్లగొండ | 14,23,602 | 88,915 | 4,087 | 4.60 |
| హైదరాబాద్, రంగారెడ్డి | 7,71,852 | 75,887 | 8,059 | 10.62 |
| **మొత్తం** | **1,12,10,228** | **26,90,370** | **2,94,603** | **10.95** |

బగ్దాదీ ఆచూకీ చెప్పాడు..

## 177 కోట్ల రివార్డు పట్టబోతున్నాడు!

**వాషింగ్టన్:** ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) అధిపతి అబు బకర్ అల్-బగ్దాదీని మట్టుపెట్టడంలో అమెరికా దళాలకు సమాచారం అందించిన వ్యక్తికి భారీ నజరానా అందనున్నది. సదరు వ్యక్తి ఐఎస్‌లో పని చేస్తూనే ఈ సమాచారం అందించాడు. బగ్దాదీ ఆచూకీ తెలియజేసిన వాళ్లకు 2.5 కోట్ల డాలర్లను(రూ. 177 కోట్లు) అందజేస్తామని అమెరికా ఇదివరకే ప్రకటించింది. బగ్దాదీ తలదాచుకున్న ప్రాంతం ఆనవాళ్లను అమెరికాకు తెలియజేసి అతన్ని అంతమొందించడానికి సాయపడిన సదరు వ్యక్తికి ఈ నగదులో కొంతభాగం లేదా మొత్తం ఇవ్వబోతున్నారు. సిరియాలో బగ్దాదీ దాక్కున్న ప్రాంతం,ఆ ఇంట్లోని గదుల స్వరూపం, కాంపౌండ్ నిర్మాణం, అతనికి భద్రతగా ఉన్న సిబ్బంది, సొరంగాల సమాచారం ఇలా ప్రతీ అంశాన్ని సదరు వ్యక్తి కచ్చితత్వంతో తెలియజేశాడని సిరియన్ డెమొక్రటిక్ దళాలు(ఎస్‌డీఎఫ్) జనరల్ మజ్‌లౌమ్ అబ్ది తెలిపారు. అయితే, ఆ వ్యక్తి ఏ దేశానికి చెందిన వారన్న విషయం అధికారులు ఇంకా వెల్లడించలేదు.

## దావానలంలో కోలా ఎలుగుబంట్లు

ఆస్ట్రేలియాలో ఆరని అగ్నిజ్వాలలు



**సిడ్నీ:** ఆస్ట్రేలియాలోని న్యూసౌత్ వేల్స్ రాష్ట్రం పోర్ట్ మక్వారీలో శనివారం పిడుగుపాటుతో రగులుకున్న అగ్ని జ్వాలలు 400 కి.మీ. మేర విస్తరించాయి. దీంతో ఈ ప్రాంతంలో నివసిస్తున్న కోలా ఎలుగుబంట్లు వందల సంఖ్యలో అగ్నికి ఆహుతైనట్టు అటవీశాఖ అధికారులు అనుమానిస్తున్నారు. ఆస్ట్రేలియాలో మాత్రమే కనిపించే ఈ కోలా ఎలుగుబంట్లు అత్యంత అరుదైన వన్యప్రాణులు. జన్యుపరంగా వైవిధ్యంగా ఉంటాయి. కంగారూల మాదిరిగా ఇవి కూడా తమ బిడ్డలను కడుపు వద్ద ఉన్న సంచిలో పెట్టుకుంటాయి. న్యూసౌత్‌వేల్స్‌లో ఇప్పటికి 70సార్లు మంటలు రగులుకున్నాయని అధికారులు తెలిపారు. మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నామన్నారు.

## ఉద్యమబాటలో కాంగ్రెస్.. ధ్యానముద్రలో రాహుల్




**న్యూఢిల్లీ, అక్టోబర్ 30:** వివిధ అంశాల్లో కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ శుక్రవారం నుంచి ఉద్యమబాట పట్టాలని నిర్ణయించింది. కానీ, ఆ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ మాత్రం ఈ కార్యక్రమాల్లో పాల్గొనకుండా ధ్యానముద్రలో ఉండనున్నారు. రాహుల్ ధ్యానం చేసేందుకు విదేశీ పర్యటనకు వెళ్లారని, అయితే, ఆయన రూపొందించిన ప్రణాళిక ప్రకారమే నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు కాంగ్రెస్ పార్టీ వెల్లడించింది. ఆర్థిక వ్యవస్థ నిర్వహణ, పెరుగుతున్న నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం తదితరాలపై కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా నవంబర్ 1 నుంచి 8వ తేదీ మధ్య దాదాపు 35 నగరాల్లో పార్టీ సీనియర్ నాయకులు మీడియాతో మాట్లాడనున్నట్టు కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ నవంబర్ 5 నుంచి 15వ తేదీ వరకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టి బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆ పార్టీ నిర్ణయించింది. మరోవైపు, ధ్యానం కోసం రాహుల్ విదేశీ పర్యటనకు వెళ్లడంపై బీజేపీ మండిపడుతున్నది. 'భారత్.. ధ్యానానికి వారసత్వ కేంద్రంగా ఉన్నది. కానీ, రాహుల్‌గాంధీ వింతగా ధ్యానం కోసం విదేశాలను ఎంచుకొన్నారు' అని బీజేపీ ఐటీ విభాగం అధ్యక్షుడు అమిత్ మాల్వియ ఓ ట్వీట్‌లో ఎద్దేవా చేశారు.



# స్వరం తగ్గించిన సేన!

- రాష్ట్ర ప్రయోజనాల కోసం బీజేపీతోనే: సంజయ్ రౌత్
- బీజేపీ-శివసేన కూటమే సర్కారును ఏర్పాటు చేస్తుంది : సీఎం దేవేంద్ర ఫడ్నవీస్



సంజయ్ రౌత్

**ముంబై, అక్టోబర్ 30:** చెరి సగం అధికారం(50-50 ఫార్ములాపై) అంటూ నిన్నటి వరకు పట్టుబట్టిన శివసేన తన స్వరాన్ని కొంత మేర తగ్గించింది. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసమైనా బీజేపీతో శివసేన కలిసి ఉండాల్సిన అవసరం ఉన్నదని ఆ పార్టీ నేత సంజయ్ రౌత్ బుధవారం మీడియాతో అన్నారు. మరోవైపు, బీజేపీ-శివసేన కలయికతో ఏర్పడిన 'మహకూటమి' మహారాష్ట్రలో నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నదని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ బుధవారం పేర్కొన్నారు. బీజేపీ శాసనసభా పక్ష నేత పదవి కోసం జరిగిన ఎన్నికలో ఫడ్నవీస్‌కు పార్టీ సభ్యులు తిరిగి పట్టంగట్టారు. ప్రజలిచ్చిన తీర్పు ప్రకారం ప్రతిపక్షంలోనే కూర్చుంటామని ఎన్సీపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు.

**బీజేపీతోనే కలిసి ఉండాలి**

మహారాష్ట్ర ప్రజల ప్రయోజనాల దృష్ట్యా శివసేన.. బీజేపీతో కలిసి ఉండాల్సిన అవసరం ఉన్నదని శివసేన పార్టీ నేత సంజయ్ రౌత్ బుధవారం పేర్కొన్నారు. అయితే, 'పార్టీ గౌరవం' విషయంలో రాజీ పడాల్సిన అవసరం లేదని చెప్పారు. 50-50 ఫార్ములాపై మీడియా అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. 'ముందుగా నిర్ణయించిన ప్రకారం అన్నీ జరుగాలి' అని సమాధానమిచ్చారు. ప్రభుత్వం ఏర్పాటుకు అంత తొందరేమీ లేదని, కొత్త మంత్రి మండలిని తొందరగా ఏర్పాటు చేయకపోతే, తమ పార్టీలో చీలికలు ఏర్పడే అవకాశం ఉన్నదన్న వాదనలను ఆయన తోసిపుచ్చారు. మరోవైపు, మహాకూటమి మహారాష్ట్రలో నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నదని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ బుధవారం స్పష్టం చేశారు. దక్షిణ ముంబైలోని విధాన భవన్‌లో బుధవారం సమావేశమైన ఆ రాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యేలు ఫడ్నవీస్‌ను శాసన సభా పక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కేంద్రమంత్రి నరేంద్ర సింగ్ తోమర్, పార్టీ ఉపాధ్యక్షులు అవినాశ్ రాయ్ ఖన్నా ఈ సమావేశానికి హాజరయ్యారు. బీజేపీ శాసనసభా పక్ష నేతగా దేవేంద్ర ఫడ్నవీస్‌ను ఆ పార్టీ నాయకత్వం తిరిగి ఎన్నుకోవడంతో మిత్రపక్షం శివసేన తన భవిష్యత్ కార్యాచరణను సిద్ధం చేయడంలో మరింత వేగం పెంచింది. శివసేన శాసన సభా పక్షనేతను గురువారం ఎన్నుకోనున్నట్టు ఆ పార్టీ బుధవారం ప్రకటించింది. కాగా ఎన్నికల్లో గెలిచిన ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేలు బుధవారం శివసేనకు మద్దతును ప్రకటించారు. వీరిద్దరి మద్దతుతో శివసేన బలం 62కు చేరింది. రాష్ట్ర ప్రజలిచ్చిన ఆదేశం ప్రకారం తాము, మిత్రపక్షం కాంగ్రెస్ ప్రతిపక్షంలో కూర్చుంటామని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) రాష్ట్ర అధ్యక్షుడు జయంత్ పాటిల్ పేర్కొన్నారు. ఎన్సీపీ శాసనసభా పక్ష నేతగా మాజీ ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఆ పార్టీ ఓ ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వం ఏర్పాటులో శివసేనకు మద్దతిచ్చే అవకాశమేలేదని కాంగ్రెస్ స్పష్టం చేసింది. మరోవైపు, బీజేపీ, శివసేన రాజకీయ బంధాన్ని ఉద్దేశిస్తూ బీజేపీ నేత, రాష్ట్ర ఆర్థిక మంత్రి సుధీర్ ముంగంటివార్ ఓ హిందీ గీతాన్ని ఆలపించారు. 1981లో విడుదలైన 'ఏక్ ధుజే కేలియే' చిత్రంలోని 'తెరే మెరే బీచ్ మే.. కైసాహై ఏ బంధన్..' అంటూ గీతాన్ని ఆలపిస్తూ.. ప్రస్తుతం మహాకూటమిలో కొనసాగుతున్న రాజకీయ పరిణామాల్ని అన్వయించారు.

# 30 ఏండ్లలో ముంబై కనుమరుగు!

### 2050 నాటికి సముద్రంలో మునిగిపోయే ప్రమాదం

- రూపురేఖలు కోల్పోనున్న కోల్‌కతా నగరం
- తీరప్రాంత నగరాలకు శాపంగా మారుతున్న భూతాపం
- సముద్ర మట్టాల పెరుగుదలతో పొంచి ఉన్న పెను ముప్పు
- బాధితుల్లో 75 శాతం మంది ఆరు ఆసియాదేశాల్లోనే
- తీవ్రంగా నష్టపోయే దేశాల్లో చైనాది అగ్రస్థానం
- హెచ్చరించిన అమెరికా అధ్యయన సంస్థ



ముంబైలోని ప్రఖ్యాత ఛత్రపతి శివాజీ రైల్వే స్టేషన్‌ను ముంచెత్తుతున్న అలలు (ఊహాచిత్రం)

**వాషింగ్టన్, అక్టోబర్ 30:**

'మరో 30 ఏండ్లలో ముంబై మహానగరం సముద్రంలో మునిగిపోతుంది.. చారిత్రక కోల్‌కతా నగరం కనుమరుగయ్యే అవకాశాలున్నాయి. పెరుగుతున్న భూతాపం (గ్లోబల్ వార్మింగ్) 2050 నాటికి ప్రపంచ రూపురేఖలనే మార్చేస్తుంది' అమెరికాకు చెందిన అధ్యయన సంస్థ 'క్లైమేట్ సెంట్రల్' చేస్తున్న హెచ్చరికలివి. భూతాపంతో సముద్రమట్టాల పెరుగుదల, దాని ప్రభావం గతంలో ఊహించిన దానికన్నా 3 రెట్లు ఎక్కువని తెలిపింది. వీరి పరిశోధన వ్యాసం 'నేచర్ కమ్యూనికేషన్స్' జర్నల్‌లో ప్రచురితమైంది. ఆ వివరాలు..

క్లైమేట్ సెంట్రల్ నివేదిక ప్రకారం ముంబై, కోల్‌కతా నగరాలకు తీవ్ర ముప్పు పొంచి ఉన్నది. 2050 నాటికి ముంబై దాదాపు కనుమరుగు కానున్నది. డౌన్‌టౌన్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోతుంది. నవీ ముంబై, కోల్‌కతా నగరం భీకర వరదల తాకిడికి గురవుతాయి. దేశంలో దాదాపు 3.6 కోట్ల మంది నివసించే ప్రాంతంపై ప్రభావం పడుతుంది. ఇంటర్‌గవర్నమెంటల్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ చేంజ్ (ఐపీసీసీ) గత నెలలో విడుదల చేసిన నివేదిక ప్రకారం ముంబై, కోల్‌కతాతోపాటు సూరత్, చెన్నైకి సైతం ముంపు ముప్పు పొంచి ఉన్నది.


**కోట్ల మందిపై ప్రభావం**

నివేదిక ప్రకారం ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 15 కోట్ల మంది నివసిస్తున్న తీర ప్రాంతం 2050 నాటికి సముద్ర గర్భంలో కలిసిపోనున్నది. ప్రస్తుతం 30 కోట్ల మంది నివసిస్తున్న భూభాగాన్ని భీకర వరదలు ముంచెత్తుతాయి. ఈ బాధితుల్లో 75% మంది భారత్, చైనా, బంగ్లాదేశ్, వియత్నాం, థాయిలాండ్, ఇండోనేషియాల్లోనే ఉంటారు. ప్రభుత్వాలు వెంటనే వాతావరణ మార్పుల నియంత్రణపై దృష్టిసారించకుంటే ఈ ఉపద్రవాన్ని ఆపలేమని చెప్పింది.

- అత్యధికంగా చైనాకు.. ఆ తర్వాత బంగ్లాదేశ్, భారత్‌లకు ముప్పు ఉంది. చైనాలో 9.3 కోట్ల మంది, బంగ్లాదేశ్‌లో 4.2 కోట్ల మంది నివసిస్తున్న తీర ప్రాంతం 2050 కల్లా వరదల ప్రభావానికి గురవుతుంది.
- థాయిలాండ్‌లో ప్రస్తుతం 10% జనాభా నివసిస్తున్న భూమి మరో 30 ఏండ్లలో సముద్రంలో కలిసిపోనున్నది.
- వియత్నాంలోని 'హోచిమిన్ సిటీ'తోపాటు ప్రస్తుతం రెండు కోట్ల మందినివసిస్తున్న భూమిని సముద్రం ఆక్రమించనున్నది.
- బ్యాంకాక్ (థాయిలాండ్), అలెగ్జాండ్రియా (ఈజిప్ట్), బస్రా(ఇరాక్), ఫ్లోరిడా (అమెరికా), లాగోస్ (నైజీరియా) నగరాలు దాదాపు కనుమరుగైతే, షాంఘై (చైనా) రూపురేఖలు కోల్పోతుందని, అమెరికాలో మియామీ వంటి తీర నగరాలు పాక్షికంగా దెబ్బతింటాయని నివేదిక హెచ్చరించింది.

**2100 నాటికి రెట్టింపు**

పరిస్థితులిలాగే కొనసాగితే 2100 నాటికి ప్రపంచవ్యాప్తంగా తీర ప్రాంతాల్లో నివసిస్తున్న 64 కోట్ల మంది వరదల ప్రభావానికి గురవుతారని, ప్రస్తుతం 34 కోట్ల మంది నివసిస్తున్న భూభాగాన్ని సముద్రాలు ఆక్రమిస్తాయని ఈ నివేదిక హెచ్చరించింది. ఆసియాలో 10 దేశాల్లో తీర ప్రాంతాన్ని భీకర వరదలు ముంచెత్తుతాయన్నది. ఇప్పటికిప్పుడు చర్యలు ప్రారంభించినా.. అదనంగా 0.5 సెం.మీ. మేర పెరుగొచ్చని అంచనా. తాజా నివేదిక మాత్రం అంటార్కిటికాలో మంచు పలకలు అస్థిరంగా ఉన్నాయని, కర్బన ఉద్గారాలిలాగే వెలువడితే ఈ శతాబ్దం చివరికి సముద్ర మట్టాలు రెండు మీటర్ల వరకు పెరిగినా ఆశ్చర్యం లేదని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు ముందే మేల్కొనాలని, ప్రజల తరలింపు ప్రక్రియను ప్రారంభించాలని స్పష్టం చేసింది.



ముంబై ప్రస్తుతం.. 2050 నాటికి (అంచనా)

### నూతన విధానంలో అధ్యయనం

ఇప్పటివరకు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా)కు చెందిన ఉపగ్రహ వ్యవస్థ 'షటిల్ రాడార్ ట్రోపోగ్రఫీ మిషన్' (ఎస్‌ఆర్టీఎం) అందించే గణాంకాల ఆధారంగా సముద్ర మట్టాల్లో పెరుగుదల, వాతావరణంలోకి విడుదలవుతున్న కర్బన ఉద్గారాల పరిమాణం వంటి అంశాలను జతచేసి సమీప భవిష్యత్‌లో ముంపునకు గురయ్యే ప్రాంతాన్ని, ప్రభావితమయ్యే ప్రజల సంఖ్యను శాస్త్రవేత్తలు అంచనావేసేవారు. ఈ విధానంలో పలు లోపాలున్నాయని క్లైమేట్ సెంట్రల్ శాస్త్రవేత్తలు గుర్తించారు. వీటిని అధిగమిస్తూ కృత్రిమ మేధ సాయంతో పనిచేసే 'కోస్టల్ డీఈఎం' (డిజిటల్ ఎలివేషన్ మోడల్) విధానాన్ని అభివృద్ధి చేశారు. వాతావరణంలోకి విడుదలవుతున్న ఉద్గారాల నియంత్రణకు చేపడుతున్న చర్యలు, ధ్రువ ప్రాంతాల్లో మంచు పలకలు కరిగిపోతున్న తీరు, తీర ప్రాంతాల్లో జనసాంద్రత తదితర అంశాల ఆధారంగా సముద్ర మట్టాల పెరుగుదలను, వాటి ప్రభావాన్ని అంచనా వేశారు.

## నేటినుంచి జమ్ముకశ్మీర్ రెండు ముక్కలు

మూడోపేజీ తరువాయి...

వచ్చాయి. దీంతో ఆ రాష్ట్రం జమ్ముకశ్మీర్, లడఖ్ పేరిట రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా ఏర్పడింది. దీంతో దేశంలో రాష్ర్టాల సంఖ్య 28కి తగ్గగా, కేంద్ర పాలిత ప్రాంతాల సంఖ్య ఏడుకు పెరిగింది. జమ్ముకశ్మీర్‌కు తొలి లెఫ్టినెంట్ గవర్నర్‌గా గుజరాత్‌కు చెందిన మాజీ ఐఏఎస్ అధికారి జీసీ ముర్ము బాధ్యతలు చేపట్టనున్నారు. అదే సమయంలో మరో ఐఏఎస్ అధికారి రాధాకృష్ణ మాథుర్ లడక్ గవర్నర్‌గా బాధ్యతలు చేపడుతారు. లడఖ్‌కు శాసనసభ ఉండదు. ఆ ప్రాంతంలో లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా కేంద్ర హోం శాఖ ప్రత్యక్షంగా పరిపాలన సాగిస్తుంది. జమ్ముకశ్మీర్‌కు శాసనసభ ఉంటుంది. కానీ ఢిల్లీ తరహాలో ఇక్కడ పాలన సాగుతుంది. అయితే ఇక్కడ పాలనా విధానాలను నిర్దేశించే జమ్ముకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2019 ఇంకా నోటిఫై కాలేదు. జాతీయ ఐక్యతా దినోత్సవం రోజునే రెండుకొత్త కేంద్ర పాలిత ప్రాంతాలు ఆవిర్భవించడం విశేషం. దేశ తొలి హోం మంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిని ఐక్యతా దినోత్సవంగా జరుపుకుంటున్న సంగతి తెలిసిందే.

**ఎన్నికల వాగ్దానం మేరకే 370 రద్దు**

ఇటీవలి లోక్‌సభ ఎన్నికలకు ముందు చేసిన వాగ్దానం ప్రకారమే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక హోదానిచ్చే ఆర్టికల్ 370ని రద్దు చేసింది. కొత్త పార్లమెంట్ తొలి లోక్‌సభ సమావేశాలలోనే ఆగస్టు 5న ప్రభుత్వం జమ్ముకశ్మీర్‌ను విభజిస్తున్నట్టు ప్రకటించింది. ఆ వెంటనే ఆ రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన నాయకులందరినీ నిర్బంధించింది. సమాచార వ్యవస్థను పూర్తిగా నిలిపివేసింది, పలు నిషేధాజ్ఞలు విధించింది. ఆ తరువాత రెండున్నర నెలలకు ఆ ఆంక్షలను ఎత్తివేసినప్పటికీ కశ్మీర్ లోయలో ఇంకా ప్రతిష్టంభన కొనసాగుతున్నది. ఇంటర్నెట్‌ను పునరుద్ధరించలేదు. ప్రీపెయిడ్ మొబైల్ ఫోన్లు పనిచేయడం లేదు. మొత్తంగా మూడు నెలల కాలంలో చెదురుమదురు ఘటనలు మినహా జమ్ముకశ్మీర్ అంతటా ప్రశాంత వాతావరణం ఏర్పడింది. రాష్ర్టాన్ని విభజించిన తరువాత మూడు రోజులకు ప్రధాని మోదీ టెలివిజన్ ద్వారా దేశ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ, తమ నిర్ణయం గురించి జమ్ముకశ్మీర్ ప్రజలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కేంద్ర ప్రభుత్వం జమ్ముకశ్మీర్ ప్రజలకు అండగా ఉంటుందని, వారి సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. కొత్తగా ఏర్పడిన కేంద్ర పాలిత ప్రాంతాల్లో పర్యాటక రంగాన్ని ప్రోత్సహిస్తామని, మౌలికసదుపాయాలకు పెట్టపీట వేస్తామని కేంద్రం తెలిపింది. పరిస్థితులు అనుకూలించగానే జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని కూడా పేర్కొంది. అయితే జమ్ముకశ్మీర్ విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై దేశవ్యాప్తంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కొందరు కేంద్రం నిర్ణయాన్ని 'సాహసోపేతమైనది కానీ ప్రమాదకరమైనది' అని అభిప్రాయపడ్డారు. కేంద్రం నిర్ణయం వల్ల కశ్మీర్ దేశంలోని ఇతర ప్రాంతాలతో కలిసిపోతుందని కొందరు నిపుణులు పేర్కొనగా, ప్రత్యేక హోదాను రద్దు చేయడాన్ని కశ్మీరీలు అవమానంగా భావించే అవకాశం ఉందని మరకొందరు చెప్పారు. మరోవైపు ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయంపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ నేతృత్వంలో కశ్మీర్‌లో పర్యటించేందుకు వెళ్లిన ప్రతిపక్ష సభ్యులను ప్రభుత్వం విమానాశ్రయం నుంచే తిప్పి పంపింది.

**పాకిస్థాన్ విఫలయత్నం**

జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దును పాకిస్థాన్ అంతర్జాతీయ సమస్యగా మార్చేందుకు ప్రయత్నించింది. ఆ అంశాన్ని ఐక్యరాజ్యసమితి సహా పలు అంతర్జాతీయ వేదికలపై ప్రస్తావించింది. కానీ ఎక్కడా దానికి మద్దతు లభించలేదు. కశ్మీర్ భారత్ అంతర్గత అంశమని దాదాపు అన్ని దేశాలు తేల్చి చెప్పాయి. భద్రతా మండలిలో జరిగిన సంప్రదింపులు కూడా ఎటువంటి ఫలితానివ్వలేదు. ఈ పరిణామం ఇటు పాకిస్థాన్‌కు, అటు చైనాకు తీవ్ర నిరాశను మిగిల్చింది.

### అయోధ్యపై తీర్పును అందరూ అంగీకరించాలి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 30:** అయోధ్యపై సుప్రీంకోర్టు ఎలాంటి తీర్పు ఇచ్చినా ప్రతిఒక్కరు మనస్ఫూర్తిగా అంగీకరించాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) పిలుపునిచ్చింది. రామాలయ నిర్మాణంపై న్యాయస్థానం ఏ నిర్ణయం తీసుకున్నా దేశ సామరస్యానికి భంగం వాటిల్లకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదంటూ బుధవారం ట్వీట్ చేసింది.

### గురునానక్ స్మారకార్థం పాక్‌లో రూ.50 నాణెం విడుదల



**ఇస్లామాబాద్:** సిక్కు మత వ్యవస్థాపకుడు గురునానక్ దేవ్ 550వ జయంతి సందర్భంగా ఆయన స్మారకార్థం పాకిస్థాన్ రూ.50 విలువైన నాణాన్ని జారీ చేసింది. ఈ మేరకు పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ బుధవారం తన ఫేస్‌బుక్ ఖాతాలో నాణెం ఫొటోను పోస్ట్ చేశారు. గురునానక్ 550వ జయంతికి మూడు రోజుల ముందు నవంబర్ 9న భారత్-పాక్ మధ్య నిర్మించిన కర్తార్‌పూర్ కారిడార్‌ను ఇమ్రాన్‌ఖాన్ ప్రారంభించనున్న నేపథ్యంలో ఈ నాణెం విడుదల చేయడం విశేషం.

### నేడు ఐక్యతా దినోత్సవం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 30:** సర్దార్ వల్లభాయ్ పటేల్ 144వ జయంతి సందర్భంగా గురువారం దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్‌లోని కెవాడియాలో పటేల్ ఐక్యతా విగ్రహం వద్ద నివాళి అర్పించి ఏక్తా దివస్ పరేడ్‌లో పాల్గొంటారు. అక్కడి సాంకేతిక ప్రదర్శన ప్రాంతాన్ని సందర్శించి సివిల్ సర్వీసెస్ ప్రొబేషనరీలతో మోదీ సంభాషిస్తారని ప్రధాని కార్యాలయం బుధవారం తెలిపింది.

### పెహ్లూఖాన్, ఇద్దరు కొడుకులపై కేసు కొట్టివేత

**జైపూర్:** గోవులను అక్రమంగా తరలిస్తున్నారని పెహ్లుఖాన్, ఆయన ఇద్దరు కొడుకులు, లారీ డ్రైవర్‌పై నమోదుచేసిన కేసును రాజస్థాన్ హైకోర్టు బుధవారం కొట్టివేసింది. గోవులను అక్రమంగా వధశాలకు తరలిస్తున్నారంటూ గోరక్షకులు 2017లో పెహ్లుఖాన్, అతడి కొడుకులపై మూకదాడికి పాల్పడగా, పెహ్లూఖాన్ చనిపోయారు. జంతువుల సంరక్షణ చట్టం ప్రకారం పెహ్లూఖాన్, ఆయన కొడుకులు,లారీ డ్రైవర్‌పై మోపిన అభియోగాలకు ప్రాసిక్యూషన్ సరైన ఆధారాలు చూపలేదని పేర్కొంటూ కోర్టు కేసును కొట్టివేసింది.

### అక్క, బావ దాడి చేశారు

టిక్‌టాక్ స్టార్ ఫిర్యాదు



**చండీగఢ్:** హర్యానాకు చెందిన టిక్‌టాక్ స్టార్ సోనాలి ఫొగట్ బుధవారం పోలీసులను ఆశ్రయించారు. తన సోదరి రుకేశ్, బావ అమన్ తనపై దాడిచేయడంతోపాటు బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదు చేశారు. ఫతేహబాద్ జిల్లా భుంథన్‌కలన్‌లోని తన తల్లిదండ్రుల నివాసానికి ఈ నెల 28న వెళ్లినప్పుడు ఇద్దరూ తనపై దాడిచేయడంతోపాటు తిట్టారని సోనాలి పేర్కొన్నారు.

## దొంగల ముఠా నేతకు 37 ఏండ్ల జైలు

అమెరికాలో భారతీయులు, ఆసియన్లను హడలెత్తించిన మహిళ



కాస్ట్రో

**డెట్రాయిట్:** అమెరికాలో భారతీయ సంతతితోపాటు ఆసియా దేశాల సంతతి వారిని మూడేండ్లుగా హడలెత్తించిన దొంగల ముఠా నాయకురాలు ఛకా లిచార్ కాస్ట్రో (45)కు డెట్రాయిట్ జిల్లాకోర్టు సోమవారం 37 ఏండ్ల జైలుశిక్ష విధించింది. ఇంట్లోనే నగదు, ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను దాచిపెట్టుకునే భారతీయులు, ఆసియా ఖండ దేశాల వాసులను ఛకా ముఠా లక్ష్యంగా చేసుకునేది. ముందుగా ముఠా సభ్యురాలు ఇంటి తలుపు తట్టేది. తర్వాత మిగతా ముఠా సభ్యులు మారణాయుధాలతో ఆ ఇంట్లోకి చొరబడి, కుటుంబ సభ్యుల నోటికి టేప్ అతికించి దోపిడీ చేసేవారు. ఛకా ఎప్పటికప్పుడు కొత్త సభ్యులను నియమించుకునేది. ఈ ముఠా దీపావళి పండుగ సమయంలో దోపిడీలకు పాల్పడేది. జార్జియా, మిషిగాన్, న్యూయార్క్, ఓహియో, టెక్సాస్ రాష్ర్టాల పరిధిలో 2011-14 మధ్య 22 కుటుంబాలను ఛకా ముఠా దోచుకుంది. 2014 ఛకాతోపాటు మరో ఇద్దరు ముఠా సభ్యులను టెక్సాస్‌లో పోలీసులు అరెస్ట్ చేశారు. ఛకాకు బుధవారం 37 ఏండ్ల శిక్ష పడింది.

## మా వ్యవహారాలలో జోక్యం వద్దు

- భారత్, సౌదీ అరేబియా పునరుద్ఘాటన
- పలు ఒప్పందాలపై ఉభయ దేశాల సంతకాలు
- వ్యూహాత్మక భాగస్వామ్య మండలి ఏర్పాటు

**రియాద్, అక్టోబర్ 30:** ఇతర దేశాల అంతర్గత వ్యవహారాలలో ఎటువంటి జోక్యాన్నైనా తిరస్కరించాలని భారత్, సౌదీ అరేబియా పునరుద్ఘాటించాయి. రెండురోజుల పర్యటన నిమిత్తం సౌదీ వెళ్లిన ప్రధానిమోదీ మంగళవారం రాత్రి తిరిగి స్వదేశానికి వచ్చారు. అంతకుముందు భారత్, సౌదీ అరేబియా సంయుక్తంగా ఒక ప్రకటనను విడుదల చేశాయి. తాము పలు ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చలు జరిపామని, ఇతర దేశాల అంతర్గత వ్యవహారాలలో ఎటువంటి జోక్యాన్నైనా నిర్ద్వందంగా తిరస్కరించాలని నిర్ణయించామని పేర్కొన్నాయి. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక హోదానిచ్చే ఆర్టికల్ 370ని రద్దు చేయడం తమ అంతర్గత విషయమని భారత్ స్పష్టం చేస్తుండగా, పాకిస్థాన్ ఆ అంశాన్ని చైనా సాయంతో పలు అంతర్జాతీయ వేదికలపై ప్రస్తావించడం తెలిసిందే. ఈ క్రమంలో భారత్, సౌదీలు విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో ఆ అంశాన్ని ప్రత్యేకంగా పేర్కొన్నట్టు తెలుస్తున్నది.

**కీలక రంగాల్లో ఒప్పందాలు**

చమురు, గ్యాస్, రక్షణ, పౌర విమానయానం సహా పలు కీలక రంగాలలో భారత్, సౌదీ అరేబియా డజనుకుపైగా ఒప్పందాలు చేసుకున్నాయి. ఉభయ దేశాల మధ్య ముఖ్యమైన అంశాలపై సమన్వయం చేసేందుకు ఒక వ్యూహాత్మక భాగస్వామ్య మండలిని ప్రధాని మోదీ ఏర్పాటు చేశారు. ఈ మండలికి మోదీ, సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ నేతృత్వం వహిస్తారు. ఉగ్రవాద భూతాన్ని ఎదుర్కొనేందుకు భారత్‌కు అన్ని విధాల సహకరిస్తామని సౌదీ అరేబియా తెలిపింది. సౌదీ రాజు సల్మాన్‌తో ప్రధాని మోదీ భేటీ అయిన వివరాలను విదేశాంగ శాఖ ప్రతినిధి టీఎస్ త్రిమూర్తి మీడియాకు వివరించారు. సౌదీలో రుపే కార్డును ప్రవేశపెట్టాలన్న అంశంపై అవగాహన ఒప్పందం కుదిరిందన్నారు.

# 'ఉగ్ర' పోరులో మీవెంటే

- భారత్‌కు ఈయూ ఎంపీల బాసట
- ఆర్టికల్ 370 భారత అంతర్గత అంశమని వ్యాఖ్య
- కశ్మీర్‌లో పోలీసులతోపాటు స్థానికులతో సంభాషించామని వెల్లడి
- లోయలో ప్రతిపక్ష పార్టీలను కూడా పర్యటించేందుకు అనుమతించాలని సూచన



**శ్రీనగర్, అక్టోబర్ 30:** ఉగ్రవాదంపై పోరులో తాము భారత్‌కు అండగా ఉంటామని జమ్ముకశ్మీర్ పర్యటనకు వచ్చిన ఐరోపా యూనియన్ (ఈయూ) ఎంపీలు పేర్కొన్నారు. తాము భారత్‌కు 'స్నేహితులమని, ఉగ్రవాదం అంతానికి, శాంతి స్థాపనకు భారతీయులు చేస్తున్న కృషికి పూర్తి మద్దతునిస్తామని చెప్పారు. ఆర్టికల్ 370 భారత్ అంతర్గత విషయమని అన్నారు. కుల్గాం జిల్లాలో ఐదుగురు వలస కూలీలను ఉగ్రవాదులు కాల్చి చంపడాన్ని వారు ఖండించారు. కశ్మీర్‌లో పర్యటించడానికి భారత్‌లోని ప్రతిపక్ష పార్టీలకు కూడా అనుమతినివ్వాలని ఒక ఎంపీ సూచించారు. జమ్ముకశ్మీర్‌లో పరిస్థితిని అంచనా వేయడానికి రెండు రోజుల పర్యటన కోసం వచ్చిన 23 మంది ఈయూ ఎంపీలు బుధవారం తిరుగు పయనమయ్యారు. శ్రీనగర్ ఎయిర్‌పోర్టులో వారు మీడియాతో మాట్లాడారు. ఫ్రాన్స్ ప్రతినిధి హెన్రీ మాలొస్సే మాట్లాడుతూ, తాము కశ్మీర్‌లో సైన్యం, పోలీసులతోపాటు పలువురు స్థానిక యువకులతో కూడా సంభాషించామని చెప్పారు. కశ్మీర్ వార్తల విషయంలో అంతర్జాతీయ మీడియా పక్షపాతంతో వ్యవహరిస్తున్నదని పోలండ్‌కు చెందిన రైస్‌జార్డ్ జార్‌నెక్కీ ఆరోపించారు. తమ స్వదేశానికి వెళ్లిన తరువాత, కశ్మీర్‌లో తాము ఏమి చూశామో ఆ వార్తా సంస్థలకు చెప్తామని అన్నారు. బ్రిటన్‌కు చెందిన లిబరల్ డెమోక్రాట్ పార్టీ సభ్యుడు న్యూటన్ డన్ మాట్లాడుతూ, ఈ పర్యటన తమకు 'కనువిప్పు' కలిగించిందని చెప్పారు. 'కొన్నేండ్లపాటు సాగిన ఘర్షణల అనంతరం ఇప్పుడు ఐరోపా ప్రశాంతంగా ఉంది. భారత్‌ను కూడా అత్యంత శాంతియుతమైన దేశంగా చూడాలనుకుంటున్నాము. అంతర్జాతీయ ఉగ్రవాదంపై భారత్ చేస్తున్న పోరాటానికి మేము అండగా ఉంటాం. కశ్మీర్‌లో క్షేత్రస్థాయిలో చూసిన దాని గురించి ఇతరులకు చెప్తాం' అని అన్నారు. ఫ్రాన్స్‌కు చెందిన మరో సభ్యుడు తియెర్రి మరియానీ మాట్లాడుతూ, 'ఉగ్రవాదం ఓ దేశాన్ని ధ్వంసం చేయగలదు. ఆఫ్ఘనిస్థాన్, సిరియాలో ఉగ్రవాదం వల్ల ఏం జరిగిందో నేను ప్రత్యక్షంగా చూశాను. ఉగ్రవాదంపై పోరాటంలో మేము భారత్‌కు మద్దతుగా ఉంటాం' అని స్పష్టం చేశారు. తమను ఫాసిస్టులు అని విమర్శించడం పట్ల మరియానీ ఆవేదన వ్యక్తం చేశారు. తమపై బురద జల్లేవారు తమ గురించి తెలుసుకోవాలని కొన్ని వార్తా కథనాలను ప్రస్తావిస్తూ అన్నారు. 'కశ్మీర్‌లో పర్యటించేందుకు భారత్‌లోని ప్రతిపక్ష పార్టీలను కూడా ప్రభుత్వం అనుమతించాలి. మీరు ఈయూ పార్లమెంటేరియన్లను అనుమతించినప్పుడు.. మీ ప్రతిపక్ష పార్టీలను కూడా వెళ్లనివ్వాలి. అప్పుడు సమతుల్యత పాటించినట్లవుతుంది. ఈ అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలి' అని జర్మనీ ఎంపీ నికోలస్ ఫెస్ట్ అన్నారు.

**సర్కారు తీరుపై విమర్శలు**

ఇదిలాఉండగా, ఈయూ ఎంపీలను కశ్మీర్‌లో పర్యటించేందుకు అనుమతించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎంపీల పర్యటనకు నిధులు ఎవరు సమకూర్చారన్న అంశంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. శివసేన, పలు ప్రతిపక్ష పార్టీలు తమను కశ్మీర్‌లో పర్యటించేందుకు అనుమతించకపోవడంపై మోదీ సర్కార్‌ను నిలదీస్తున్నాయి. 'ఈయూ ప్రతినిధుల పర్యటన.. భారత స్వేచ్ఛ, సార్వభౌమత్వంపై విదేశీ దురాక్రమణ కాదా?' అని శివసేన అధికార పత్రిక 'సామ్నా' ప్రశ్నించింది. దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ కశ్మీర్ అంశాన్ని ఐక్యరాజ్య సమితికి నివేదించారంటూ విమర్శలు చేశారని, ఇప్పుడు ఈయూ ఎంపీలను కశ్మీర్‌లో పర్యటించేందుకు ఎందుకు అనుమతించారో వివరించాలని ఆ పత్రిక కకథనంలో డిమాండ్ చేసింది. కశ్మీర్‌ను అంతర్జాతీయ అంశంగా మార్చేందుకు వ్యతిరేకమంటూనే ఈయూ ఎంపీల పర్యటనను ఎందుకు అనుమతించారని జేడీ(యూ) నాయకుడు పవన్ వర్మ ప్రశ్నించారు. ఈయూ ఎంపీల పర్యటనకు అనుమతివ్వడం ద్వారా ప్రభుత్వం దౌత్యపరమైన పెద్ద పొరపాటు చేసిందని కాంగ్రెస్ విమర్శించింది. మోదీ సర్కార్ ఉద్దేశపూర్వకంగానే కశ్మీర్ సమస్యను అంతర్జాతీయ అంశంగా మార్చిందని కాంగ్రెస్ ప్రతినిధి రణ్‌దీప్ సర్జేవాలా ఆరోపించారు.

**ఈవిడ ఆహ్వానంతోనే ఈయూ బృందం పర్యటన!**

'విమెన్స్ ఎకో-నామిక్, సోషల్ థింక్ ట్యాంక్ (వెస్ట్)' అనే స్వచ్ఛంద సంస్థ అధినాయకురాలు మాదీ శర్మ ఆహ్వానం మేరకే ఈయూ ఎంపీలు కశ్మీర్‌లో పర్యటించారు. సామాజిక పెట్టుబడిదారు, అంతర్జాతీయ బిజినెస్ బ్రోకర్, విద్యా పారిశ్రామికవేత్తగా పేర్కొన్న మాదీ శర్మ తమ మాదీ గ్రూపు ఆధ్వర్యంలో లాభాపేక్ష లేని పలు అంతర్జాతీయ ప్రైవేటు కంపెనీలకు యజమానిగా ఉన్నారు. ప్రస్తుతం ఆమె ఈయూకు కన్సల్టేటివ్ సంస్థగా ఉన్న ఐరోపా ఆర్థిక సామాజిక కమిటీలో సభ్యురాలుగా ఉన్నారు. కశ్మీర్‌లో పర్యటించాలని ఐరోపాలోని పలు దేశాల ఎంపీలకు ఆహ్వానం పంపిన శర్మ, వారందరికీ ప్రధాని మోదీతో సమావేశం ఏర్పాటు చేస్తానని వాగ్దానం చేశారు. ఆ మేరకే భారత్ వచ్చిన ఈయూ ఎంపీలు తొలుత ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. ఆ తరువాత వారు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌ను కలుసుకున్నారు.

## నవంబర్ 10న మిలాద్ ఉన్ నబి

భారత్, పాక్, బంగ్లాలో 29న కనిపించిన నెలవంక

**న్యూఢిల్లీ:** భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లోని ముస్లింలు నవంబర్ 10న ఈద్ మిలాద్ ఉన్ నబి జరుపుకోనున్నారు. ఈనెల 29న నెలవంక కనిపించడంతో మరునాడు 30 నుంచి పవిత్ర రబా-ఉల్-అవ్వాల్ మాసం ఆరంభమైంది. దీంతో ఇస్లాం మత సంప్రదాయం ప్రకారం నవంబర్ 10న మహ్మద్ ప్రవక్త జయంతి వేడుకను జరుపుకోనున్నారు. దీన్ని ఈద్-ఎ-మిలాద్, ఈద్ మిలాద్-ఉన్-నబి, మావ్లిద్‌గా వ్యవహరిస్తారు. ముస్లింలలోని కొన్ని వర్గాలు ఈ పవిత్ర మాసంలోని 12వ రోజున మహ్మద్ ప్రవక్త జయంతి వేడుకను జరుపుకొంటారు. కాగా, సౌదీ అరేబియాతోపాటు గల్ఫ్ దేశాల్లో ఈ నెల 28న నెలవంక కనిపించింది. ఆయా దేశాల్లో 29 నుంచి పవిత్ర రబా-ఉల్-అవ్వాల్ మాసం ప్రారంభమైంది. దీంతో ఆ దేశాల్లో నవంబర్ 9న మిలాద్ ఉన్ నబిని జరుపుకోనున్నారు.



జమ్ముకశ్మీర్‌లో ముర్షిదాబాద్‌కు చెందిన ఐదుగురు కార్మికులను టెర్రరిస్టులు కాల్చిచంపటం అమానవీయం. ఈ హత్యలు మానవతకు వ్యతిరేకమైనవి. కశ్మీర్‌లో రాజకీయ కార్యకలాపాలేవీ లేవు. శాంతిభద్రతలు పూర్తిగా కేంద్రం చేతిలో ఉండగా ఇలాంటి హింస జరుగటం దారుణం. కావాలనే చేసిన హత్యలుగా కనిపిస్తున్న వీటిపై సంపూర్ణ విచారణ జరుపాలి.

**మమతా బెనర్జీ, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి**



జమ్ముకశ్మీర్‌లో రోజురోజుకూ పరిస్థితి దిగజారుతున్నది. కేంద్ర ప్రభుత్వం తప్పుడు విధానాల ఫలితంగానే పరిస్థితి చేజారిపోతున్నది. కేంద్రం కశ్మీర్‌లోని వాస్తవ పరిస్థితిని దాచిపెట్టడానికే ప్రయత్నిస్తున్నది. అఖిలపక్ష పర్యటనకు అనుమతించని కేంద్రం యురోపియన్ యూనియన్ నేతలను మాత్రం కశ్మీర్ పర్యటనకు పంపింది.

**అధిర్‌రంజన్ చౌదరి, లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత**

**చరిత్రలో నేడు**



**1905**

రష్యా సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ప్రభుత్వ వ్యతిరేక కార్మిక మహా ప్రదర్శన.

**1922**



ఇటలీ పాలకుడిగా ముస్సోలినీ.



**1954**

ఫ్రెంచ్ పాలనకు వ్యతిరేకంగా అల్జీరియాలో ప్రజాందోళనలు.

జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దుచేసిన తర్వాత, కశ్మీర్‌లో అంతా సవ్యంగానే ఉన్నదని ప్రపంచానికి చాటడానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. దీనిలో భాగంగానే యురోపియన్ యూనియన్‌కు చెందిన ఎంపీలను జమ్ముకశ్మీర్ పర్యటనకు తీసుకుపోవటం గమనార్హం. గతంలో కశ్మీర్‌లో మానవహక్కుల ఉల్లంఘన జరుగుతున్నదని పాక్ చేసిన ప్రచారాన్ని భారత్ అంతర్జాతీయంగా తిప్పికొట్టలేకపోయింది. ఇప్పుడు కశ్మీర్‌లో పరిస్థితి అదుపులోనే ఉన్నదనే విషయాన్ని భారత్ అంతర్జాతీయ సమాజానికి తెలియజెప్పటానికి ప్రయత్నించటం ఆహ్వానించదగినది.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**

మహారాష్ట్ర ఎన్నికల్లో మిత్రపక్షాలుగా బీజేపీ, శివసేన పోటీచేసి ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీని సాధించినా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోతున్నాయి. అధికారాన్ని పంచుకోవటంలో తలెత్తిన విభేదాలే దీనికి కారణం. ఐదేండ్లూ తానే ముఖ్యమంత్రిగా ఉంటానని ఫడ్నవీస్ ప్రకటించటంతో మహారాష్ట్ర రాజకీయం మరింత సంక్లిష్టంగా మారింది. మరోవైపు శివసేన అధికారాన్ని చెరిసగం పంచుకోవటానికి తాము కట్టుబడి ఉన్నామని ప్రకటించి బీజేపీ-శివసేన పొత్తు రాజకీయం ప్రశ్నార్థకమైంది.

**ది హిందూ**



# తలుపులు తెరిచిన సౌదీ

సౌదీ అరేబియా వ్యవస్థాగతంగా భారీ పరివర్తనకు నోచుకుంటున్న సందర్భంలో ప్రధాని మోదీ తాజా పర్యటన కీలకమైందిగా మారింది. ఇప్పటివరకు సౌదీతో సంబంధాలు అంటే చమురు దిగుమతి చేసుకోవడం, అక్కడ భారతీయ కార్మికులు పనిచేయడమనేవే ప్రధానాంశాలుగా ఉండేవి. భారత్ చమురు అవసరాలలో పద్దెనిమిది శాతం సౌదీ అరేబియా తీరుస్తున్నది. మన దేశానికి చెందిన దాదాపు 26 లక్షలమంది కార్మికులు సౌదీ అరేబియాలో ఉన్నారు. కానీ ఇప్పుడు సౌదీ అరేబియా ఆర్థికవ్యవస్థ బహువిధాలుగా విస్తరిస్తున్నది. సౌదీ ప్రభుత్వరంగ చమురు సంస్థను కూడా విదేశీ పెట్టుబడుల కోసం అమ్మకానికి పెట్టడం గమనార్హం. సౌదీ అరేబియా భారీ ఎత్తున పెట్టుబడులకు ఆహ్వానం పలుకుతున్న నేపథ్యంలో గత రెండు మూడేండ్లుగా పెట్టుబడుల కోసం సదస్సులు నిర్వహిస్తున్నది. ఈ సందర్భంగానే ఈయేటి 'ఫ్యూచర్ ఇన్వెస్ట్‌మెంట్ ఇనిషియేటివ్' సదస్సు కోసం ప్రధాని మోదీ సౌదీ అరేబియా పర్యటించి, యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ (ఎంబీఎస్)తో చర్చలు జరిపారు. భారత్, సౌదీ అరేబియా మధ్య పలు ఒప్పందాలు కుదిరాయి. చమురు, సహజవాయువు, రక్షణ, విమానయానం, వ్యవసాయం, సృజనాత్మక సాంకేతిక పరిజ్ఞానం, సంప్రదాయేతర ఇంధనం మొదలైనరంగాలలో దాదాపు డజను ఒప్పందాలపై రెండు దేశాలు సంతకాలు చేశాయి. జలమార్గాల భద్రత ప్రాధాన్యాన్ని గుర్తిస్తూ దీనిపై కూడా ఒప్పందం కుదుర్చుకోవాలని నిర్ణయించాయి. ఉగ్రవాదాన్ని ఖండించడమే కాక, ఈ జాడ్యాన్ని ఏ మతానికో, జాతికో ముడిపెట్టకూడదని రెండు దేశాలు సంయుక్త ప్రకటనలో అభిప్రాయపడ్డాయి. చమురు రంగంలో కొత్త ప్రాజెక్టులు చేపడుతూనే, కొత్తగా తెరుచుకుంటున్న రంగాలలో ప్రవేశించాలనేది భారత్ వ్యూహం.

> **విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి సౌదీ యువరాజు ఎంబీఎస్ కొన్ని మతపరమైన ఆంక్షల ను ఎత్తివేశాడు. అన్ని మతాలను, సంప్రదాయాలను అనుమతించే విధంగా ఉదారంగా వ్యవహరిస్తున్నట్టు పెట్టుబడుల సదస్సులో ప్రకటించాడు. గత మూడేండ్లలో మత పోలీసుల అధికారాల ను తగ్గించాడు. మహిళల హక్కులను కొన్నింటిని గుర్తించాడు. సినిమాహాళ్ళపై నిషేధాన్ని ఎత్తివేశాడు. రెస్టారెంట్లలో సంగీతాన్ని అనుమతించాడు. సంగీత కచ్చేరీలను కొంత మేర జరుపుకోనిస్తున్నాడు. కానీ ఎంబీఎస్ చెబుతున్నట్టుగా భారీ మార్పులేమీ చోటు చేసుకోలేదు.**

సౌదీ అరేబియా ఆర్థికవ్యవస్థ కొన్ని దశాబ్దాలుగా చమురుపైనే ఆధారపడి ఉన్నది. కానీ ప్రపంచఆర్థిక వ్యవస్థకు చమురే ఇరుసుగా ఉండే కాలం పోయింది. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రతి దేశమూ విదేశీ పెట్టుబడులను ఆహ్వానించవలసి వస్తున్నది. అందువల్ల తాము కూడా ఉత్పత్తి, సేవా రంగాలను ప్రోత్సహించాలని సౌదీ ప్రభుత్వం నిర్ణయించింది. ఆంతరంగికంగా సరళీకరణ విధానాలను అనుసరించడం, ప్రపంచ ఆర్థికవ్యవస్థతో అనుసంధానం చేయడం ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. ఇందుకోసం విజన్ 2030 పేర సౌదీ అరేబియా పరివర్తనా కార్యక్రమం వేగంగా సాగుతున్నది. ప్రపంచంలోని పది అగ్రశ్రేణి క్యాపిటల్ మార్కెట్లలో ఒకటిగా ఉండాలని, పదేండ్లలో 1.6 ట్రిలియన్ రియాల్స్ మేర పెట్టుబడులను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఈ ఏడాది చమురేతర వృద్ధి 2.9 శాతం ఉంటుందని ఐఎంఎఫ్ అంచనా. సౌదీ అరేబియా సంస్కరణల పరంగా జి20 కూటమిలో నాలుగవ స్థానంలో ఉందని ప్రపంచబ్యాంక్ గుర్తించింది. దేశంలో డిజిటల్ మౌలిక వసతులు భారీగా విస్తరించాయి. 12 బిలియన్ డాలర్ల ఐటీ మార్కెట్‌గా అవతరించడమే కాకుండా, పది బిలియన్ డాలర్ల టెక్నాలజీ మార్కెట్ కోసం రంగం సిద్ధమవుతున్నది. మత పరంగా ఇస్లామిక్ ప్రపంచంలో పెద్ద పాత్ర పోషించడం, భౌగోళికంగా ఆఫ్రికా, ఆసియా ఖండాల కూడలిగా, యూరప్‌కు సమీపంగా ఉండటం కలిసి వచ్చే అంశాలు. భారీ పెట్టుబడులు పెట్టే స్థోమత కూడా సౌదీకి ఉన్నది. సౌదీ యువతరాన్ని నిపుణులుగా తీర్చిదిద్దే ప్రయత్నం సాగుతున్నది. తమ ఆర్థికాభివృద్ధికి ఉపయోగపడేవిగా కొన్ని దేశాలను సౌదీ గుర్తించింది. ఇందులో అమెరికా, చైనా, జపాన్, దక్షిణకొరియా, జర్మనీ, ఫ్రాన్స్, యూకెతో పాటు భారత్ కూడా ఉన్నది. సౌదీ అరేబియాలో ఆర్థిక, సామాజిక ఆధునీకరణ కార్యక్రమాలను పూర్తిగా ఉపయోగించుకోవడమే ప్రధాని మోదీ తాజా పర్యటన లక్ష్యం.

విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి సౌదీ యువరాజు ఎంబీఎస్ కొన్ని మతపరమైన ఆంక్షలను ఎత్తివేశాడు. అన్ని మతాలను, సంప్రదాయాలను అనుమతించే విధంగా ఉదారంగా వ్యవహరిస్తున్నట్టు పెట్టుబడుల సదస్సులో ప్రకటించాడు. గత మూడేండ్లలో మత పోలీసుల అధికారాలను తగ్గించాడు. మహిళల హక్కులను కొన్నింటిని గుర్తించాడు. సినిమాహాళ్ళపై నిషేధాన్ని ఎత్తివేశాడు. రెస్టారెంట్లలో సంగీతాన్ని అనుమతించాడు. సంగీత కచ్చేరీలను కొంత మేర జరుపుకోనిస్తున్నాడు. కానీ ఎంబీఎస్ చెబుతున్నట్టుగా భారీ మార్పులేమీ చోటు చేసుకోలేదు. ఎంబీఎస్ చేతికి పగ్గాలు వచ్చిన తరువాత అనేక హత్యలు, కిడ్నాపులు జరిగాయి. టర్కీలోని సౌదీ రాయబార కార్యాలయంలో ప్రముఖ పాత్రికేయుడు, అసమ్మతివాది ఖషోగ్గిని ముక్కలుగా నరికి చంపిన తరువాత ప్రపంచవ్యాప్తంగా నిరసన వ్యక్తమైంది. ప్రముఖ కంపెనీలు కూడా సౌదీలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపడం లేదు. ఆర్థికరంగ మార్పులతో పాటు ప్రజాస్వామిక సమాజం ఏర్పడటం కూడా అవసరం. లేకపోతే నిరంకుశ వ్యవస్థ మరింత వికృతంగా తయారవుతుంది. సౌదీ అరేబియాలోనే కాదు, ఏ దేశంలోనైనా ప్రజాస్వామ్య వ్యవస్థలు ఏర్పడటానికి మన దేశ విధానం దోహదపడాలె. పశ్చిమాసియాలో ఇరాన్, సౌదీ అరేబియా వంటి భిన్న ధ్రువాలున్నాయి. సౌదీతో అనుబంధం మూలంగా ఇతర దేశాలతో సంబంధాలు దెబ్బతినకుండా జాగ్రత్త పడాలె.

**జనగళం**

### మద్యాన్ని నియంత్రించాలె

రాష్ట్రంలో మద్యం కారణంగా తలెత్తుతున్న సామాజిక సమస్యలు అనేకం. కష్టజీవులైన పేదలు తమ కష్టార్జితాన్ని ఎక్కువభాగం తాగడం కోసమే ఖర్చుచేస్తున్న దుస్థితి ఉన్నది. అంతటితో ఆగకుండా కుటుంబంలో అనేక సమస్యలకు మద్యమే కారణమవుతున్నది. కాబట్టి ఎన్నో సామాజిక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్న కేసీఆర్ ప్రభుత్వం మద్యం అమ్మకాల విషయంలోనూ కొంత నియంత్రణ ఉండేట్టు చర్యలు తీసుకోవాలి. మారుమూల పల్లెల్లో కూడా మద్యం విచ్చలవిడిగా అమ్ముతున్నారు. దీంతో ఎంతో మద్యానికి బానిసలై ఆరోగ్యాన్ని, కుటుంబాన్ని కష్టాల పాలు చేస్తున్నారు. కాబట్టి ఇప్పటికైనా బెల్ట్ షాపులను, విచ్చలవిడి మద్యం అమ్మకాలను కట్టడి చేయాలి. మద్యాన్ని కనిష్ఠంగా అందుబాటులో ఉంచినప్పుడే ప్రజలకు మేలు జరుగుతుంది. ఈ దిశగా ప్రభుత్వం ఆలోచించి తగు చర్యలు తీసుకోవాలి. అప్పుడే పేదల జీవితాలు సక్రమంగా సాగుతాయి.

**- బ్రహ్మం విశ్వకర్మ, వీవర్స్ కాలనీ, కొత్తకోట, వనపర్తిజిల్లా**

### స్ఫూర్తినింపిన ఫలితాలు

ఈ మధ్య ప్రకటించిన గ్రూప్-2 ఫలితాల్లో ఎంతో మంది తెలంగాణ గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువకులు డిప్యూటీ తహశీల్దార్ ఉద్యోగాలు సాధించటం యువతలో స్ఫూర్తినింపింది. ఇప్పటిదాకా ఇలాంటి ఉద్యోగాలు ఎవరికో ఉన్నతవర్గాలకు చెందినవారికే, నగరాల్లోని కులీన వర్గాల వారికే దక్కుతాయనే అపోహ ఉండేది. కానీ మొన్న ప్రకటించిన గ్రూప్-2 ఫలితాలు పట్టుదలతో చదివితే సాధించలేనివి ఏమీ లేవని చాటిచెప్పాయి. యాదాద్రి భువనగిరి జిల్లా సుంకిశాల గ్రామానికి చెందిన పైళ్ల నవీన్‌రెడ్డి దంపతులిద్దరికీ డిప్యూటీ తహశీల్దార్ ఉద్యోగాలు రావటం జిల్లాతో పాటు రాష్ట్రానికంతటికీ స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఈ స్ఫూర్తితో గ్రామీణ యువత నిబద్ధతతో చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించి తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములవ్వాలి. మన నీళ్లు, మన నిధులు, మన ఉద్యోగాల కోసం పోరాడి తెలంగాణ సాధించుకున్నాం. అవి ఒక్కొక్కటిగా నెరవేరుతుండటం ఆనందదాయకం.

**- పి.మహేందర్ రెడ్డి, హైదరాబాద్**

**ఆలోకన**



**టంకశాల అశోక్**

# బీజేపీకి విరుగుడు ఏమిటి?

బీజేపీకి ప్రాంతీయ పార్టీలు ఆటోమేటిక్‌గా విరుగుడు కాగలవనే మాట ఒకటి గతవారపు ఎన్నికల తర్వాత వినవస్తున్నది. ఇది నిజమని స్థూల దృష్టికి తోచవచ్చుగాని, జాగ్రత్తగా ఆలోచించినట్లయితే అది సరైనది కాదని అర్థమవుతుంది. పార్టీలు, ప్రాంతీయం కావటంతో పాటు ప్రజలను మెప్పించే పాలనను అందించినప్పుడు మాత్రమే బీజేపీని నిలువరించగలవు. జనరంజక పాలన ఒక తప్పనిసరి షరతు. హుజూర్‌నగర్‌లో టీఆర్ఎస్ సుపరిపాలన షరతును కూడా తీర్చగలిగింది. నిజానికి ఇందులో అర్థం చేసుకోవలసిన విషయాలు మరికొన్ని ఉన్నాయి.

ఇందుకు సంబంధించిన వేర్వేరు విషయాల్లోకి వెళ్లేముందు హుజూర్‌నగర్ గురించి ఆలోచిద్దాం. ఆ ఫలితం వెలువడిన తర్వాత బీజేపీ, కాంగ్రెస్‌ల పరాజయాల ప్రస్తావన వస్తున్నది. వాస్తవానికి హుజూర్‌నగర్‌లో బీజేపీ అన్నది ఒక ప్రశ్నేకాదు. ఆ పార్టీ ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో తమకు తగిన బలం లేకున్నా కొన్ని పరిస్థితుల వల్ల నాలుగు సీట్లను జాక్‌పాట్ వలె గెలువటం, కేంద్రంలో మరింత మెజారిటీతో తిరిగి అధికారానికి రావటం, అప్పటి నుంచి తెలంగాణలో ఇక భవిష్యత్తు తమదేనంటూ హడావుడి సాగించటం వల్ల హుజూర్‌నగర్‌లోనూ వారి పోటీపై దృష్టిపడింది. తప్ప వారిని అక్కడ లెక్కించవలసిన అవసరమే లేదు. చివరకు ఫలి తం దానినే రుజువు చేసింది. అక్కడ టీఆర్ఎస్‌కు పోటీ కాంగ్రెస్‌తో మాత్రమే.

టీఆర్ఎస్ పార్టీ బీజేపీకి ఎంత విరుగుడు అయిందో కాంగ్రెస్‌కు అంత విరుగుడు అయిందనేది మొత్తమ్మీద కనిపిస్తున్న రాజకీయ స్థితి. కాంగ్రెస్, బీజేపీ రెండు జాతీయ పార్టీలు. జాతీయస్థాయితో పాటు పలు రాష్ట్రాలతో అనేకమార్లు పరిపాలించాయి. కొన్నిసార్లు గెలిచాయి, కొన్నిసార్లు ఓడాయి. ఒకరు గెలిచి మరొకరు ఓడటం పద్ధతిలో వారిద్దరే అధికారానికి వస్తుండటానికి కారణం మరొక ప్రత్యామ్నాయం లేకపోవటం. ఇరువురిలో ఎవరు కూడా తమ సుపరిపాలనతో ప్రజాదరణను పొంది నాలుగు కాలాల పాటు స్థిరపడటం అంటూ జరుగటం లేదు. ప్రజలకు ఎవరి పాలనపై నిరసన కలిగితే వారిని పూర్తిగా ఓడించటం, లేదా వారి సీట్ల సంఖ్యను తగ్గించటం జరిగితే, రెండవ పార్టీ అది తమ ఘనత అని, ప్రజలకు తాము నచ్చామని అమాయకంగా నమ్మటం ఒక వరవడిగా మారింది. అంతే తప్ప తమ గతకాలపు వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకుని ఈ సారి సవ్యంగా పరిపాలించటమనేది చేయటం లేదు.

ఈ రెండింటికి తెలంగాణలో టీఆర్ఎస్ విరుగుడు అవుతున్నది. విరుగుడు కావటం కేవలం ఆ రెండు జాతీయ పార్టీలకు భిన్నంగా ఇదొక ప్రాంతీయ పార్టీ కావటం వల్ల కాదు. దానితో పాటు తన పరిపాలన బాగుండటం అందుకు ప్రధాన కారణం. జాతీయపార్టీలకు భిన్నంగా ప్రాంతీయ పార్టీలు ఏర్పడి, అక్కడి ప్రజలకు తాము ప్రత్యామ్నాయమనే ఆశలు కలిగించి, అధికారానికి రావటం కొన్ని ఇతర రాష్ట్రాల్లోనూ జరిగింది. ఇది కొన్ని దశాబ్దాలుగా జరుగుతున్నది. కానీ గమనించదగినది ఏమంటే, అవి ప్రాంతీయ పార్టీలు అయినంత మాత్రాన ఆటోమెటిక్‌గా జాతీయ పార్టీలకు విరుగుడు అయిపోలేదు. వివిధ రాష్ట్రాలలోని ప్రాంతీయ పార్టీలను, వాటి పరిపాలనలను, ఎన్నికల్లో జయాపజయాలను, జాతీయ పార్టీలపై లేదా ఇతర ప్రాంతీయ పార్టీలపై గెలుపు ఓటముల కారణాలను ఒకసారి విహంగ వీక్షణం పద్ధతిలో సమీక్షించి చూడండి. ఆయా ప్రాంతీయ అధికార పార్టీలు ఇతరులకు విరుగుడు అయాయా లేదా అన్నది ముఖ్యంగా వాటి పరిపాలనా సరళిపై ఆధారపడి సాగింది. ఎప్పుడైనా అసాధారణ పరిస్థితులు తలెత్తి ఈ సూత్రీకరణకు భిన్నంగా జరిగి ఉండవచ్చు. అది వేరు. కానీ వారికి వర్తించిన సర్వసాధారణ సూత్రం మాత్రం ఇదే. చివరకు వామపక్ష ప్రభుత్వాలకు సైతం ఇదే వర్తించింది.

ప్రాంతీయ పార్టీలు తొలుత జాతీయ పార్టీల పట్ల ప్రజల విముఖత కారణంగా ఏర్పడినటువంటివే. తమిళనాడు, పంజాబ్, కశ్మీర్ ఉద్యమ నేపథ్యాలు వేరు గనుక వాటిని ఇందులోకి తేవటం లేదు. అయితే ఈ మినహాయింపు అక్కడి ప్రాంతీయపార్టీల ఆవిర్భావం వరకే. తదనంతర కాలంలో వాటి పరిపాలనలే తిరిగి అధికారానికి గీటురాళ్లు అయాయి. అందులో విఫలం కావటం వల్లనే ప్రజాదరణ తగ్గి, ఇతర ప్రాంతీయ పార్టీలతోనో లేక కాంగ్రెస్, బీజేపీ అనే రెండు జాతీయపార్టీలలో ఏదో ఒక దానితోనే పొత్తు పెట్టుకోవలసిన స్థితికి లోనయ్యాయి. తమ పరిపాలనా వైఫల్యాలు, ప్రజల నిరాదరణ స్థాయి ఎంతగా ఉన్నాయనే దానిని బట్టి ఒకోసారి ఇవేవీ కూడా వారిని కాపాడలేకపోయాయి. అనగా, కేవలం ప్రాంతీయత అనేది ఎప్పుడూ ఎవరికీ శ్రీరామరక్ష కాలేదు. ఈ నాణేనికి రెండవ వైపును చూస్తే, పరిపాలన ప్రజారంజకమైనప్పుడు ఇతర పార్టీలు అన్నీ ఏకమై కూడా సదరు ప్రాంతీయ పార్టీని ఏమీ చేయలేకపోయాయి. ఇందుకు, తెలంగాణ అవతరణ తర్వాత టీఆర్ఎస్ ఎన్నికల చరిత్రే ఒక దృష్టాంతం. హుజూర్‌నగర్‌లోనూ ఇటువంటిదే జరిగినట్లు వింటున్నాము.

> భారతదేశ భవిష్యత్తు గురించి స్వాతంత్ర్యోద్యమ కాలంలో అప్పటి నాయకులు ఎంతో లోతుగా, ఎంతో దీర్ఘదృష్టితో అద్భుతమైన ఆలోచనలు చేశారు. అంతే గొప్ప రాజ్యాంగాన్ని, చట్టాలను రూపొందించారు. అవి సక్రమంగా అమలై ఉంటే అప్పటి జాతీయపార్టీ అయిన కాంగ్రెస్‌కు బహుశా ఎప్పటికీ చలనం ఉండేది కాదు. బీజేపీకి చోటన్నదే లభించేది కాదు. ప్రత్యేక నేపథ్యాలలో రూపు తీసుకున్న తమిళనాడు, పంజాబ్, కశ్మీర్ పార్టీలను మినహాయిస్తే దేశంలో మరెక్కడ కూడా కులాలు, మతాలు, ప్రాంతీయ ఆకాంక్షలు, వివక్షల ప్రాతిపదికగా ప్రాంతీయపార్టీలు కనీసం ఈ తీరున వచ్చి ఉండేవి కావు.

ఈ పరుసవేది రహస్యాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ సరిగానే కనుగొన్నట్లు కనిపిస్తున్నది. తను ఉద్యమానికి నాయకత్వం వహించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన ప్రాంతీయ పార్టీకి అధ్యక్షుడు అయినంత మాత్రాన ప్రజలు ఇతర ఇతర పార్టీలను కాదని ఎల్లప్పుడూ టీఆర్ఎస్‌నే గెలిపించగలరని ఆయన ఎన్నడూ భావించినట్లు లేదు. తెలంగాణను తామే 'ఇచ్చా'మంటున్న ఒక జాతీయ పార్టీని, తమ 'మద్దతు వల్లనే' వచ్చిందనే మరొక జాతీయపార్టీని ప్రజలు కాదని మొదటి ఎన్నికలో తన పార్టీకి అధికారాన్ని అప్పగించినా, అటువంటి అభిమానం శాశ్వతం కాదని, తెలంగాణకు చెందిన సొంత పార్టీ అయినప్పటికీ పరిపాలన బాగా లేకపోయినట్లయితే అటువంటి అభిమానం దీర్ఘకాలం పాటు నిలువదని కేసీఆర్ మొదటినుంచే గ్రహించారన్నది మనకు అర్థమవుతూ వచ్చిన విషయం. తన మాటలు, చేతలు, పట్టుదలలో ఇది కనిపిస్తూవచ్చింది. అనగా ప్రాంతీయ స్వభావానికి జనరంజకమైన పాలన తోడు కావటమనే పరుసవేది రహస్యానికి ఆయన నాయకత్వాన తెలంగాణ ఒక ఉదాహరణ అవుతున్నదన్నమాట.

హుజూర్‌నగర్ ఎన్నిక ప్రచార సందర్భంలోనూ ఇదే ప్రతిఫలించింది. కాంగ్రెస్ సహా ఇతర ప్రత్యర్థుల ప్రచారణ ధోరణికి అదే ధోరణిలో సమాధానమివ్వటం ఒక స్థాయిలో కనిపించగా, మరొకస్థాయిలో ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల దృష్టికి తేవటం గడపగడప ప్రచారంగా సాగింది. ముఖ్యమంత్రి సూచనల మేరకు క్షేత్రస్థాయి ప్రచారకర్తలు చేసింది అదే. కనుకనే పార్టీ పట్ల, ప్రభుత్వం పట్ల విశ్వాసం కలిగిన ప్రజలు ఆ విధమైన తీర్పునిచ్చారు. నియోజకవర్గంలో ఎంతో బలం, ఎన్నికల రికార్డు కలిగిన ఒక జాతీయపార్టీ పెద్ద తేడాతో ఓడగా, అమితంగా ఆర్భాటపడిన మరొక జాతీయ పార్టీకి కొన్ని చేదు నిజాలు తెలిసివచ్చాయి. ఎన్నికల ప్రచార సూత్రాన్ని కేసీఆర్ కొనసాగిస్తూ, తర్వాత రెండు రోజులకు అక్కడికి వెళ్లి అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రకటించారు. అది ఆయకట్టు స్థిరీకరణ వంటిది.

ఈ వ్యూహం, విధానాలు, ఆచరణ కొనసాగినంతకాలం, తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీలకు విరుగుడు (యాంటీ థీసిస్) ఏమిటనే ప్రశ్నపై ప్రత్యేక ఆలోచనలు అక్కరలేదు. దేశంలోని వివిధ ప్రాంతీయపార్టీలు అన్నింటా గత కొన్ని దశాబ్దాల ఎన్నికల జయాపజయాలు, పరిపాలనా సాఫల్య వైఫల్యాల సారాంశమిది. ఇది మునుముందు ఎంత నిగ్గుతేరుతూ పోతే టీఆర్ఎస్ అనే ఒక ప్రాంతీయ పార్టీకి, తెలంగాణ అనే ఒక నవోనవోన్మేష రాష్ట్రానికి అంత మేలు జరుగుతుంది. భారతదేశంలో అనేక సవాళ్లను ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్న ఫెడరలిస్టు తాత్త్వికతలు, స్వరూప స్వభావాలు అంత రూపుదిద్దుకుంటాయి.

భారతదేశ భవిష్యత్తు గురించి స్వాతంత్ర్యోద్యమ కాలంలో అప్పటి నాయకులు ఎంతో లోతుగా, ఎంతో దీర్ఘదృష్టితో అద్భుతమైన ఆలోచనలు చేశారు. అంతే గొప్ప రాజ్యాంగాన్ని, చట్టాలను రూపొందించారు. అవి సక్రమంగా అమలై ఉంటే అప్పటి జాతీయపార్టీ అయిన కాంగ్రెస్‌కు బహుశా ఎప్పటికీ చలనం ఉండేది కాదు. బీజేపీకి చోటన్నదే లభించేది కాదు. ప్రత్యేక నేపథ్యాలలో రూపు తీసుకున్న తమిళనాడు, పంజాబ్, కశ్మీర్ పార్టీలను మినహాయిస్తే దేశంలో మరెక్కడ కూడా కులాలు, మతాలు, ప్రాంతీయ ఆకాంక్షలు, వివక్షల ప్రాతిపదికగా ప్రాంతీయ పార్టీలు కనీసం ఈ తీరున వచ్చి ఉండేవి కావు. మరొకవైపు నుంచి చూస్తే, అట్లా ఏర్పడిన పార్టీలు ప్రజలు నిరసించిన జాతీయపార్టీల నమూనాకు భిన్నమైన పాలనను తమ కొత్త నమూనగా రూపొందించుకొని ఉంటే వాటికి చలనం ఏర్పడేది కాదు. కానీ జాతీయపార్టీల వలెనే అవి కూడా ఆ కార్యంలో విఫలమయ్యాయి. ఈ స్థితి ప్రస్తుతం బీజేపీకి విచ్ఛిన్నకరమైన అవకాశాలను కల్పిస్తున్నది. అందుకు విరుగుడు ప్రజలు మెచ్చే సత్పరిపాలన మాత్రమే.

# అభిజిత్ పరిశోధనలే ఆదర్శం

**విశ్లేషణ**



**ప్రొఫెసర్ హెచ్. వెంకటేశ్వర్లు**

పేదరికం ఒక కుటుంబానికే కాదు, రాష్ట్రానికి, దేశానికి ప్రపంచానికి కూడా శాపం. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా అన్ని దేశాలు ఎన్నోరకాల విధానాలతో ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. అయినా ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికీ ఎన్నో దేశాలు పేదరికంలో మగ్గుతున్నాయి. అలాంటి పేదరికంపై, దాని నిర్మూలన కోసం చేసిన పరిశోధనలకు ఈసారి నోబెల్ బహుమతి రావడం, ఆ బహుమతి అందుకున్న అభిజిత్ బెనర్జీ మన దేశానికి చెందినవాడు కావడం గమనార్హం. భారత సంతతికి చెందిన అభిజిత్ బెనర్జీ, ఆయన భార్య 'డుఫ్లో', మరో హార్వర్డ్ ఆర్థికవేత్త 'క్రేమర్'కు పేదరికంపై చేసిన పరిశోధనలకు గాను ప్రతిష్ఠాత్మక అవార్డు లభించడం సంతోషించదగినదే. ఈ అవార్డు ద్వారా భారత విద్యావ్యవస్థలో కూడా నోబెల్ బహుమతి లాంటి అత్యున్నత విద్యా పురస్కారాన్ని అందించే సామర్థ్యం కలిగిన విద్యాసంస్థలున్నాయని రుజువైంది. కానీ ఆయనలో ఉన్న ప్రతిభను పూర్తిస్థాయిలో వెలికితీసింది మాత్రం అమెరికన్ విశ్వవిద్యాలయాలే అని చెప్పక తప్పదు. ఈ విజయం ద్వారా, విశ్వవిద్యాలయాల్లో సమాజానికి ఉపయోగపడే శాస్త్రీయమైన పరిశోధనలు ఎప్పటికైనా గుర్తించబడుతాయని రుజువైంది.

ఇక అభిజిత్ బెనర్జీ పరిశోధనలు చూస్తే... ఆయన పేదరికం ఎందుకు ఉంటుందనే విషయంపై దాదాపుగా 84 దేశాల్లో సూక్ష్మ పరిశోధనలు జరిపాడు. 'ర్యాండమైజ్డ్ కంట్రోల్ ట్రయల్' అనే పద్ధతి ద్వారా ఆర్థికశాస్త్రంలో సిద్ధాంతపరంగా కాకుండా ప్రయోగపరంగా కూడా పరిశోధన చేయవచ్చునని నిరూపించాడు. ఆయన స్థాపించిన 'పావర్టీ యాక్షన్ ల్యాబ్' ద్వారా పేదరిక నిర్మూలన కోసం ప్రయోగాత్మక విధానం, క్షేత్రస్థాయి సర్వేల ద్వారా విషయం అవగాన చేసుకొని విధాన రూపకల్పనకు కృషిచేశాడు. అతని పరిశోధనల ద్వారా ఆరోగ్యానికి, విద్యకు, వ్యవసాయానికి, పేదరికానికి ఉన్న సంబంధాలను ప్రయోగాత్మకంగా తెలియజేశాడు. ఇవి చాలా సాధారణమైన నిశితమైన క్షేత్రస్థాయి, సూక్ష్మ పరిశోధనలు. ఉదాహరణకు ఆయన ఒకటి, రెండు గ్రూపుల విద్యార్థులను అధ్యయనం చేశారు. ఒక గ్రూపు విద్యార్థులకు బూట్లతో బడికి పంపడం, ఇంకో గ్రూపు విద్యార్థులకు బూట్లు లేకుండా బడికి పంపడం జరిగింది. ఈ పరిశోధనల్లో బూట్లతో విద్యనభ్యసించిన విద్యార్థి గ్రూపు చదువులో మంచి ఫలితాలు చూపింది. అంటే పేద విద్యార్థులకు విద్య విషయంలో ఉచితంగా ఇచ్చేటువంటి పుస్తకాలు గాని, ఉచిత భోజనం గాని ఒక పద్ధతి ప్రకారం అందజేస్తే తద్వారా విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తారని తెలియజేశాడు. అభిజిత్ తన పరిశోధనలను హైదరాబాద్‌లో కూడా జరిపారు. వారు రచించిన పేపర్ 'ది ఎకనామిక్ లైవ్స్ ఆఫ్ ది పూర్'లో హైదరాబాద్‌కు కూడా సంబంధించిన కొన్ని విషయాలు చెప్పడం జరిగింది. అదేవిధంగా, బెనర్జీ దంపతులు ముంబై, బరోడాలోని విద్యార్థులపై ప్రత్యేకమైన పరిశోధనలు జరిపారు. ఈ పరిశోధనలో పూర్తిగా బలహీనమైన విద్యార్థులకు మంచి విద్యను బోధించే ఉపాధ్యాయుడిని నియమించి ఆ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపడం జరిగింది. ఆ రకంగా ప్రత్యేక శ్రద్ధ చూపిన విద్యార్థులు విద్యలో మంచి ఫలితాలు సాధిస్తారని ప్రయోగాత్మకంగా నిరూపించారు. ఇలాంటి పరిశోధనలు ఈ దంపతులు కెన్యా, ఇతర దేశాల్లో కూడా కొనసాగించారు. పేద ప్రజలకు ఆరోగ్యం, విద్య, రుణ వసతి, ఇతర వసతుల వంటి కల్పన ద్వారా పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించవచ్చునని శాస్త్రీయంగా తెలియజేశాయి. ఈ పరిశోధనల్లో భాగంగా వీరు విద్యలో భాగస్వాములైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తీసుకునే నిర్ణయాలను నిశితంగా పరిశీలించారు. 'రెమిడీరియాల్ ట్యూటరింగ్' అనే విధానం ద్వారా విద్యకు, పేదరికానికి మధ్య సంబంధాన్ని తెలియజేశాడు.

> విశ్వవిద్యాలయాల్లో ఎకనామిక్స్, కామర్స్, నిర్వహణ విభాగాలకు చెందిన పరిశోధనల్లో పేదరికమనే విషయాన్ని చేర్చి దానిపై మరింత పరిశోధక పత్రాలు వెలువడేలా చర్యలు తీసుకోవాలి. అంతేకాదు, అభిజిత్ తన పరిశోధనలకు నిలువైన 'ప్రొవర్టీ యాక్షన్ లాబ్స్' వంటివి భారత విశ్వవిద్యాలయాల్లో కూడా స్థాపించి నిరంతరం పరిశోధనలు సాగించాలి. అభిజిత్ ప్రకారం, పేదరికం అంటే పైసలు లేకపోవడం కాదు, వ్యక్తి సామర్థ్యాలను ఉపయోగించుకోకపోవడమే. నిజమే, ప్రతీ వ్యక్తి తన సామర్థ్యాలను ఉత్పాదక వైపు మళ్లించగలిగితే పేదరికాన్ని నిర్మూలించవచ్చు.

'పూర్ ఎకనామిక్' అనే గ్రంథం ద్వారా పేదరిక నిర్మూలనకు సూచనలు చేశాడు. పేదరిక నిర్మూలనలో ప్రభుత్వ భాగస్వామ్యం ద్వారా మంచి మార్పు తెచ్చే అవకాశం ఉన్నదని నిరూపించారు బెనర్జీ.

ఆయన పరిశోధనల్లో, పేదరిక నిర్మూలనకు 'సూక్ష్మ రుణాల'కు పెద్దపీట వేశారు. ఆయన సతీమణి కూడా మొరాకో, ఫ్రాన్స్, భారతదేశంలో పరిశోధనలు చేసింది. ఆ పరిశోధనల ద్వారా పేదవారు కూడా ధనవంతుల మాదిరి ఆలోచిస్తారని, కానీ వారు ఖర్చుపెట్టే విషయంపై ఏయే రకంగా ఖర్చుపెడుతారనేది వారి ద్రవ్యంపై ఆధారపడుతుందని శాస్త్రీయంగా తెలిపారు. అంతేకాకుండా, పేదరిక నిర్మూలనకు, ఆరోగ్యానికి ఉన్న ప్రాధాన్యాన్ని ఆమె తెలియజేశారు. మన రాష్ట్రంలో ఈ మధ్య కంటి పరీక్షలు, ఇతర ఆరోగ్య పరీక్షలు ఇలాంటి కోవకే వస్తాయి. ఆమె పరిశోధనల ఫలితాలను పరిశీలిస్తే.. ఆరోగ్యం, విద్య కారకాలు పరస్పరం అనులోమానుపాతంలో ఉంటాయని తేల్చాయి. నిజానికి, మన దేశంలో గ్రామాల్లో పేదరికం ఎక్కువగా ఉన్నది. కారణం వ్యవసాయం, దాని అనుబంధ పనులపై ఆధారపడి ఉండటమే. వారిలో 70-80 శాతం వరకు అందరూ చిన్న కమతాలు కలిగినవారే. వర్షాభావం, ప్రకృతి విప త్తులు, ఇతరత్రా కారణాల వల్ల గ్రామాలు పేదరికానికి గురవుతున్నాయి. కాబట్టి అభిజిత్ పరిశోధనల ప్రకారం, పేదరికానికి గురవుతున్న కుటుంబాల పిల్లలకు, విద్య, వైద్యం వంటి ముఖ్యమైన కారకాలపై దృష్టి పెట్టినట్లయితే భవిష్యత్ తరాలు కూడా పేదరికం నుంచి బయటపడే అవకాశం ఉంటుంది.

అలాగే, విశ్వవిద్యాలయాల్లో ఎకనామిక్స్, కామర్స్, నిర్వహణ విభాగాలకు చెందిన పరిశోధనల్లో పేదరికమనే విషయాన్ని చేర్చి దానిపై మరింత పరిశోధక పత్రాలు వెలువడేలా చర్యలు తీసుకోవాలి. అంతేకాదు, అభిజిత్ తన పరిశోధనలకు నిలువైన 'ప్రొవర్టీ యాక్షన్ లాబ్స్' వంటివి భారత విశ్వవిద్యాలయాల్లో కూడా స్థాపించి నిరంతరం పరిశోధనలు సాగించాలి. అభిజిత్ ప్రకారం, పేదరికం అంటే పైసలు లేకపోవడం కాదు, వ్యక్తి సామర్థ్యాలను ఉపయోగించుకోకపోవడమే. నిజమే, ప్రతీ వ్యక్తి తన సామర్థ్యాలను ఉత్పాదక వైపు మళ్లించగలిగితే పేదరికాన్ని నిర్మూలించవచ్చు.

**(వ్యాసకర్త: ఇండియన్ కామర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు)**

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com



ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంతోపాటు స్థానికంగా కురుస్తున్న వర్షాలకు గుట్టలపై నుంచి వస్తున్న వరదనీటితో బుధవారం ములుగు జిల్లా వాజేడు మండలంలోని బొగత జలపాతం కొత్త అందాలతో ఆకట్టుకుంటు న్నది. జలపాతం ముందు భాగంలోని స్విమ్మింగ్ పూల్ రక్షణ కంచె పైనుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తున్నది.
- వాజేడు



పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారంలోని కాళేశ్వరం ప్రాజెక్ట్ ఆరో ప్యాకేజీ నంది పంప్‌హౌస్‌లో ఏడో మోటర్‌కు ఇంజినీరింగ్ అధికారులు బుధవారం సాంకేతిక పరీక్షలు నిర్వహించారు. ఇక్కడి ఆరు మోటర్లకు ఇప్పటికే వెట్‌రన్ పూర్తికాగా.. చివరిదైన ఏడో మోటర్‌కు గురువారం వెట్ ట్రయల్ రన్ నిర్వహించనున్నట్టు రాష్ట్ర ఎత్తిపోతల పథకాల సలహాదారు పెంటారెడ్డి, ప్రాజెక్ట్ ఈఈ నూనె శ్రీధర్ తెలిపారు. - ధర్మారం



భూమి పచ్చని పైర్లతో కళకళలాడుతుంటే ఆకాశంలో కారు మబ్బులు కమ్ముకున్నాయి. అప్పటి వరకు ఎండకాసినా.. ఆకాశం ఒక్కసారిగా నల్లని మబ్బులు కమ్మి ఆహ్లాదకర వాతావరణం ఏర్పడింది. ఈ సుందర దృశ్యం ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలోని ఆరెగూడెం సమీపంలో బుధవారం సాయంత్రం దర్శనమిచ్చింది.
- నేలకొండపల్లి



# షెడ్యూల్ ప్రకారం బస్సులు

- సాఫీగా సాగుతున్న రాకపోకలు
- రోజురోజుకు పెరుగుతున్న సర్వీసుల సంఖ్య



బుధవారం జనగామ బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు



నల్లగొండ జిల్లాకేంద్రం నుంచి ఆర్టీసీ బస్సులో వెళ్తున్న ప్రయాణికులు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. చాలాచోట్ల షెడ్యూల్ ప్రకారం బస్సులు నడుపుతుండటంతో ప్రయాణాలు సాఫీగా సాగుతున్నాయి. కరీంనగర్ రీజియన్‌లో బుధవారం 470 ఆర్టీసీ, 192 అద్దె బస్సులు కలిపి 662 బస్సులు నడిపించారు. కరీంనగర్-1, హుజూరాబాద్, మంథని, జగిత్యాల డిపోలు మినహా మిగతా ఆరు డిపోల్లో లక్ష్యానికి మించి బస్సులు నడిపించినట్టు ఆర్‌ఎం జీవన్‌ప్రసాద్ తెలిపారు. 569 బస్సుల్లో టిమ్, 93 బస్సుల్లో టికెట్ల ద్వారా చార్జీలు వసూలు చేశారు. వరంగల్ రీజియన్‌లో రికార్డుస్థాయిలో బస్సులు నడుస్తున్నాయి. తొమ్మిది డిపోల్లో 866 బస్సులకుగాను 715 బస్సులను నడిపినట్టు ఆర్‌ఎం శ్రీధర్ తెలిపారు. ఖమ్మం డిపోలో ఆర్టీసీ 69, అద్దె బస్సులు 53, సత్తుపల్లి డిపోలో ఆర్టీసీ 34, అద్దె బస్సులు 35, మధిర డిపోలో 36 ఆర్టీసీ, 18 అద్దె బస్సులతోపాటు ప్రైవేట్ బస్సులు 25, మ్యాక్సీక్యాబ్‌లు 75 వరకు నడిచాయి. జిల్లాలో మొత్తం 345 వాహనాలు తిరిగాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు డిపోల నుంచి బస్సులను అన్ని ప్రధాన రూట్లలో నడుపుతున్నారు. మొత్తం 221 బస్సులు (90 శాతానికిపైగా) నడిపారు. మెదక్ రీజియన్‌లో 626 బస్సులు ఉండగా 380 ఆర్టీసీ, 156 అద్దె బస్సులు మొత్తం 536 బస్సులు ప్రయాణికులను వివిధ ప్రాంతాలకు చేరవేశాయి.

**పాలమూరు జిల్లాలో..**

మహబూబ్‌నగర్‌లో బుధవారం 67 ఆర్టీసీ, 36 అద్దె బస్సులు నడువగా, దాదాపు 10 వేల మంది ప్రయాణించారు. వనపర్తి జిల్లాలో 74 ఆర్టీసీ, 23 అద్దె బస్సులు మొత్తం 97 బస్సులను వివిధ రూట్లలో నడిపారు. కురుమూర్తి జాతరకు కూడా ప్రత్యేక బస్సులు నడిపేందుకు చర్యలు చేపట్టనున్నట్టు అధికారులు తెలిపారు. నారాయణపేట డిపో పరిధిలో 52 ఆర్టీసీ, 31 అద్దె బస్సులు నడిచాయి. నిర్మల్ జిల్లాలో ఆర్టీసీ బస్సులు షెడ్యూల్ ప్రకారం నడుస్తున్నాయి. నిర్మల్, భైంసా డిపోల పరిధిలో 120 ఆర్టీసీ, 76 అద్దె బస్సులు, 107 ప్రైవేటు వాహనాలు నడిచాయి. వికారాబాద్ జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి డిపోల నుంచి బుధవారం 199 బస్సులు రోడ్డెక్కాయి. నల్లగొండ జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. బుధవారం నల్లగొండ, దేవరకొండ, మిర్యాలగూడ, నార్కట్‌పల్లి డిపోల నుంచి 290 బస్సులను నడిపించారు. సూర్యాపేట డిపో నుంచి ఆర్టీసీ 53 బస్సులు, 45 అద్దె బస్సులు కలిపి మొత్తం 98 సర్వీసులు ప్రయాణికులకు సేవలందించాయి. కోదాడ డిపో నుంచి ఆర్టీసీ 47, అద్దె బస్సులు 30 నడిచాయి. యాదగిరిగుట్ట డిపో నుంచి 138 బస్సులు నడిచాయి.



జెడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. చిత్రంలో మంత్రి సత్యవతిరాథోడ్, ఎంపీ మాలోత్ కవిత, జెడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు తదితరులు

## త్వరలో జెడ్పీటీసీలకు అధికారాలు

- ఎంపీపీలకు కూడా..
- పారిశుద్ధ్య పనుల నిర్వహణకు ఊరికో ట్రాక్టర్
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** జెడ్పీటీసీలు, ఎంపీపీలు అధికారాలు లేవని నిరుత్సాహపడొద్దని, త్వరలోనే ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు తదితర కార్యక్రమాలను పర్యవేక్షించే అధికారాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. బుధవారం మహబూబాబాద్‌లోని జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు అధ్యక్షతన జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్ ముఖ్యఅతిథులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలకు అధికారాలు కల్పిస్తూ వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టనున్నట్టు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, సర్పంచ్‌లు సమన్వయంతో ముందుకెళ్లి గ్రామాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలని, పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్య మివ్వాలన్నారు. ప్రతి గ్రామానికో ట్రాక్టర్‌ను పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, డోర్నకల్, మహబూబాబాద్, ములుగు ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్‌నాయక్, సీతక్క, కలెక్టర్ శివలింగయ్య, జెడ్పీ సీఈవో సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు.



## పాత ఇంట్లో వెండినాణేలు లభ్యం

**తాండూరు, నమస్తే తెలంగాణ:** వికారాబాద్ జిల్లా తాండూరులోని ఓ ఇంట్లో వెండి నాణేలు లభ్యమయ్యాయి. పాత తాండూరు హనుమాన్ దేవాలయం సమీపంలోని నారా నరేందర్‌కు చెందిన పాత ఇంటిని కొన్నేండ్ల క్రితం బాబూమియా, ఖయ్యూం, మొహిజ్‌లు కొనుగోలు చేశారు. ఆ ఇంటిని జేసీబీతో కూల్చి వేస్తుండగా గోడల మధ్య నుంచి పురాతన వెండి నాణేలు లభ్యమయ్యాయి. వాటిని నాలుగు సంచుల్లో నింపి ఇతర చోటుకు తరలించినట్టు సమాచారం. ఈ విషయం బయటకు పొక్కడంతో పోలీసులు ఇంటిని విక్రయించిన నారా కుటుంబ సభ్యుల నుంచే 571 నాణేలు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.

# ఆర్టీసీని విలీనం చేయాల్సిందే

మూడోపేజీ తరువాయి...

లేదన్నారు. 26 రోజులుగా శాంతియుతంగా సమ్మె చేయడం గొప్ప విషయమని చెప్పారు. కాంగ్రెస్ నేత, ఎంపీ రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ విలీనం సాధ్యంకాదని సీఎం కేసీఆర్ మాట్లాడుతున్నారని, కానీ పక్క రాష్ట్రంలో ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. ఆర్టీసీ పూర్తిస్థాయిలో విడిపోలేదని చెప్తున్నారని, విడిపోనప్పుడు ఏపీలో విలీనంచేస్తే ఇక్కడ కూడా విలీనమైనట్లేనని అన్నారు. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం అయ్యేవరకు పోరాడుదామన్నారు. టీటీడీపీ అధ్యక్షుడు ఎల్ రమణ మాట్లాడుతూ అన్ని డిమాండ్లలో విలీనం ముఖ్యమైనదని, ఆర్టీసీ కార్మికుల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం విలీన ప్రక్రియను ప్రారంభించాలన్నారు. కాంగ్రెస్ నేత వీ హన్మంతరావు మాట్లాడుతూ కోదండరాం, అశ్వత్థామరెడ్డి కేసీఆర్‌ను పొగిడినవారేనని, ఇప్పుడు విలీనం కోసం యుద్ధం చేయాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పారు. బీజేపీ నేత, మాజీ ఎంపీ జీ వివేక్ మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని, తెలంగాణ ఆవిర్భావం కోసం కొట్లాడిన కార్మికుల కోసం సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలని అన్నారు. బీజేపీ నాయకుడు జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం అయ్యేవరకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ టీఎస్‌ఆర్టీసీ సమస్యల పరిష్కారానికి విలీనం ఒక్కటే పరిష్కారమన్నారు.





బుధవారం సరూర్‌నగర్ ఇండోర్‌స్టేడియంలో టీఎస్ ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన సకల జనభేరి సభలో అభివాదం చేస్తున్న జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి, విపక్ష పార్టీల నేతలు వీ హనుమంతరావు, ఎల్ రమణ, రేవంత్‌రెడ్డి తదితరులు

జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి మాట్లాడుతూ ఐదురోజులుగా ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతుగా కూనంనేని సాంబశివరావు చేస్తున్న దీక్షను గురువారం ఉదయం పదిగంటలకు విరమింపజేయాలన్నారు. ప్రతి డిపో పరిధిలో గురువారం ఉదయం పది గంటల నుంచి 24 గంటలపాటు దీక్షలు చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, బీసీ సంక్షేమసంఘం నాయకుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు రాజిరెడ్డి కూడా విలీనంపై డిమాండ్ చేశారు. తొలుత.. మరణించిన ఆర్టీసీ కార్మికులకు సభలో నివాళులు అర్పించారు. కాగా జేఏసీ-1 నాయకులను ఎవ్వరినీ సభకు, వేదికపైకి ఆహ్వానించకపోవడంపై కొన్నిసంఘాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. సభలో కాంగ్రెస్ నాయకుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, టీఎంయూ నాయకులు తిరుపతి, థామస్‌రెడ్డి, రాజలింగం, జేఏసీ నాయకులు వీఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

**నిమ్స్‌లో కొనసాగుతున్న కూనంనేని దీక్ష**

ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతుగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు చేపట్టిన నిరాహారదీక్ష ఐదోరోజూ కొనసాగింది. నిమ్స్ దవాఖానలో ఉన్న ఆయనను బుధవారం పలుసంఘాల నాయకులు పరామర్శించి మద్దతు తెలిపారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన వ్యక్తంచేశారు.

## గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ మృతి



ఎన్ బాబు (ఫైల్)

**ఆర్కేపురం:** సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆర్టీసీ జేఏసీ నిర్వహించిన సభకు హాజరైన నంగునూరి బాబు అనే డ్రైవర్ గుండెపోటుతో మృతి చెందాడు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం గుగ్గిల్ల గ్రామానికి చెందిన నంగునూరి బాబు (53) గత 25 సంవత్సరాలుగా కరీంనగర్ -2 డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సరూర్‌నగర్ సభ అనంతరం బయటకువస్తుండగా గుండెపోటుకు గురయ్యాడు. తోటి కార్మికులు అతడిని వెంటనే సమీపంలోని ఓజోన్ దవాఖానకు తరలించారు. అప్పటికే బాబు చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న ఆర్టీసీ జేఏసీ చైర్మన్ అశ్వత్థామరెడ్డి, కో-చైర్మన్ రాజిరెడ్డి, ఇతర కార్మికసంఘాల నాయకులు ఓజోన్ దవాఖానకు వచ్చి వివరాలు తెలుసుకున్నారు. గురువారం కరీంనగర్ జిల్లా బంద్‌కు పిలుపునిస్తున్నట్లు అశ్వత్థామరెడ్డి ప్రకటించారు.



బుధవారం కరీంనగర్‌లో కేబుల్ బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

## కేబుల్ బ్రిడ్జి కరీంనగర్‌కే తలమానికం

- మంత్రి గంగుల కమలాకర్
- తీగల వంతెన పనుల పరిశీలన

**కరీంనగర్ కార్పొరేషన్, నమస్తేతెలంగాణ:** కరీంనగర్‌లో మానేరు వాగుపై నిర్మిస్తున్న తీగల వంతెన (కేబుల్ బ్రిడ్జి) జిల్లాకే తలమానికమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన తీగల వంతెన నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్‌కు కరీంనగర్ జిల్లా అంటే ఎంతో ప్రేమ అని, ఆ ప్రేమతోనే జిల్లాకు తీగల వంతెన, ఐటీ టవర్స్, మానేరు రివర్ ఫ్రంట్ మంజూరుచేశారని గుర్తుచేశారు. తీగల వంతెన పనులు శరవేగంగా సాగుతున్నాయని, 2020 మార్చి కల్లా పనులు పూర్తవుతాయని అన్నారు.


భారతీయ రైల్వేలు
రైల్వే విద్యుదీకరణ
www.ireps.gov.in
T.N.No. RESC/S&T/Tender/Sig/PDPL-LPJL/TWS/12/19 dt.29.10.2019

దిగువ పనుల కోసం చీఫ్ ప్రాజెక్ట్ డైరెక్టర్, రైల్వే విద్యుదీకరణ, సికింద్రాబాద్ వారిచే విడి-ఇ-టెండర్లు (ఆన్‌లైన్) కోరబడుచున్నవి. అవి 28-11-2019న 15.00 గం. వరకు స్వీకరించబడి మరియు అదే రోజు డిప్యూటీ చీఫ్ సిగ్నల్ & టెలికమ్యూనికేషన్ ఇంజినీర్ కార్యాలయం, రైల్వే విద్యుదీకరణ, సికింద్రాబాద్‌లో 15.30 గం.కు తెరువబడతాయి.

క్ర.సం.1. టెండరు ప్రకటన నం. RESC/S&T/ Tender / Sig/ PDPL-LPJL/ TWS/12/19 తేది: 29-10-2019. **పని వివరణ:** ద.మ. రైల్వేలోని PDPL-LPJL Gr. 206 సెక్షన్‌లోని కరీంనగర్ స్టేషన్ వద్ద PI మార్పు ద్వారా టవర్ వ్యాగన్ సైడింగ్స్ ఏర్పాటుకు సంబంధించి భూగర్భ సిగ్నలింగ్ కేబుల్స్ / పవర్ కేబుల్స్ త్రవ్వుట పని, వేయుట, ఫౌండేషన్స్ కాస్టింగ్, కొన్ని ఎక్విప్‌మెంట్/ మెటీరియల్స్ సరఫరా, అప్పారటస్ కేసుల స్థాపన & ఎక్విప్‌మెంట్ వైరింగ్ అమర్చుట, పరీక్షించుట, పనిచేయించుట. **పని సుమారు విలువ:** (రూ) 17.70 లక్షలు, **బయానా:** రూ. 35,400/-, **టెండరు ఫారం ధర:** 2000/-, **పూర్తి చేయు కాలం:** పన్నెండు నెలలు

1. ఇ-టెండరు (ఆన్‌లైన్) ద్వారా టెండరు మూసివేత **తేది:** 28.11.2019 **సమయం:** 15.00 గం||లు
2. ఇ-టెండరు (ఆన్‌లైన్) ద్వారా టెండరు తెరుచు **తేది:** 28.11.2019 **సమయం:** 15.30 గం||లు

తదుపరి టెండరు నిబంధనలు/వివరాలు (టెండరు డాక్యుమెంట్లలో లభించును) కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ కొరకు మా వెబ్‌సైట్ **"www.ireps.gov.in"** చూడండి.
**టెండరు డాక్యుమెంట్లకు ఏదేని మార్పు/సవరణ/అనుబంధం అవసరమైతే టెండరు తెరుచు తేదీకి కనీసం పదిరోజుల ముందుగా పై వెబ్‌సైట్ నందు పోస్ట్ చేయబడును. దానిని వెబ్‌సైట్‌పై చూడవచ్చును.

**చీఫ్ ప్రాజెక్ట్ డైరెక్టర్,**
RE, సికింద్రాబాద్
A1785

తదుపరి టెండరు నిబంధనలు/ వివరాలు (టెండరు డాక్యుమెంట్లలో లభించును) కోసం మరియు దాఖలు కోసం మా వెబ్‌సైట్ www.ireps.gov.in ను చూడండి.


### రేపట్నుంచి నిట్‌లో టెక్నోజియాన్

**నిట్‌క్యాంపస్ (వరంగల్):** నవంబర్ ఒకటి నుంచి మూడో తేదీ వరకు వరంగల్ నిట్‌లో టెక్నోజియాన్-2019 నిర్వహిస్తున్నట్టు స్టూడెంట్ వెల్ఫేర్ విభాగం డీన్ ఎల్‌ఆర్‌జీ రెడ్డి చెప్పారు. బుధవారం నిట్‌లోని కలాం అతిథి గృహంలో టెక్నోజియాన్ ఇంచార్జి డాక్టర్ ఎల్ ఆంజనేయులుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. భవిష్యత్‌ను శాసించే సాంకేతికత, వివిధ ఆవిష్కరణలు, జీవన ప్రమాణాలు పెంచే పరిశోధనలు, గ్రామీణాభివృద్ధి వంటి అంశాల చుట్టూ పరిశోధనలు సాగేలా టెక్నోజియాన్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇందులో 55కుపైగా ఈవెంట్లు ఉంటాయని తెలిపారు.

# పల్లె బస్సుల పరుగులు

మూడోపేజీ తరువాయి...

బుధవారం 803 ఆర్టీసీ బస్సులు తిరుగగా.. 50.12 శాతంగా నమోదైంది. రంగారెడ్డి రీజియన్‌లో 405 సిటీ బస్సులు తిరుగగా 86.17 శాతంగా నమోదయ్యాయి. రంగారెడ్డి, హైదరాబాద్ రీజియన్లలో సర్వీసులు పెరుగడంతో.. గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పాయి. ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో బస్సులు తిప్పుతున్న అధికారులు.. హైదరాబాద్‌లో కూడా అదే స్థాయిలో నడుపాలని నిర్ణయించారు. డిపోల్లో కండిషన్‌లో ఉన్న ప్రతి బస్సును బయటకు తీయాలని ఆదేశాలిచ్చారు. డిపో పరిధిలో 100 ఆర్టీసీ బస్సులు ఉంటే.. వాటిలో 80-85 వరకే కండిషన్‌లో ఉంటున్నాయని, మిగిలిన బస్సులలో ఉండటం లేదని, దీంతో వందశాతం తిప్పినట్టు రికార్డు కావడం లేదని రవాణాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. అయినప్పటికీ గ్రేటర్ పరిధిలో ఆర్టీసీ సిటీ సర్వీసులను పెంచినట్టు చెప్తున్నారు.

**6,515 బస్సుల్లో టికెట్లు జారీ**

రాష్ట్రవ్యాప్తంగా బుధవారం 4,575 ఆర్టీసీ బస్సులు, 1940 ఆర్టీసీ అద్దె బస్సులు నడిపినట్టు అధికారులు తెలిపారు. మొత్తం 72.80 శాతం బస్సులు తిరిగినట్టు వెల్లడించారు. 6,515 బస్సుల్లో మొత్తం టికెట్లు జారీ చేశామని, 542 బస్సుల్లో డ్రైవర్లు, 5,598 బస్సుల్లో కండక్టర్లు టిమ్ మెషిన్లతో టికెట్లు జారీచేసినట్టు వారు పేర్కొన్నారు.

**వంద శాతం నడిపేందుకు..**

రాష్ట్రంలో మొత్తం వంద శాతం ఆర్టీసీ బస్సులను నడిపేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఎక్కువగా ఆర్టీసీ సిటీ బస్సులను డిపోల్లో నుంచి బయటకుతీయాలని మేనేజర్లకు ఆదేశాలిచ్చారు. కండిషన్లలో లేని బస్సులను కండిషన్‌లోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు.



ఐటీడీఏ పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

## గిరిజనాభివృద్ధికి కృషి

ఐటీడీఏ పాలకవర్గ సమావేశంలో మంత్రి అల్లోల

**ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి/ఉట్నూర్ రూరల్:** గిరిజనాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని అటవీ పర్యావరణశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చెప్పారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో బుధవారం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) పాలకవర్గ సమావేశం జరిగింది. సభ్యులు ఏడు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. గిరిజనుల ఉపాధిని మెరుగుపర్చడంతోపాటు గ్రామాల్లో విద్య, వైద్యం, విద్యుత్, వ్యవసాయం, తాగునీరు, సాగునీటితో పాటు ఇతర సౌకర్యాలను కల్పించాలని సభ్యులు సూచించారు. సమావేశానికి ఆదిలాబాద్, కుమ్రం భీమ్ ఆసిఫాబాద్, నిర్మల్ జెడ్పీ చైర్మన్లు జనార్దన్ రాథోడ్, కోవ లక్ష్మి, విజయలక్ష్మి, ఆదిలాబాద్, పెద్దపల్లి ఎంపీలు సోయం బాపురావు, వెంకటేశ్ నేత, ఎమ్మెల్సీలు పురాణం సతీశ్, జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు జోగు రామన్న, రాథోడ్ బాపురావు, కోనేరు కోనప్ప, అత్రం సక్కు, రేఖానాయక్, దుర్గం చిన్నయ్య, విఠల్‌రెడ్డి, దివాకర్‌రావు, నాలుగు జిల్లాల కలెక్టర్లు దివ్య, ప్రశాంతి, భారతీ హోళీకేరి, రాజీవ్‌గాంధీ హన్మంతు హాజరయ్యారు.

**లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి: ఆదివాసీలు**

లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఆదివాసీలు బుధవారం పెద్దసంఖ్యలో ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌కు తరలివచ్చారు. లంబాడాలు ఎస్టీ జాబితాలో ఉండటం వల్ల తమకు విద్య, ఉద్యోగ, సంక్షేమ పథకాల్లో అన్యాయం జరుగుతున్నదన్నారు. ఐటీడీఏ పాలకవర్గ పాలకవర్గ సమావేశానికి వచ్చిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులకు తమ గోడును వినిపించేందుకు గేటు తీసుకొని లోనికి రావడానికి యత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. విషయం తెలుకున్న కలెక్టర్ దివ్య దేవరాజన్, పీవో కృష్ణ ఆదిత్య అక్కడకు చేరుకొని ఆదివాసీలతో మాట్లాడారు. లంబాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే అంశం తమ పరిధిలో లేదని, సుప్రీంకోర్టులో కేసు నడుస్తున్నదని తెలిపారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకోవడంతో ఆదివాసీలు శాంతించారు.

# వృద్ధ దంపతుల సజీవదహనం

- వరంగల్ రూరల్ జిల్లాలో విషాదం
- కన్నకొడుకే కాల్చేశాడని వదంతులు
- విచారణ చేపట్టిన పోలీసులు



భూక్య దస్రు, బాజు(ఫైల్)

**నెక్కొండ:** వృద్ధ దంపతులు సజీవ దహనమైన ఘటన వరంగల్ రూరల్ జిల్లా నెక్కొండ మండలం మడిపెల్లిలో బుధవారం రాత్రి చోటుచేసుకున్నది. కన్నకొడుకే తల్లిదండ్రులను మంచంలో వేసి కిరోసిన్‌పోసి కాల్చాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనలో కొడుకు పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పోలీసులు సైతం వెల్లడించారు. మడిపల్లి తండాకు చెందిన భూక్య దస్రు(70), బాజు (68) దంపతులకు ఇద్దరు కుమారులు కేతు రాం, వీరన్న, కూతురు బద్రి ఉన్నారు. దస్రు తనకున్న పదెకరాల భూమిని ఇద్దరు కొడుకులకు నాలుగు ఎకరాల చొప్పున పంచి ఇచ్చా డు. రెండెకరాలను తను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భూ పంపిణీలో తనకు పావు ఎకరం తక్కువగా వచ్చిందని పెద్దకొడుకు కేతురాం తల్లిదండ్రులతో గొడవ పడుతున్నాడు. చిన్నకొడుకు వీరన్న భూమిని కొన్నేండ్ల కిందట అతడి సోదరి బద్రికి విక్రయించాడు. తర్వాత వీరన్న చనిపోయాడు. వీరన్నకు చెందిన భూమి సోదరి సొంతం కావడంతో సోదరికి, కేతురాంకు మధ్య భూ వివాదం మొదలైంది. కోర్టులో సైతం కేసు నడుస్తున్నది. ఈ క్రమంలో బిడ్డకు తల్లిదండ్రులు అండగా ఉంటున్నారని కేతురాం వారితో తరుచూ గొడవ పడుతున్నాడు. ఈ పంచాయితీ పోలీస్‌స్టేషన్ వరకు చేరింది. ఈ క్రమంలోనే బుధవారం సాయంత్రం వృద్ధ దంపతులు సజీవ దహనమయ్యారు. వారిని మం చంలో కట్టేసి దహనం చేసినట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో వృద్ధ దం పతులు నివసిస్తున్న పెంకుటిల్లు దగ్ధమైంది. వృద్ధుల ఎముకలు మినహా మరేమీ కానరావడం లేదు. గ్రామస్థులు, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. విషయం తెలుసుకున్న సీఐ పెదన్న కుమార్, ఎస్సై నవీన్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. వృద్ధ దంపతుల సజీవ దహనం కేసులో కొడుకు పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతామని పోలీస్ అధికారులు పేర్కొన్నారు.

**మేము చంపలేదు..**

తల్లిదండ్రులను కాల్చి చంపామని వస్తున్న ఆరోపణలు నిజం కాదని కొడుకు కేతురాం, మనుమడు వెంకన్న తెలిపారు. వీరు కాలిన గాయాలతో నెక్కొండలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. భూక్య దస్రు, బాజు దంపతులను తాము చంపలేదని, వారిని రక్షించేందుకు యత్నించే క్రమంలో గాయపడ్డామని పేర్కొన్నారు.



హైదరాబాద్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి బయలుదేరిన ఓ కారు బుధవారం సాయంత్రం నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల లత్తీపూర్-ఈరటోనిపల్లి సమీపంలో డివైడర్‌ను ఢీకొని రోడ్డు పక్కన గుంతలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో నలుగురికి తీవ్రగాయాలు కాగా, అచ్చంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. - ఉప్పునుంతల

నమస్తే తెలంగాణ
ఆట
8
[ కరీంనగర్ ]
గురువారం 31 అక్టోబర్ 2019
WWW.NTNEWS.COM



# ఎస్‌జీ నుంచి గులాబీ బంతులు

## 72 బాల్స్ కోసం ఆర్డరిచ్చిన బీసీసీఐ

**న్యూఢిల్లీ:** కోల్‌కతా వేదికగా టీమ్‌ఇండియా తొలిసారిగా ఆడే చరిత్రాత్మక డే అండ్ నైట్ టెస్టు కోసం క్రికెట్ ఉత్పత్తుల సంస్థ ఎస్‌జీ గులాబీ బంతులను తయారు చేయనుంది. ఈ మేరకు 72 బంతులను అందివ్వాల్సిందిగా బీసీసీఐ ఆ సంస్థకు ఆర్డర్ ఇచ్చింది. దులీప్ ట్రోఫీలో డే అండ్ నైట్ ప్రయోగం చేసినప్పుడు కుకాబుర్రాకు చెందిన పింక్ బాల్‌ను బీసీసీఐ వినియోగించింది. టెస్టుల్లో వినియోగించిన ఎస్‌జీ ఎర్రబంతులపై గతంలో కోహ్లీ సహా మరికొందరు భారత ఆటగాళ్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంగ్లండ్‌కు చెందిన డ్యూక్, ఆసీస్‌లో కుకాబుర్రా బంతులతో పోలిస్తే త్వరగా రూపం మారిపోతున్నదని ఫిర్యాదు చేశారు. అయితే కొన్ని మార్పుల తర్వాత బంతి మెరుగైంది. ఈ నేపథ్యంలో గులాబీ బంతులను ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, జాగ్రత్తగా తయారు చేస్తామని ఎస్‌జీ సంస్థ ప్రతినిధి తెలిపారు

# నిఖత్‌కు కాంస్యం



**టోక్యో:** ఒలింపిక్ టెస్టు ఈవెంటులో తెలంగాణ యువ బాక్సర్ నిఖత్ జరీన్ కాంస్య పతకంతో సరిపెట్టుకుంది. బుధవారం జరిగిన మహిళల 51కిలోల సెమీఫైనల్లో నిఖత్..జపాన్ బాక్సర్ సనా కవానో చేతిలో ఓటమిపాలైంది. ప్రత్యర్థికి దీటైన పోటీనివ్వడంలో విఫలమైన నిఖత్ టోర్నీలో ముందంజ వేయలేకపోయింది. సిమ్రన్‌జీత్ కౌర్(60కి), ఆసియా రజత విజేత సుమిత్ సాంగ్వన్ (91కి), వహిల్‌పుయి (75కి) వేర్వేరు సెమీఫైనల్లో ఓటములతో కాంస్య పతకాలకే పరిమితమయ్యారు. మరోవైపు శివ తాపా (63కి), పూజా రాణి (75కి), అశిష్ (69కి) ఫైనల్లోకి దూసుకెళ్లారు. పురుషుల 63కిలోల సెమీఫైనల్లో మాజీ ప్రపంచ కాంస్య విజేత శివ తాపా..దైసుకె నరిమత్సు(జపాన్)పై విజయం సాధించాడు. హోరాహోరీగా సాగిన బౌట్‌లో కచ్చితమైన పంచ్‌లతో విరుచుకుపడ్డ శివ..మెజారిటీ రిఫరీల నిర్ణయంతో విజేతగా నిలిచాడు. మహిళల 75కిలోల సెమీస్‌లో పూజ...బ్రెజిల్ బాక్సర్ బీట్రిజ్ సోరెస్‌పై విజయంతో తుదిపోరులోకి ప్రవేశించింది.

# ఆసీస్‌దే టీ20 సిరీస్




**బ్రిస్బేన్:** సొంతగడ్డపై ఆస్ట్రేలియా అదరగొడుతున్నది. బుధవారం జరిగిన రెండో టీ20లో లంకపై ఆసీస్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో సిరీస్‌ను కైవసం చేసుకుంది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న లంక.. ఆసీస్ బౌలర్లు బిల్లీ స్టాన్‌లేక్ (2/23), కమ్మిన్స్ (2/29), అగర్ (2/27), ఆడమ్ జంపా(2/20) రాణింపుతో 19 ఓవర్లలో 117 పరుగులకు ఆలౌటైంది. కుశాల్ పెరెర (27), గుణతిలక (21) మినహా జట్టులో ఎవరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేకపోయారు. లక్ష్యఛేదనకు దిగిన ఆసీస్‌కు కెప్టెన్ ఫించ్(0) ఔట్ రూపంలో ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. అయితే వార్నర్ (60 నాటౌట్), స్మిత్ (53 నాటౌట్) అజేయ అర్ధసెంచరీలతో ఆసీస్ మరో ఏడు ఓవర్లు మిగిలుండగానే విజయాన్నందుకుంది.



# ద్రవిడ్‌తో దాదా భేటీ

**బెంగళూరు :** జాతీయ క్రికెట్ అకాడమీ(ఎన్‌సీఏ) హెడ్ రాహుల్ ద్రవిడ్‌తో బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ బుధవారం బెంగళూరులో సమావేశమయ్యాడు. అకాడమీ పనితీరు, అభివృద్ధి అంశాలపై ఈ ఇద్దరు మాజీ కెప్టెన్లు చర్చించారు. అకాడమీ కోసం ఈ ఏడాది మేలో కర్ణాటక ప్రభుత్వం నుంచి 25 ఎకరాలకు ఒప్పందం కుదుర్చుకున్న బీసీసీఐ.. సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఏర్పాటు కోసం మరో 15 ఎకరాల స్థలాన్ని తీసుకుంది. ప్రస్తుతం బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియానికి అనుబంధంగా ఎన్‌సీఏ నడుస్తున్నది. అయితే ప్రపంచస్థాయి అదనపు సౌకర్యాలతో అకాడమీని మరోచోట ఏర్పాటు చేయాలని బీసీసీఐ నిర్ణయించింది. బెంగళూరులోని కెంపెగౌడ విమానాశ్రయం సమీపంలో అకాడమీ ఏర్పాటు కోసం భూమిని సేకరించగా.. దీనిలో మూడు మైదానాలు, ఇండోర్ నెట్‌లు, పరిపాలన భవనాలు, హాస్టళ్లు నిర్మించాలని బీసీసీఐ ప్రణాళిక సిద్ధం చేసుకుంది.

## ప్రపంచకప్‌లో స్కాట్‌లాండ్‌కు చోటు

**దుబాయ్:** ఆస్ట్రేలియాలో వచ్చే ఏడాది జరిగే టీ20 ప్రపంచకప్ టోర్నీకి స్కాట్‌లాండ్ అర్హత సాధించింది. బుధవారం జరిగిన క్వాలిఫయింగ్ టోర్నీ ప్లేఆఫ్ మ్యాచ్‌లో స్కాటిష్ జట్టు 90 పరుగుల భారీ తేడాతో ఆతిథ్య యూఏఈని ఓడించి, పొట్టి ప్రపంచకప్‌నకు చేరింది. తొలుత బ్యాటింగ్ చేసిన స్కాట్‌లాండ్ జట్టు ఓపెనర్ మున్సే(65) సహా బెర్రింగ్టన్(48) రాణించడంతో 198 పరుగుల భారీ స్కోరు చేసింది. లక్ష్యఛేదనలో ఏ దశలోనూ ఆకట్టుకోలేకపోయిన యూఏఈ 18.3 ఓవర్లలోనే 108 పరుగులకే ఆలౌటైంది.

# బుకీతో బాగోతం!

ఈ సిరీస్‌లో ఏమైనా ఉందా బ్రో



## అంతర్గత విషయాల కోసం బుకీ ఆరా

## షకీబ్‌తో వాట్సప్ సందేశాలను విడుదల చేసిన ఐసీసీ

**దుబాయ్ :** బుకీ సంప్రదింపులను తమకు తెలుపని కారణంగా బంగ్లాదేశ్ స్టార్ క్రికెటర్, ప్రపంచ నంబర్‌వన్ ఆల్‌రౌండర్ షకీబల్ హసన్‌పై అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ) ఏడాది మినహాయింపుతో కూడిన రెండేండ్ల నిషేధాన్ని విధించిన సంగతి తెలిసిందే. అయితే భారత్‌కు చెందిన దీపక్ అగర్వాల్ అనే బుకీ పలు సందర్భాల్లో షకీబ్‌కు పంపిన సందేశాలను ఐసీసీ బుధవారం బహిర్గతం చేసింది. ఈ సంప్రదింపులను అవినీతి నిరోధక విభాగానికి(ఐసీసీ ఏసీయూ) అప్పట్లో తెలుపనందుకే షకీబ్‌పై ఐసీసీ వేటు వేసింది. గతేడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు నడిచిన వాట్సాప్ సందేశాలను ఐసీసీ వెల్లడించింది. ఆ సమయంలో ఎలాంటి ఫిర్యాదు చేయని షకీబ్.. ఈ ఏడాది జరిగిన విచారణలో తన తప్పిదాన్ని అంగీకరించాడు.

**జనవరి 2018..** శ్రీలంక, జింబాబ్వేలతో త్రైపాక్షిక సిరీస్‌కు బంగ్లా జట్టుకు షకీబ్ ఎంపికయ్యాడు. ఈ సిరీస్ సందర్భంగా అగర్వాల్.. షకీబ్‌ను సంప్రదించాడు.

**2018, జనవరి 19 ..** ఆ రోజు మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన షకీబ్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ అభినందనలు అంటూ అగర్వాల్ వాట్సప్ మెసేజ్ చేశాడు. దీంతో పాటు 'మనం ఇప్పుడే(ఈ సిరీస్) కలిసి పని చేద్దామా.. ఐపీఎల్ వరకు నేను ఆగనా' అని మరో సందేశాన్ని పంపాడు. ఇందులో పని అంటే.. జట్టు అంతర్గత వ్యూహాలు, కూర్పు గురించి సమాచారాన్ని ఇవ్వాలని కోరడమే. ఈ విషయం అర్థమైనా ఐసీసీ అవినీతి నిరోధక విభాగాని(ఏసీయూ)కి షకీబ్ ఫిర్యాదు చేయలేదు.

**2018, జనవరి 23 –** అగర్వాల్ నుంచి షకీబ్ మరో సందేశాన్ని అందుకున్నాడు. 'బ్రో ఈ సిరీస్‌లో ఏమైనా ఉందా' అని అడిగాడు. దీంతో జట్టు అంతర్గత సమాచారం అడుగుతున్నాడని షకీబ్‌కు అర్థమైంది.

**2018, ఏప్రిల్ 26 –** ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున పంజాబ్ కింగ్స్ ఎలెవెన్‌తో మ్యాచ్‌కు షకీబ్ సిద్ధమయ్యాడు. ఆ సమయంలో.. తుది జట్టులో ఓ ఆటగాడు ఉన్నాడా లేదా అంటూ అతడికి అగర్వాల్ వాట్సాప్‌లో సందేశాన్ని పంపాడు. అలాగే బిట్‌కాయిన్లు, డాలర్ అకౌంట్ల వివరాల గురించి కూడా అడిగాడు. మొదట మనం కలుద్దామని షకీబ్‌ను కోరాడు. వీటితో పాటు కొన్ని మెసేజ్‌లను షకీబ్ డిలీట్ చేశాడు. ఇవి కూడా అంతర్గత సమాచారం కోసం అగర్వాల్ అడిగినవేనని బంగ్లా స్టార్ కూడా అంగీకరించాడు.

సందేశాలతో అగర్వాల్ బుకీ అని షకీబ్‌కు ఎప్పుడో అర్థమైందని, అయినా అతడు ఫిర్యాదు చేయని కారణంగా నిషేధం విధించినట్టు ఐసీసీ ప్రకటించిన సంగతి తెలిసిందే. గతంలో బుకీ సంప్రదింపులపై మౌనం దాల్చిన షకీబ్... ఈ ఏడాదిలో రెండు సార్లు జరిగిన విచారణలో నిజం అంగీకరించాడు. బుకీకి సహకరించకున్నా.. ఫిర్యాదు చేయకుండా నిబంధనలను ఉల్లంఘించినందుకు షకీబ్‌పై వేటు పడింది. ఏడాది పూర్తి నిషేధంలో మళ్లీ నిబంధనలను మీరకుంటే... 2020 అక్టోబర్ 29 నుంచి షకీబ్ మళ్లీ అంతర్జాతీయ క్రికెట్ ఆడే అవకాశం ఉంది. అయితే వచ్చే ఏడాది ఐపీఎల్ సహా ఆస్ట్రేలియాలో జరిగే టీ20 ప్రపంచకప్‌నకు స్టార్ ఆల్‌రౌండర్ దూరం కానున్నాడు.

**అభిమానుల నిరసన**

షకీబ్‌పై ఐసీసీ వేటు వేయడంతో అతడి అభిమానులు బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో బుధవారం ఆందోళన నిర్వహించారు. రహదారులపైకి వచ్చి ఐసీసీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు.

**ఎంసీసీ నుంచి నిష్క్రమణ**

నిషేధం కారణంగా షకీబల్ హసన్.. ప్రతిష్ఠాత్మక మెరిల్‌బోర్న్ క్రికెట్ క్లబ్(ఎంసీసీ) ప్రపంచ క్రికెట్ కమిటీ నుంచి వైదొలిగాడు. ఈ విషయాన్ని ఎంసీసీ సైతం ధ్రువీకరించింది. ప్రస్తుత, మాజీ ఆటగాళ్లతో పాటు అంపైర్లు ఉన్న కమిటీలో 2017 అక్టోబర్‌లో షకీబ్ సభ్యుడయ్యాడు.

### మరింత శక్తితో తిరిగివస్తాడు

**ఢాకా :** నిషేధానికి గురైన షకీబల్ హసన్‌కు బంగ్లాదేశ్ జట్టు సహచరులు మద్దతుగా నిలిచారు. షకీబ్‌పై వేటు తనను తీవ్రంగా కలచివేసిందని సీనియర్ పేసర్ మష్రఫె మొర్తజా చెప్పాడు. 2023 ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ జట్టుకు షకీబ్ కెప్టెన్‌గా ఉంటాడని ట్వీట్ చేశాడు. షకీబ్ మరింత శక్తిమంతంగా తిరిగి వస్తాడని బంగ్లా స్టార్ ప్లేయర్ ముష్ఫికర్ రహీమ్ ట్వీట్ చేశాడు. జట్టులో అతడు లేకుండా ఆడతానని ఊహించలేదన్నాడు.

### రెండేండ్లు సరిపోదు : వాన్

షకీబ్‌పై ఐసీసీ మరింత తీవ్రమైన చర్యలు తీసుకోవాల్సిందని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్ అభిప్రాయపడ్డాడు. అతడిపై ఎలాంటి సానుభూతి లేదని, ఆటగాళ్లందరూ నిబంధలను పాటించాల్సిందేనని చెప్పాడు. షకీబ్‌పై రెండేండ్ల నిషేధం సరిపోదని ట్వీట్ చేశాడు.



భోపాల్‌లో జరిగే జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన వారిని బుధవారం అభినందిస్తున్న రాష్ట్ర ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మర్రి రాజశేఖర్ రెడ్డి

## రవిందర్‌కు రజతం



**బుడాపెస్ట్:** అండర్-23 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ రెజ్లర్ రవీందర్‌కు రజత పతకం దక్కింది. బుధవారం జరిగిన 61కిలోల ఫైనల్లో రవిందర్ 3-5 తేడాతో ఉలుక్‌బెక్‌క జోల్డోబెకోవ్(కిర్గిస్థాన్) చేతిలో ఓటమిపాలయ్యాడు. ఈ ఎడిషన్‌లో భారత్‌కు ఇది తొలి పతకం కాగా, ఓవరాల్‌గా ఐదో రజతం.

# వాణిజ్యం

## స్టార్టప్‌లకు లీగల్ అడ్వైజరీ సేవలు

### టీహబ్, నల్సార్ మధ్య కుదిరిన ఒప్పందం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ :** వినూత్న ఆలోచనలతో స్టార్టప్‌లు ప్రారంభించిన ఔత్సాహిక యువత భావి పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అవసరమైన న్యాయ సహాయం అందించేందుకు టీహబ్ మరో ముందడుగు వేసింది. స్టార్టప్ కంపెనీలకు న్యాయ సహాయం అందించేందుకు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న నల్సార్ యూనివర్సిటీతో ఒప్పందం కుదుర్చుకున్నది. నల్సార్‌కి చెందిన 'క్లియర్' అనే సంస్థ స్టార్టప్‌లకు న్యాయ, వాణిజ్య సంబంధమైన అంశాల్లో సహాయం చేయనున్నది. పారిశ్రామిక సంస్థలుగా ఎదిగే క్రమంలో బిజినెస్ మోడల్స్, వ్యాపార లావాదేవీలు, సంస్థలను రిజిస్ట్రేషన్ చేసుకోవడం, ట్యాక్స్ ఫైలింగ్, ముగింపు లెక్కలు, కాంట్రాక్టుల్లో ప్రవేశించడం, నిబంధనలను పాటించడం, న్యాయ సంబంధమైన విధి విధానాల్లో 'క్లియర్' స్టార్టప్‌లకు సహాయం చేయనున్నది. కార్పొరేట్ సంస్థలుగా ఎదిగే దిశలో స్టార్టప్‌లకు మార్గదర్శనం చేయడం, విదేశీ సంస్థలుగా ఎదిగేందుకు, సంస్థల మధ్య సరైన ఒప్పందాలు, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్, వాటాదారుల మధ్య సరైన ఒప్పందాల కోసం నల్సార్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు టీహబ్ సీఈవో రవినారాయణ్ పేర్కొన్నారు. ప్రపంచస్థాయి న్యాయ నిపుణులు తమ వద్ద ఉన్న స్టార్టప్‌లతో కలిసి పనిచేయనుండటం తమకు మరింత ఉత్సాహాన్ని ఇస్తున్నదని, స్టార్టప్‌లకు న్యాయ, వాణిజ్య అంశాలపరంగా మంచి పునాది లభిస్తుందని నల్సార్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఫైజాన్ ముస్తఫా చెప్పారు.



# ఐటీ కోతల్లేవ్!

### ఆదాయం పన్ను రేట్లు తగ్గవు • తోసిపుచ్చిన కేంద్ర ప్రభుత్వ వర్గాలు

### వేతన జీవులకు నిరాశే • వచ్చే బడ్జెట్‌లోనూ మొండి చెయ్యే

**న్యూఢిల్లీ, అక్టోబర్ 30:**

ఆదాయం పన్ను (ఐటీ) రేట్లలో ఎటువంటి తగ్గింపులు ఉండబోవని కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. దేశ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న స్తబ్ధతను తొలగించేందుకు గత నెల కార్పొరేట్ పన్నును మోదీ సర్కారు తగ్గించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వినిమయ సామర్థ్యం పెంపునకు వ్యక్తిగత ఆదాయం పన్నునూ తగ్గించనున్నారన్న ఊహాగానాలు బయలుదేరాయి. అయితే అలాంటిదేమీ లేదని తాజాగా ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దీంతో వేతన జీవులకు నిరాశే మిగిలింది. చివరకు వచ్చే ఆర్థిక సంవత్సరం (2020-21) కోసం ప్రకటించే బడ్జెట్‌లోనూ వ్యక్తిగత ఆదాయం పన్ను తగ్గే అవకాశాలు లేవని సంకేతాలివ్వడం గమనార్హం. దేశంలో నెలకొన్న ఆర్థిక మందగమనాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం వరుస సంస్కరణలను ప్రకటిస్తున్న సంగతి విదితమే. దీంతో ఎప్పట్నుంచో ఉన్న కార్పొరేట్ ట్యాక్స్ తగ్గింపు డిమాండ్‌నూ పరిగణనలోకి తీసుకుని సెప్టెంబర్‌లో 10 శాతం మేర కుదించింది. ఈ క్రమంలోనే వ్యక్తిగత ఆదాయం పన్నూ తగ్గొచ్చన్న అంచనాలు పెద్ద ఎత్తున వచ్చాయి. అయితే అవన్నీ ఊహాగానాలేనని ప్రభుత్వ లీకులతో తేటతెల్లమైంది. కాగా, ప్రస్తుత పన్నుల రేట్లను ప్రభుత్వం ఎంతగా సమర్థించుకున్నా.. విమర్శలు మాత్రం ఆయా రంగాల నిపుణుల నుంచి వ్యక్తమవుతూనే ఉన్నాయి. ముఖ్యంగా విద్య, వైద్య రంగాల్లో సామాన్యులపై పడుతున్న భారం.. అమెరికా తదితర దేశాలతో పోల్చితే ఎక్కువని గుర్తుచేస్తున్నారు. అమెరికా, బ్రిటన్ దేశాల్లో 90 శాతం మంది ప్రైమరీ, సెకండరీ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యను అభ్యసిస్తున్నారని విమర్శకులు చెబుతున్నారు. ఆరోగ్య పరమైన ఖర్చులూ అమెరికాలో 11 శాతం, బ్రిటన్‌లో 15 శాతంగానే ఉన్నాయని, భారత్‌లో మాత్రం 65 శాతంగా ఉన్నాయని అంటున్నారు. వీరందరిపై భారం తగ్గితే వినిమయ సామర్థ్యం పెరిగి, జీడీపీ పుంజుకుంటుందని అభిప్రాయపడుతున్నారు. అయితే గత ఆర్థిక సంవత్సరం (2018-19)లో అటు వ్యక్తిగత, ఇటు హిందూ అవిభాజ్య కుటుంబాలకు ప్రభుత్వ ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్ స్కీముల్లో పెట్టుబడులపై పన్ను కోతల ద్వారా రూ.లక్ష కోట్ల వరకు ప్రయోజనాన్ని అందించామని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అయినప్పటికీ రూ.5 లక్షల వరకు వార్షిక ఆదాయం ఉన్న వారికి వ్యక్తిగత ఆదాయం పన్ను నుంచి మినహాయింపు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేస్తున్నాయి.

**చైనా, అమెరికాల్లోనే ఎక్కువ**

భారత్‌తో పోల్చితే ఫ్రాన్స్, చైనా, అమెరికా, బ్రిటన్ దేశాల్లోనే పన్నులు ఎక్కువని ప్రభుత్వ వర్గాలు గుర్తుచేస్తున్నాయి. అపర కుబేరుల (హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ లేదా హెచ్‌ఎన్ఐ)పై ఫ్రాన్స్‌లో అత్యధికంగా 66.2 శాతం వ్యక్తిగత ఆదాయం పన్ను పడుతున్నదని సూచిస్తున్నాయి. అమెరికాలో 50.3 శాతంగా, చైనా, బ్రిటన్ దేశాల్లో 45 శాతంగా ఉందన్నాయి. భారత్‌లో మాత్రం 42.7 శాతంగానే ఉందని పేర్కొన్నాయి. గత బడ్జెట్‌లో దీన్ని పెంచిన విషయం తెలిసిందే. అయినప్పటికీ ప్రధాన దేశాల కంటే తక్కువేనని మోదీ సర్కారు గుర్తుచేస్తున్నది.

**వివిధ దేశాల్లో అపర కుబేరులపై విధిస్తున్న ఆదాయం పన్ను**

| దేశం | శాతంలో |
|---|---|
| స్వీడన్ | 25 |
| బ్రెజిల్ | 27.5 |
| భారత్ | 42.7 |
| చైనా, యూకే, దక్షిణాఫ్రికా | 45 |
| జపాన్ | 45.9 |
| అమెరికా | 50.3 |
| కెనడా | 54 |
| ఫ్రాన్స్ | 66.2 |

**స్టాక్ మార్కెట్లకు నష్టాలేనా?**

పన్ను తగ్గింపు అంచనాలతో లాభాల్లో పరుగులు పెట్టిన దేశీయ స్టాక్ మార్కెట్లు.. అవన్నీ ఉత్తవేనన్న నిజాలతో మళ్లీ భారీ నష్టాల్లోకి జారుకోవచ్చన్న అభిప్రాయాలు విశ్లేషకుల నుంచి వ్యక్తమవుతున్నాయి. మంగళవారం దేశీయ స్టాక్ మార్కెట్లు ఉద్దీపనలపై ఉన్న అంచనాలతోనే లాభపడ్డ విషయం తెలిసిందే. దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీటీ), స్వల్పకాలిక మూలధన లాభాల పన్ను (ఎస్‌టీసీజీటీ)లతో పాటు వ్యక్తిగత ఆదాయం పన్నూ తగ్గనుందన్న అంచనాలు మదుపరులను పెట్టుబడులకు ఉసిగొల్పాయి. అయితే ప్రభుత్వ వర్గాల తాజా సమాచారంతో గురువారం మార్కెట్లు భారీ నష్టాల్లో కూరుకుపోయినా ఆశ్చర్యపోనక్కర్లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## వెయ్యి కోట్ల ప్రీమియం వసూళ్లు

### లక్ష్యాన్ని నిర్దేశించుకున్న ఇండియాఫస్ట్ లైఫ్

**హైదరాబాద్, అక్టోబర్ 30:** ప్రభుత్వరంగ బ్యాంకులైన బ్యాంక్ ఆఫ్ బరోడా, ఆంధ్రా బ్యాంకులు సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఇండియాఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి రూ.1,000 కోట్ల ఇండివిజల్ రిటైల్ ప్రీమియం వసూళ్లు లక్ష్యంగా పెట్టుకున్నది. సెప్టెంబర్‌తో ముగిసేనాటికి రూ.325 కోట్ల ప్రీమియం వసూళ్లు చేసినట్లు, గతేడాదితో పోలిస్తే 29 శాతం అధికమని కంపెనీ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి రుశభ్ గాంధీ తెలిపారు. అంతక్రితం ఏడాది రూ.681 కోట్లుగా ఉన్నది. సెప్టెంబర్ నెలలో బీమా రంగం ప్రతికూల వృద్ధిని నమోదు చేసుకోగా, అదే సంస్థ మాత్రం 56 శాతం వృద్ధిని సాధించిందన్నారు. సంస్థ ఇటీవల స్మార్ట్ ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద తక్కువ ప్రీమియం చెల్లింపులపై మనీ బ్యాక్ లైఫ్ ఇన్సూరెన్స్ కల్పిస్తున్నది. ఒక్క ఏడాది పాటు ఎలాంటి చెల్లింపులు జరుపకపోయినప్పటికీ బీమా వర్తించే విధంగా ఈ ప్లాన్‌ను రూపొందించినట్లు చెప్పారు. ఆ తర్వాత ఏడాది రెండు ప్రీమియంలు చెల్లించాల్సి ఉంటుంది. కాగా, యూనియన్ బ్యాంక్‌లో ఆంధ్రాబ్యాంక్ విలీనమవుతుండటంపై ఆయన స్పందిస్తూ.. కేంద్ర ప్రభుత్వం విడుదల చేయనున్న మార్గదర్శకాలకోసం వేచి చూస్తున్నట్లు చెప్పారు.

# రెండోరోజు అదే జోరు


### 40 వేల పైకి చేరుకున్న మార్కెట్లు

### సెన్సెక్స్ 220, నిఫ్టీకి 57 పాయింట్ల లాభం

**ముంబై, అక్టోబర్ 30:** స్టాక్ మార్కెట్ల ర్యాలీ వరుసగా రెండోరోజు కొనసాగింది. కార్పొరేట్ల ఆశాజనక ఆర్థిక ఫలితాలకు తోడు పన్నులను మరింత తగ్గించే అవకాశాలు ఉన్నట్లు వచ్చిన సంకేతాలు మదుపరుల్లో ఉత్సాహాన్ని నింపింది. 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ తిరిగి 40 వేల మార్క్‌ను దాటింది. ఒక దశలో 40,178 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకిన సూచీ చివరకు 220.03 పాయింట్ల లాభంతో 40,051.87 వద్ద స్థిరపడింది. జూన్ 4, 2019 తర్వాత మళ్లీ సూచీ 40 వేల మార్క్‌ను తాకినట్లు అయింది. జాతీయ స్టాక్ ఎక్స్చేంజ్ సూచీ నిఫ్టీ 57.25 పాయింట్లు అధికమై 11,844.10 వద్ద స్థిరపడింది. డివిడెండ్లపై పన్నును ఎత్తివేసే ఉద్దేశంలో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్లు వచ్చిన వార్తలకు తోడు దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను(ఎల్‌టీసీజీ), సెక్యూరిటీ లావాదేవీలపై పన్ను(ఎస్‌టీటీ)లను కూడా ఎత్తివేసే అవకాశం ఉండటంతో మదుపరుల్లో కొనుగోళ్లకు మొగ్గుచూపారు. ఫలితంగా వరుసగా రెండు రోజుల్లో సెన్సెక్స్ 800 పాయింట్లకు పైగా లాభపడింది. బ్లూచిప్ కంపెనీల ఆర్థిక ఫలితాల్లో జోష్, కార్పొరేట్ రేట్ ట్యాక్స్ తగ్గింపు ఆశలు మార్కెట్లకు మరింత బూస్టినిచ్చాయని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. మార్కెట్లో అత్యధికంగా ఎస్బీఐ, టీసీఎస్, ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా, ఇన్ఫోసిస్, బజాజ్ ఆటోల షేర్లు మూడు శాతానికి పైగా లాభపడ్డాయి. మరోవైపు, యెస్ బ్యాంక్, మారుతి, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్‌ల షేర్లు మాత్రం 2.50 శాతం వరకు పతనం చెందాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఇంధన ధరలు భగ్గుమన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం తాజాగా మరిన్ని సంస్కరణలు ప్రకటించనుండటంతో మార్కెట్లు సానుకూలంగా స్పందించాయని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. రంగాలవారీగా చూస్తే ఐటీ, టెక్, చమురు అండ్ గ్యాస్, ఎఫ్ఎంసీజీ, క్యాపిటల్ గూడ్స్, యుటిలిటీ, టెలికం, ఇంధన రంగ షేర్లు రెండు శాతం వరకు లాభపడ్డాయి. కానీ, కన్జ్యూమర్ డ్యూరబుల్, రియల్టీ, మెటల్, ఆటో రంగ షేర్లు మాత్రం నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు లాభాల్లో ముగిశాయి. రూ.7,192.42 కోట్ల విలువైన షేర్లను విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు కొనుగోలు చేశారు.

**ఒత్తిడిలో టెలికం రంగ షేర్లు**

టెలకం రంగ షేర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. వరుసగా నష్టాల బాట పట్టిన టెలికం రంగ షేర్లు ఎట్టకేలకు మిశ్రమంగా ట్రేడయ్యాయి. ఒకదశలో 8 శాతానికి పైగా లాభపడిన వొడాఫోన్ ఐడియా షేరు ధర చివరకు 1.04 శాతం నష్టంతో రూ.3.81 వద్ద ముగిసింది. భారతీ ఎయిర్‌టెల్ 2.31 శాతం ఎగబాకి రూ.368.25 వద్ద స్థిరపడింది. గడిచిన త్రైమాసికానికిగాను ఆర్థిక ఫలితాలను వచ్చే నెలలో విడుదల చేయనున్నట్లు సంస్థ ప్రకటించడంతో మంగళవారం ఎయిర్‌టెల్ షేరు 3 శాతం పతనం చెందిన విషయం తెలిసిందే.



**రూపాయి 6 పైసలు డౌన్**

స్టాక్ మార్కెట్లు దౌడ్ తీయడం, ఇంధన ధరలు శాంతించినప్పటికీ రూపాయికి మాత్రం చిల్లులు పడ్డాయి. అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు ఉన్నట్లు వచ్చిన సంకేతాలు మారకంతోపాటు ఇతర కరెన్సీలు తీవ్ర ఆటుపోటులకు గురయ్యాయి. వీటిలో రూపాయి కూడా ఉన్నది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఆరు పైసలు తగ్గి రూ.70.90 వద్ద ముగిసింది. ఒక దశలో 71.03 స్థాయికి పడిపోయిన విలువ చివర్లో ఈ భారీ స్థాయి నష్టాల నుంచి కోలుకున్నది.

# ఇక బంగారం లెక్క!

మూడోపేజీ తరువాయి...

తీసుకుని, వినియోగించుకోనట్లైతే.. ఆపై జరిగే దాడుల్లో దొరికిన వారికి భారీ ఎత్తున జరిమానాలు ఉంటాయని తెలుస్తున్నది. లెక్కల్లేని పసిడిపై పెద్ద మొత్తంలో చెల్లించుకోవాల్సిందేనని అంటున్నారు. అయితే వివాహమైన మహిళలకు కొంత మినహాయింపు లభించే అవకాశాలున్నాయి. ముఖ్యంగా బంగారం అంశం సెంటిమెంట్‌తో కూడుకున్నది కావడంతో కాస్త జాగ్రత్తగా పరిశీలించాలన్న సూచనలు ఈ పథకాన్ని సిద్ధం చేస్తున్న ఆర్థిక వ్యవహారాల శాఖ, రెవిన్యూ శాఖలకు అందుతున్నాయి. నిజానికి ఈ నెల రెండో వారంలోనే ఈ క్షమాభిక్ష పథకంపై క్యాబినెట్‌లో చర్చ జరుగాల్సి ఉన్నప్పటికీ మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికల కారణంగా వాయిదా పడింది.

**బంగారం బోర్డు**

ప్రభుత్వ, ప్రైవేట్ రంగ ప్రతినిధులతో ఓ 'గోల్డ్ బోర్డు'ను ఏర్పాటు చేయనున్నారు. ఈ ఆర్థిక సంవత్సరమే ఈ బోర్డు ఏర్పాటయ్యేందుకు ఎక్కువ అవకాశాలున్నాయని సన్నిహిత వర్గాల సమాచారం. కొనుగోలుదారులను ఆకర్షించేలా ఈ బోర్డు ఎప్పటికప్పుడు తగిన సలహాలు, సూచనలు, ప్రతిపాదనల్ని చేయనున్నది. అంతేగాక దేశంలో చట్టబద్ధంగా పసిడి నిల్వలు పెంపొందడానికీ కృషి చేయనున్నది. కాగా, దేవాలయాలు, ట్రస్టుల వద్ద టన్నులకొద్దీ బంగారం నిల్వలు ఉంటాయి కాబట్టి, వాటి కోసం ప్రత్యేకంగా నియమనిబంధనలుంటాయని తెలుస్తున్నది. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోని లాకర్లలో ఈ బంగారం నిల్వలను భద్రపరుచడం కోసం తగిన మార్గదర్శకాలనూ ఈ బోర్డు జారీ చేయనున్నది.

**25 వేల టన్నుల బంగారం**

బంగారాన్ని దైవంగా భావించే భారత్‌లో గృహస్థుల వద్ద 25 వేల టన్నుల పసిడి నిల్వలు ఉండొచ్చని డబ్ల్యూజీసీ ఇండియా ఎండీ సోమసుందరం అంచనా వేస్తున్నారు. నిరుడు 760 టన్నులకు డిమాండ్ ఉందని, ఆర్థిక మందగమనం కనిపిస్తున్నా.. ఈ ఏడాది కూడా అదే స్థాయిలో ఉంటున్నదని చెబుతున్నారు. ఇక అధికారిక గణాంకాల ప్రకారం ఈ నెల 18 నాటికి ఆర్బీఐ వద్ద రూ.1,91,215 కోట్ల విలువైన బంగారం ఉన్నది. ఏటా 900 టన్నులకుపైగా బంగారం దేశంలోకి దిగుమతి అవుతున్నది. రూ.2.50 లక్షల కోట్లు వెచ్చిస్తున్నారు. ఇందులో చాలావరకు బంగారం సురక్షిత డిపాజిట్లలోనే ఉండగా, ఇది నిరుపయోగ ఆస్తిగా పేరుకుపోతున్నది.

**ఏడో విడుత గోల్డ్ బాండ్లు**

డిసెంబర్ 2 నుంచి 6 వరకు ఏడో విడుత పసిడి బాండ్ల పథకం అమల్లో ఉంటుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఆరో విడుత ఈ నెల 25న ముగిసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రస్తుత సావరిన్ గోల్డ్ బాండ్ స్కీంను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్ది ముందుకు తెస్తున్నారు. వ్యక్తిగత, హిందూ అవిభాజ్య కుటుంబాలు డీమ్యాట్ రూపంలో నాలుగు కిలోలదాకా బంగారాన్ని కొనుగోలు చేయవచ్చు. ట్రస్టులైతే 20 కిలోల వరకు కొనవచ్చు. ఈ బాండ్ల కాలపరిమితి తీరిన తర్వాత మార్కెట్ విలువ ప్రకారం ప్రతిఫలాలు మదుపరులకు అందుతాయి.



# పీపీఎఫ్, ఎఫ్‌డీలే ముద్దు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 30:** ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ) లేదంటే పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ల (పీపీఎఫ్)లో పెట్టుబడులు పెట్టేందుకే అధిక శాతం మహిళలు ఆసక్తి చూపుతున్నారు. స్క్రిప్‌బాక్స్ అనే ఆన్‌లైన్ ఆర్థిక సేవల సంస్థ నిర్వహించిన సర్వేలో దాదాపు 58 శాతం మంది ఈ మేరకు అభిప్రాయపడ్డారు. ఈ నెల తొలి రెండు వారాల్లో జరిగిన ఈ అధ్యయనంలో 400 మంది మహిళలు పాల్గొనగా, తమ కష్టార్జితం తాము కోరుకున్నప్పుడు చేతికందేలా ఉంటేనే ఇష్టమని మెజారిటీ స్త్రీలు స్పష్టం చేయడం గమనార్హం. ఇక ఈ 400 మందిలో 54 శాతం మంది మిల్లేనియల్స్ (1980 నుంచి 2000 మధ్య జన్మించినవారు)అవగా, 46 శాతం మంది నాన్-మిల్లేనియల్స్. ఇక మొత్తం మహిళల్లో తమ మిగులు ఆదాయాన్ని బంగారం కొనుగోలుకు ఉపయోగిస్తామని 6 శాతం మంది, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెడుతామని 15 శాతం మంది చెప్పారు. అయితే నాన్-మిల్లేనియల్స్‌లో సగం మంది మాత్రం రిటైర్మెంట్ నిధి, పిల్లల చదువులకు తమ సేవింగ్స్‌లో ప్రాధాన్యతను ఇస్తామని స్పష్టం చేశారు.

## ముగ్గురి ప్రాణాలు తీసిన
# కోడి పందాల మోజు

- ఏపీలో పోలీసుల నుంచి తప్పించుకునే యత్నంలో కాల్వలో పడి మృతి

**అమరావతి:** కోడి పందాల మోజు ఏపీలో ముగ్గురి ప్రాణాలు తీసింది. ప్రకాశం జిల్లా చీరాల మండలంలోని విజయనగర్‌కాలనీలో కోడి పందాలు నిర్వహిస్తున్నారని తెలిసి పోలీసులు దాడులు నిర్వహించారు. పోలీసులను చూసిన ముగ్గురు నిర్వాహకులు పారిపోయే క్రమంలో కాల్వలో పడి గల్లంతయ్యారు. స్థానికుల సహాయంతో బుధవారం గాలింపు చర్యలు చేపట్టి ఇద్దరి మృతదేహాలను బయటకు తీశారు. మరో వ్యక్తి కోసం గాలిస్తున్నారు. చనిపోయిన ఇద్దరిని మధు, శ్రీనుగా గుర్తించిన పోలీసులు, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# తెలంగాణలో వైద్యసేవలు భేష్

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధుల ప్రశంస

**రామడుగు:** ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించడంలో తెలంగాణ రాష్ట్రం ముందు వరుసలో ఉన్నదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రతినిధులు ప్రశంసించారు. బుధవారం వారు కరీంనగర్ జిల్లా రామడుగులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. దవాఖానలో రోగులకు అందిస్తున్న హైపర్ టెన్షన్ మందుల రికార్డులను పరిశీలించారు. రోగుల్లో అధికరక్తపోటు నియంత్రణ కోసం గ్రామస్థాయిలో ఆరోగ్య ఉపకేంద్రాల్లో కూడా క్రమపద్ధతిలో మందులు అందించడం గొప్ప విషయమని వైద్యుడు శ్రీనివాస్‌తోపాటు ఆరోగ్య సిబ్బందిని అంతర్జాతీయ కన్సల్టెంట్ ఫర్ హైపర్‌టెన్షన్ అధికారి, ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి డాక్టర్ థామ్ ఫ్రీడన్ అభినందించారు. అనంతరం షానగర్ ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధులు డాక్టర్ భావన, డాక్టర్ స్వాగ్రి, డాక్టర్ డేనియల్, జాతీయ ప్రతినిధి డాక్టర్ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

# ఒకే దూరానికి వేర్వేరు చార్జీలు!

- క్యాబ్ సర్వీసుల చార్జీల వసూళ్లను సవాల్‌చేస్తూ పిల్
- కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీచేసిన హైకోర్టు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** క్యాబ్ సర్వీసుల నిర్వాహకులు ఒకే దూరానికి వివిధ సమయాల్లో వేర్వేరు చార్జీలను వసూలుచేయడంపై హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ పిటిషన్ విచారణకు స్వీకరించిన చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ అభిషేక్‌రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు నోటీసులు జారీచేసింది. మీటర్లు లేకుండా భారీగా చార్జీలు వేస్తున్నారని విచారణ సందర్భంగా పిటిషన్ వేసిన 'ఫోరం అగైనెస్ట్ కరప్షన్' తరపు న్యాయవాదులు పేర్కొన్నారు. జీపీఎస్ ద్వారా ప్రయాణ దూరాన్ని లెక్కించడం ఆమోదయోగ్యం కాదని తెలిపారు. మీటర్లు లేకుండా తిరిగే క్యాబ్ సర్వీసులను అడ్డుకోవాలని, చార్జీలను నియంత్రించే విధానాన్ని రూపొందించేలా ఆదేశాలు జారీచేయాలని విజ్ఞప్తి చేశారు. మోటరు వాహనాల చట్టం ప్రకారం డ్రైవర్లు 8 గంటలకంటే ఎక్కువసేపు వాహనాలు నడుపరాదని తెలిపారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. కౌంటర్ దాఖలుచేయాలని రాష్ట్ర రవాణా, కేంద్ర రవాణాశాఖలు, రహదారుల మంత్రిత్వశాఖ, తూనికలు కొలతలశాఖకు నోటీసులు జారీచేసింది. విచారణను నాలుగువారాలపాటు వాయిదా వేసింది.



# వైద్యంలో హైదరాబాద్‌కు ప్రాముఖ్యం

- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వైద్యరంగంలో హైదరాబాద్‌కు ఎంతో ప్రాముఖ్యం పెరిగిందని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు తెలిపారు. ఇన్నోవేటివ్ మెడికల్ సైన్సెస్, బయో మెడికల్ రంగం పురోగతిలో తెలంగాణ ముందంజలో ఉన్నదని ప్రశంసించారు. క్షయ వ్యాధి నిర్మూలన లక్ష్యంగా ఇంటర్నేషనల్ యూనియన్ అగైనెస్ట్ ట్యూబర్‌కులోసిస్ లంగ్ డిసీజెస్ (ఐయూఏటీబీఎల్‌డీ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నాలుగు రోజులపాటు జరుగనున్న 50వ అంతర్జాతీయ సదస్సును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాయు కాలుష్యం నియంత్రణపై తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రత్యామ్నాయ చర్యలు హర్షణీయమన్నారు. భారత్‌లో 2025 వరకు టీబీ నిర్మూలన లక్ష్యంగా నిర్దేశించుకున్నామని, ఇందుకోసం ప్రైవేటు రంగంతోపాటు సమాజం కూడా కలిసిరావాలని పిలుపునిచ్చారు. 2018లో ప్రపంచవ్యాప్తంగా నమోదైన మరణాల్లో టీబీ పదో స్థానంలో ఉన్నదని చెప్పారు. శరీరంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుండటమే దీనికి కారణమన్నారు. రివైజ్డ్ నేషనల్ టీబీ కంట్రోల్ ప్రోగ్రామ్ (ఆర్‌ఎస్‌టీసీపీ) కార్యక్రమం ద్వారా భారత్‌లో టీబీ వ్యాధిగ్రస్తుల శాతం 1.7 తగ్గిందని, ఇది మరింత తగ్గాల్సిన అవసరం ఉందన్నారు. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మాట్లాడుతూ టీబీ కారణంగా దేశవ్యాప్తంగా ఏటా 3.5 లక్షల మంది విద్యార్థులు డ్రాపౌట్ అవుతున్నారన్నారు. టొబాకో ఫ్రీ సొసైటీని ఏర్పాటు చేయడంలో అన్నివర్గాల వారు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో కేంద్ర వైద్యఆరోగ్యశాఖమంత్రి అశ్వీన్‌కుమార్ చౌబే, రాష్ట్ర మంత్రి ఈటల రాజేందర్, ఐయూఏటీబీఎల్‌డీ అధ్యక్షుడు జెర్మియా, ఉపాధ్యక్షుడు లూయిస్ కాస్ట్రో, తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్, అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, 130 దేశాలకు చెందిన 400 మంది వైద్యనిపుణులు, దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వైద్యులు పాల్గొన్నారు.



టీబీ నిర్మూలనపై హెచ్‌ఐసీసీలో జరిగిన అంతర్జాతీయసదస్సులో పాల్గొన్న ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, గవర్నర్ తమిళిసై , కేంద్రమంత్రి అశ్వీన్‌కుమార్ చౌబే, రాష్ట్రమంత్రి ఈటల

## 2025 నాటికి టీబీ ముక్త్‌భారత్

- క్షయవ్యాధి నిర్మూలనకు కేంద్ర రాష్ట్రాలు కలిసి పనిచేయాలి
- టీబీ నివారణకు తెలంగాణ తీసుకుంటున్న చర్యలు భేష్
- కేంద్ర వైద్యఆరోగ్యశాఖ సహాయమంత్రి అశ్వీన్‌కుమార్ చౌబే
- అవగాహనాలోపం వల్లే టీబీ మరణాలు: రాష్ట్రమంత్రి ఈటల

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** 2025 నాటికి టీబీ ముక్తభారత్ లక్ష్యంగా నిర్ణయించామని, ఇందుకోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాలని కేంద్ర వైద్యఆరోగ్యశాఖ సహాయమంత్రి అశ్విని కుమార్ చౌబే పిలుపునిచ్చారు. టీబీ (క్షయవ్యాధి) నివారణకు తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న చర్యలు బాగున్నాయని అభినందించారు. బుధవారం హైదరాబాద్‌లోని కామినేని అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చ్‌సెంటర్‌లో టీబీపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా క్షయవ్యాధి బారినపడి మరణిస్తున్నవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నదన్నారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ (డబ్ల్యూహెచ్‌వో)2030 నాటికి క్షయవ్యాధిని నిర్మూలించాలని నిర్ణయించగా.. భారత్‌లో 2025 నాటికే పూర్తిస్థాయిలో నిర్మూలించాలని ప్రధాని మోదీ నిర్ణయించినట్టు తెలిపారు. వ్యాధి బాధితులకు అవసరమైన చికిత్స, మందులను ఉచితంగా అందించడంతోపాటు.. వారి బ్యాంక్‌ఖాతాల్లో నెలకు రూ.500 వేయనున్నట్టు వివరించారు. మందులు, వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నప్పటికీ.. ప్రజల్లో అవగాహన లేక రాష్టంలో ఏటా 12 వేల మంది క్షయవ్యాధితో చనిపోతున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ ఆందోళన వ్యక్తం చేశారు. 2023 నాటికి టీబీరహిత తెలంగాణగా రూపొందించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించినట్టు తెలిపారు. కాళోజీ నారాయణరావు వైద్యవిద్యాలయం వీసీ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, కామినేని అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చ్ సెంటర్ ప్రిన్సిపల్ డాక్టర్ సత్యనారాయణ, క్షయవ్యాధి నిపుణుడు డాక్టర్ సుభాకర్, డాక్టర్ అశ్విన్‌షా, డాక్టర్ రవీందర్‌రెడ్డి, డాక్టర్ హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

# రేపటి నుంచి కొత్త మద్యం పాలసీ

- 2,216 దుకాణాలకు పూర్తయిన కసరత్తు
- దరఖాస్తుల ద్వారా సమకూరిన రూ.975 కోట్ల ఆదాయం
- మద్యం షాపుల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుపై ఎక్సైజ్‌శాఖ దృష్టి
- జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉదయం 10 నుంచి రాత్రి 11 గంటల వరకు మద్యం అమ్మకాలు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో శుక్రవారం నుంచి నూతన మద్యంపాలసీ ప్రారంభం కానున్నది. రాష్ట్రవ్యాప్తంగా 2,216 మద్యం దుకాణాలకు లక్కీడ్రా ద్వారా దుకాణదారుల ఎంపిక ఇప్పటికే పూర్తయింది. 2021 అక్టోబర్ 31వ తేదీ వరకు ఈ విధానం అమల్లో ఉంటుంది. మద్యం దుకాణాల దరఖాస్తులకు ఈసారి రూ.2 లక్షల నాన్-రిఫండబుల్ ఫీజును నిర్ణయించినప్పటికీ అనూహ్యంగా పెద్దసంఖ్యలో దరఖాస్తులు అందాయి. సీఎం కేసీఆర్ సూచనలు, ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో ఎక్సైజ్‌శాఖ కమిషనర్ సోమేశ్‌కుమార్ కీలకంగా వ్యవహరిస్తూ పలు వెసులుబాట్లు, మార్పులు చేర్పులతో కొత్త ఎక్సైజ్ విధానాన్ని రూపొందించడంతో మద్యం దుకాణాలను సొంతం చేసుకొనేందుకు పోటీపెరిగింది. 2,216 దుకాణాలకు 48,784 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల ద్వారానే ప్రభుత్వానికి రూ.975.68 కోట్ల ఆదాయం సమకూరింది. లక్కీడ్రా ద్వారా అత్యంత పారదర్శక పద్ధతిలో దుకాణదారులను ఎంపికచేశారు. ఈసారి జనాభా ప్రాతిపదికన లైసెన్స్ ఫీజులను ప్రభుత్వం ఖరారుచేసింది. గతంలో ఉన్న నాలుగు స్లాబులను ఈసారి ఆరు స్లాబులకు పెంచడంతో దుకాణదారులకు కొంత వెసులుబాటు కలిగినట్లయింది. ఐదు వేలలోపు జనాభా ఉన్న ప్రాంతాలకు రూ.50 లక్షలు, ఐదు వేల నుంచి 50 వేల జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.55 లక్షలు, 50 వేల నుంచి లక్ష వరకు జనాభా ఉన్న ప్రాంతాలకు రూ.60 లక్షలు, లక్ష నుంచి 5 లక్షల మంది జనాభా ఉన్న ప్రాంతాలకు రూ. 65 లక్షలు, 5 లక్షల నుంచి 20 లక్షల మంది జనాభా ఉన్న ప్రాంతాలకు రూ.85 లక్షలు, 20 లక్షలకుపైగా జనాభా ఉన్న ప్రాంతాలకు రూ.కోటి 10 లక్షల ఏడాది లైసెన్స్ ఫీజును నిర్ణయించారు. మద్యం దుకాణాలు తెరిచి ఉంచే సమయాలను కూడా ప్రభుత్వం నిర్దేశించింది. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉదయం 10 నుంచి రాత్రి 11 గంటల వరకు, ఇతర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు అమ్మకాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

**కొత్త మద్యం పాలసీ ముఖ్యాంశాలు**

మద్యం దుకాణాల్లో కౌంటర్, మద్యం నిల్వ చేసే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి ఎక్సైజ్‌శాఖ కంట్రోల్‌రూంకు అనుసంధానించాలి. మద్యం దుకాణదారుల నుంచి లెవీ స్పెషల్ రిటైల్ ఎక్సైజ్ పన్నును ఏడాదికి రూ.5 లక్షల చొప్పున ఒకే వాయిదాలో వసూలుచేస్తారు. రిటైల్ మార్జిన్‌ను ఆర్డినరీ బ్రాండ్లపైన 27 శాతం, మీడియం, ప్రీమియం బ్రాండ్లపైన 20 శాతంగా.. బీర్లపై 20 శాతంగా నిర్ణయించారు. లైసెన్స్‌దారులు రెండేండ్ల ఎక్సైజ్ ఫీజును ఎనిమిది వాయిదాల్లో చెల్లించాలి. రెండేండ్ల లైసెన్స్ ఫీజులో ఎనిమిదో భాగానికి సమానమైన రెండు ఫిక్స్‌డ్ డిపాజిట్లుగానీ బ్యాంకు గ్యారెంటీలుగానీ సమర్పించాలి. రీనోటిఫికేషన్ తర్వాత కూడా ఏదైనా మద్యం దుకాణానికి దరఖాస్తులు రాకుండా ఖాళీగా ఉంటే ఎక్సైజ్‌శాఖ లేదా తెలంగాణ రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ ఔట్‌లెట్లు తెరిచేందుకు అనుమతి ఉంటుంది.

### ప్రక్రియను సరళతరం చేశాం



కొత్త మద్యం పాలసీలో దుకాణదారులకు ఇబ్బంది లేకుండా వినియోగదారులపై భారం పడకుండా.. అదే సమయంలో ప్రభుత్వానికి ఆదాయం పెరిగేలా పూర్తి ప్రక్రియను సరళతరం చేశాం. పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అందాయి. పాలసీ అమలు గడువుకు చాలా ముందస్తుగా లక్కీడ్రాను పూర్తిచేసి దుకాణదారులను ఎంపికచేశాం. వైన్‌మాల్స్ ఏర్పాటును రూ.5 లక్షల అదనపు ఫీజుతో అనుమతిస్తున్నాం. రూ.5 లక్షల అదనపు ట్యాక్స్ చెల్లింపునకు డిసెంబర్ వరకు గడువు ఇస్తున్నాం.

**- సోమేశ్‌కుమార్, కమిషనర్, ఎక్సైజ్‌శాఖ**

# విత్తనరంగ అభివృద్ధికి పూర్తి సహకారం

- బెర్లిన్‌లో జర్మన్ వ్యవసాయశాఖ ప్రతినిధులతో మంత్రి నిరంజన్‌రెడ్డి బృందం భేటీ

**హైదరాబాద్/మహబూబ్‌నగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** విత్తరరంగం అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం అందిస్తామని జర్మన్ వ్యవసాయ మంత్రిత్వ శాఖ ప్రతినిధులు హామీ ఇచ్చారు. విత్తన రంగం అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రశంసించింది. జర్మనీ పర్యటనలో భాగంగా వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధుల బృందం బుధవారం బెర్లిన్‌లో జర్మన్ వ్యవసాయ మంత్రిత్వశాఖ ప్రతినిధులతో సమావేశమైంది. విత్తనరంగ అభివృద్ధిపై ఇండో-జర్మన్ ద్వైపాక్షిక సహకార ప్రాజెక్టు మూడో విడుతను పొడిగించినందుకు ఈ సందర్భంగా జర్మనీ ప్రభుత్వానికి మంత్రి నిరంజన్‌రెడ్డి బృందం ధన్యవాదాలు తెలిపింది. తెలంగాణను సీడ్‌బౌల్‌గా మార్చేందుకు 2017 నుంచి నాణ్యమైన విత్తనోత్పత్తి, ధ్రువీకకరణ పద్ధతులపై సాంకేతిక పరిజ్ఞానం అందించి, నైపుణ్యాన్ని మెరుగుపరిచినట్టు తెలిపారు. అంతర్జాతీయ విత్తన ధ్రువీకరణ ద్వారా విత్తన ఎగుమతులను ప్రోత్సహించి విత్తన వాణిజ్యాన్ని పెంపొందించినట్టు వెల్లడించారు. సీఎం కేసీఆర్ ఆశయం మేరకు తెలంగాణను భారత విత్తన భాండాగారం నుంచి ప్రపంచ విత్తన భాండాగారంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నామన్నారు.

# తెలంగాణ రైతులపై వివక్ష

- ఏపీలో భూములున్నా దక్కని 'వైఎస్సార్ రైతు భరోసా'
- అధికారులకు విన్నవించినా స్పందన కరువు
- మీది మా రాష్ట్రం కాదంటూ సమాధానం
- దిక్కుతోచని స్థితిలో సరిహద్దు గ్రామాల రైతులు
- తెలంగాణలో భూములున్న ఏపీ రైతులకు 'రైతుబంధు' సాయం
- ఎందుకివ్వాలంటున్న మన అన్నదాతలు

**అలంపూర్:** అన్నదాతలను అన్నివిధాలుగా ఆదుకోవాలన్న ఉద్దేశంతో 'రైతుబంధు' పథకాన్ని ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం.. తెలంగాణ పరిధిలో భూములను కలిగివున్న రైతులందరికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నది. వారు ఎక్కడ నివసిస్తున్నారన్న దానితో నిమిత్తం లేకుండా పంట పెట్టుబడి సాయాన్ని అందజేసి అండగా నిలుస్తున్నది. దీంతో తెలంగాణలో వ్యవసాయ భూములను కలిగివున్న ఇరుగుపొరుగు రాష్ట్రాల రైతులు కూడా 'రైతుబంధు' సాయాన్ని పొందుతున్నారు. అయితే 'రైతుబంధు' మాదిరిగా ఇటీవల ఏపీలో 'వైఎస్సార్ రైతు భరోసా' పథకం కింద పంట పెట్టుబడి సాయాన్ని అందించడం ప్రారంభించిన జగన్మోహన్‌రెడ్డి సర్కారు.. ఆ రాష్ట్రంలో వ్యవసాయ భూములను కలిగివున్న రైతులందరికీ ఆ పథకాన్ని వర్తింపజేయడంలేదు. రైతుల ఆధార్ కార్డుల్లోని వివరాలను గమనంలోకి తీసుకొని ఈ పథకాన్ని అమలుచేస్తుండటంతో ఏపీలో వ్యవసాయ భూములను కలిగివున్న తెలంగాణ రైతులకు, ప్రత్యేకించి కర్నూలు జిల్లాలో సాగుభూములను కలిగివున్న జోగుళాంబ గద్వాల జిల్లా రైతులకు 'వైఎస్సార్ రైతు భరోసా' కింద సాయం అందడం లేదు. దీనికి కారణమేమిటని ఏపీలో సాగుభూములను కలిగివున్న తెలంగాణ రైతులు ప్రశ్నిస్తే.. 'మీది మా రాష్ట్రం కాదు' అని ఆ రాష్ట్ర అధికారులు సమాధానమిస్తున్నారు. ఈ విషయమై తెలంగాణవాసులు కర్నూలు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదుచేసి 'వైఎస్సార్ రైతు భరోసా' పథకాన్ని తమకూ వర్తింపజేయాలని కోరినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు.



జోగుళాంబ గద్వాల కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జిల్లెలపాడు రైతులు

### అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం..



కర్నూలు జిల్లా పంచలింగాల గ్రామ శివారులో రెండెకరాల వ్యవసాయ భూమిని కలిగివున్న మాకు 'వైఎస్సార్ రైతు భరోసా' కింద పంట పెట్టుబడి అందడంలేదు. ఈ విషయాన్ని పలుమార్లు ఏపీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేదు. మేము ఏపీ వాసులం కానందున ఈ పథకం వర్తించదని ఆ రాష్ట్ర అధికారులు చెప్తున్నారు.

**- షాలీబీ, మహిళా రైతు, ఉండవెల్లి, జోగుళాంబ గద్వాల**

### సరిహద్దు గ్రామాల్లో సీమ రైతులు..



ఉండవల్లి, రాజోలి, అయిజ, అలంపూర్ మండలాల్లోని జిల్లెపాడు, ర్యాలంపాడు, సుల్తానాపురం, బైరాపురం, సింగవరం తదితర గ్రామాల్లో పొలాలను కలిగివున్న రాయలసీమ రైతులు 'రైతుబంధు' కింద తెలంగాణ ప్రభుత్వం నుంచి సాయం పొందుతున్నారు. ఏపీలో సాగుభూములను కలిగివున్న తెలంగాణ రైతులకు మాత్రం 'వైఎస్సార్ రైతు భరోసా' కింద చిల్లిగవ్వకూడా అందడంలేదు.

**- రేపల్లె దేవదాసు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి**

### తెలంగాణ సర్కార్ ఇస్తున్నప్పుడు ఏపీ సర్కార్ ఎందుకివ్వదు?



పంచలింగాల గ్రామ శివారులో మాకు వ్యవసాయ భూమి ఉన్నది. తెలంగాణలో పంట భూములున్న ఏపీ రైతులకు తెలంగాణ ప్రభుత్వం 'రైతుబంధు పథకాన్ని వర్తింపజేస్తున్నప్పుడు ఏపీలో పంట భూములున్న తెలంగాణ రైతులకు 'వైఎస్సార్ రైతు భరోసా' పథకాన్ని ఎందుకు వర్తింపజేయరు?

**- జ్యోతి, మహిళా రైతు, నల్లకుంట, గద్వాల పట్టణం**

### తెలంగాణ ప్రభుత్వం కూడా ఇవ్వొద్దు



ఎక్కడైనా రైతు రైతే. పథకాలు అందరికీ సమానంగా వర్తింపజేయాలి. ఏపీలో సాగుభూములున్న తెలంగాణ రైతులకు 'వైఎస్సార్ రైతు భరోసా' పథకాన్ని వర్తింపజేయకపోతే తెలంగాణలో వ్యవసాయ భూములున్న ఏపీ రైతులకు 'రైతుబంధు' పథకాన్ని వర్తింపజేయకూడదు.

**- దేవ మణెమ్మ, లింగనవాయి, అలంపూర్ మండలం, జోగుళాంబ గద్వాల జిల్లా.**

### నగదును వాపస్ తీసుకోవాలి



ఏపీలోని తెలంగాణ రైతులకు 'వైఎస్సార్ రైతు భరోసా' పథకాన్ని వర్తింపజేయకపోతే.. తెలంగాణలో 'రైతుబంధు' పథకం కింద ఏపీ రైతులకు ఇచ్చిన పెట్టుబడి సాయాన్ని వెనక్కు తీసేసుకోవాలి.

**- మద్దిలేటి, జిల్లెలపాడు, అలంపూర్**

# 'అమ్మ ఒడి'కి ఏపీ క్యాబినెట్ ఆమోదం

- కృష్ణా జిల్లాలో గీతం వర్సిటీకి ఇచ్చిన భూకేటాయింపులు రద్దు
- 100 గజాల ఇంటిస్థలం ఒక్కరూపాయికే రిజిస్ట్రేషన్

**అమరావతి:** ఏపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అమ్మ ఒడి పథకానికి ఆ రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. బుధవారం సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో కొత్తగా అమల్లోకి తీసుకురానున్న కీలక పథకాలకు ఆమోదముద్ర వేశారు. బాలకృష్ణ వియ్యంకుడి యాజమాన్యంలోని గీతం యూనివర్సిటీకి కృష్ణా జిల్లాలో కేటాయించిన భూములను రద్దుచేయాలని నిర్ణయించారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు అమ్మ ఒడిని వర్తింపజేయనున్నట్టు, ఈ పథకం కింద ఏటా రూ.15వేలు ఇవ్వనున్నట్టు మంత్రి పేర్ని నాని తెలిపారు. కృష్ణా, గోదావరి కెనాల్స్ వద్ద క్లీనింగ్ మిషన్ ఏర్పాటుపై చర్చ జరిగింది. టీటీడీ మినహా బోర్డు సభ్యుల నియామకం కోసం చట్ట సవరణకు ఆమోదం తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్‌ను విభజించడంతోపాటు.. మాదిగ, మాల, రెల్లి ఇతర షెడ్యూల్ కులాల కార్పొరేషన్లు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ఇసుక కొరత నివారణకు చర్యలు చేపట్టాలని, ఇసుకతోపాటు రోబోసాండ్‌ని వినియోగించాలని, స్టోన్ క్రషింగ్ యూనిట్లకు పావలా వడ్డీకి రుణాలు ఇవ్వాలని నిర్ణయించారు. గ్రామీణప్రాంతాల్లో వైఎస్సార్ అగ్రిల్యాబ్‌లు ఏర్పాటుచేయాలని, విత్తనాలు, ఎరువులు ముందుగా ల్యాబ్‌లో పరీక్షించి ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిపారు. ప్రభుత్వ భూముల్లో ఇండ్లు నిర్మించుకున్నవారికి 300 గజాల వరకు రెగ్యులరైజ్ చేయాలని, 100 చదరపు గజాలలోపు ఉంటే రూపాయికే రిజిస్ట్రేషన్ చేయనున్నట్టు తెలిపారు.

# పౌరసరఫరాల్లో తెలంగాణ అత్యుత్తమం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రజలకు సేవలందించడంలో తెలంగాణ పౌరసరఫరాల శాఖ దేశంలోనే అత్యుత్తమంగా పనిచేస్తున్నదని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ ఏడాది కోటి టన్నుల ధాన్యం కొనుగోలుకు విస్తృతమైన ఏర్పాట్లుచేశామని, రికార్డుస్థాయిలో ధాన్యం దిగుబడి అవుతున్న నేపథ్యంలో రైతులకు విక్రయించే సందర్భంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకొంటున్నామని పేర్కొన్నారు. బుధవారం సివిల్ సప్లైస్ విభాగంలో జరిగిన కార్యక్రమంలో వరిధాన్యం విక్రయంపై అవగాహన పత్రాన్ని పౌరసరఫరాలశాఖ కమిషనర్ అకున్ సభర్వాల్‌తో కలిసి విడుదలచేశారు.

**అకున్ సభర్వాల్‌కు వీడ్కోలు**

కేంద్ర సర్వీసులకు వెళ్తున్న కమిషనర్ అకున్ సబర్వాల్‌కు పౌరసరఫరాలశాఖ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎఫ్‌సీఐ జీఎం అశ్వినీకుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్లు, డీసీఎస్వోలు, డీఎంలు, సంస్థ ఉద్యోగులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



నమస్తే తెలంగాణ

# జిందగీ

గురువారం 31 అక్టోబర్ 2019 WWW. NTNEWS.COM /nt.zindagi



ఉసిరి.. చెట్టు బెరడు నుంచి కాయల వరకు సంపూర్ణ ఔషధంలా పనిచేస్తాయి. ఉసిరి రుచితో పాటు ఆరోగ్యానికి, చర్మానికి ఎంతో మేలు చేస్తుంది. అందుకే ఉసిరితో ఎప్పటికప్పుడు కొత్త వంటకాలు మనకు పరిచయం అవుతూనే ఉన్నాయి. ఈసారి కూడా ఉసిరితో సరికొత్త వంటకాలను మీకు పరిచయం చేస్తున్నాం.

# జిహ్వా రుచికి ఉసిరి

## ఉసిరి పులిహోర

**కావాల్సినవి :**

**ఉసిరికాయలు :** 10, **నెయ్యి :** 2 టీస్పూన్లు, **పసుపు :** పావు టీస్పూన్, **ఆవాలు :** పావు టీస్పూన్, **జీలకర్ర :** పావు టీస్పూన్, **ఇంగువ :** పావు టీస్పూన్, **నిమ్మకాయ :** 1, **పచ్చిమిర్చి :** 3, **ఎండుమిర్చి :** 2, **మినుపపప్పు :** అర టీస్పూన్, **పచ్చి శనగపప్పు :** అర టీస్పూన్, **జీడిపప్పు :** 1 టీస్పూన్, **కరివేపాకు :** 2 రెమ్మలు, **బియ్యం :** 200 గ్రా., **ఉప్పు :** తగినంత.

**తయారీ :**

ఉసిరికాయను చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. బియ్యాన్ని కడిగి అరగంటపాటు నానబెట్టాలి. తర్వాత పొడిపొడిగా ఉండేలా అన్నం వండుకోవాలి. మందపాటి గిన్నెలో నెయ్యి వేడి చేసి ఆవాలు, జీలకర్ర, పసుపు, మినుపపప్పు, పచ్చి శనగపప్పు, జీడిపప్పు, పచ్చిమిర్చి, ఎండుమిర్చి, కరివేపాకు, ఇంగువ వేసి వేయించాలి. ఇందులో కట్‌చేసిన ఉసిరిముక్కలు వేసి దోరగా వేయించాలి. బాగా ఉడికేవరకూ మగ్గనివ్వాలి. ఇప్పుడు ముందుగా ఉడికించిన అన్నంలో ఉప్పుతో పాటు పోపు వేసుకొని బాగా కలుపాలి. చివరగా ఉప్పు, కారం, పులుపు సరిచూసుకోవాలి. ఉసిరిముక్కలతో పులుపు సరిపోకుంటే నిమ్మరసం కలుపుకోవచ్చు. ఉసిరికాయ పులుపు, మిర్చి కారం, అన్నంలోని కమ్మదనం అన్నీ కలిపితే.. సరికొత్త రుచిని ఆస్వాదించవచ్చు.



## ఉసిరి షర్బత్



**కావాల్సినవి :**

**ఉసిరికాయలు :** 2
**చక్కెర :** సరిపడా
**పుదీనా ఆకులు :** గార్నిష్ కోసం
**నీరు :** 250 మి.లీ. / 1 గ్లాసు

**తయారీ :**

ఉసిరికాయలు శుభ్రం చేసుకొని గింజలు తొలిగించి చిన్న ముక్కలుగా చేసుకోవాలి. మందపాటి గిన్నెలో నీరు పోసి దీనికి సరిపడా చక్కెర, ఉసిరికాయ ముక్కలు వేసి బాగా ఉడకనివ్వాలి. చల్లారిన తర్వాత మెత్తగా మిక్సీ పట్టించాలి. ఈ మిశ్రమాన్ని గ్లాస్‌లోకి తీసుకోవాలి. గట్టిగా ఉంటే సరిపడా నీరు పోసి ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి. గంట తర్వాత పుదీనా ఆకులతో గార్నిష్ చేసుకుంటే.. రుచికరమైన ఉసిరి షర్బత్ అదిరిపోతుంది.

## ఉసిరి అరటికాయ



**కావాల్సినవి :**

**ఉసిరికాయలు :** 6,
**పచ్చిమిర్చి పేస్ట్ :** ఒకటిన్నర స్పూన్,
**అల్లంపేస్ట్ :** 1 టీస్పూన్,
**పసుపు :** పావు టీస్పూన్,
**నూనె :** 2 టీస్పూన్లు,
**అరటికాయలు :** 2,
**కొత్తిమీర :** 1 చిన్నకట్ట,
**ఉప్పు :** తగినంత.

**తయారీ :**

ఉసిరికాయలను శుభ్రం చేసి గింజలు తొలిగించాలి. వీటిని చిన్న ముక్కలుగా కట్‌చేసి పేస్ట్‌లా మిక్సీ పట్టాలి. విడిగా పచ్చిమిర్చి పేస్ట్ చేసుకోవాలి. ఫింగర్ చిప్స్ సైజులో అరటికాయను కట్ చేసుకోవాలి. ఒక గిన్నెలో ఉసిరికాయ పేస్ట్, పచ్చిమిర్చి పేస్ట్, అల్లం పేస్ట్, ఉప్పు, పసుపు వేసి బాగా కలుపుకొని అరటి ముక్కలు వేసి గంటపాటు నానబెట్టాలి. నాన్‌స్టిక్ పాన్‌లో నూనె వేడి చేసి అరటిముక్కల మిశ్రమం వేసి సన్నని సెగపై కలుపుతూ దోరగా వేయించుకోవాలి. ఉప్పు, కారం సరిచూసుకొని దించేయాలి. సన్నగా తరిగిన కొత్తిమీరతో అలంకరించుకొని వేడి వేడిగా వడ్డిస్తే సరికొత్త రుచి నోరూరిస్తుంది.

## ఉసిరి ఆవకాయ




**కావాల్సినవి :**

**ఉసిరికాయలు :** 4, **నువ్వులనూనె :** 2 కప్పులు, **కారం :** 1 కప్పు, **ఆవపిండి :** 1 కప్పు, **మెంతులు :** పావు కప్పు, **జీలకర్ర :** పావు కప్పు, **నిమ్మకాయలు :** 2, **ఉప్పు :** తగినంత.

**తయారీ :**

ముందుగా ఉసిరికాయలను శుభ్రం చేసుకోవాలి. చాకుతో గాటుపెట్టి నూనెలో దోరగా వేయించి పక్కన పెట్టుకోవాలి. నిమ్మరసం తీసి గంటపాటు ఎండలో పెట్టాలి. జీలకర్ర,మెంతులు, దోరగా వేయించి చల్లారిన తర్వాత పొడిచేయాలి. దోరగా వేయించిన ఉసిరికాయలలో కారం, ఆవపిండి, ఉప్పు, జీలకర్రపొడి, మెంతులు పొడి వేసి బాగా కలుపాలి. చివరిగా నూనె వేసుకోవాలి. ఉప్పు, కారం, పులుపు, సరిచూసుకోవాలి. పులుపు సరిపోకుంటే నిమ్మరసం వేసుకోవచ్చు. 3 రోజులపాటు జాడీలో నిల్వ ఉంచి తర్వాత వేడి వేడి అన్నం, నెయ్యితో పాటు వడ్డిస్తే.. కొత్త ఆవకాయ అన్నం కాంబినేషన్‌కు పోటీ వస్తుంది.



జి.యాదగిరి
కార్పొరేట్ చెఫ్
వివాహభోజనంబు రెస్టారెంట్
జూబ్లీహిల్స్, హైదరాబాద్
పార్క్‌లైన్, సికింద్రాబాద్

# సామాజిక రుగ్మతలపై లేఖాస్త్రం

**సామాజిక మాధ్యమాల్లో వచ్చే సమాచారాన్ని చాలామంది నమ్మలేకపోతున్నారు. అనవసరమైన సందేశాలను పంపించడం వల్ల వాస్తవాలు మరుగున పడుతున్నాయి. దీంతో చేతితో ఉత్తరాలు రాసి సామాజిక రుగ్మతలపై లేఖాస్త్రాన్ని సంధిస్తూ జనాలను చైతన్య పరుస్తున్నది ఓ మహిళ .**



అసొంకు చెందిన పరొమిత అనే మహిళ లేఖల ద్వారా ప్రపంచ దేశాల్లోని వ్యక్తుల్లో మార్పు తీసుకు వచ్చేందుకు ముందుకు వచ్చింది. నేటితరం సోషల్ మీడియా మాయలో పడిపోయి చేతితో రాసిన అక్షరాలను ఆస్వాదించడం మానేశారు. అందుకోసమే పరొమిత సామాజిక సమస్యల గురించి అపరిచితులకు ఉత్తరాలు రాస్తూ వారి మనసులను కదిలిస్తున్నది. ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సాప్‌ల ద్వారా పరిచయమైన వారికి తాను చేపట్టిన ఉద్యమం గురించి వివరిస్తున్నది. ఆమె చేస్తున్న ఉద్యమ లక్ష్యాన్ని తెలియజేస్తున్నది. పరొమిత మంచిపని నచ్చినవారు ఆమెతో కలిసి పనిచేయడానికి ముందుకు వస్తున్నారు. మొదట్లో ఆమె రాసిన ఉత్తరాలకు పెద్దగా స్పందించేవారు కాదు. ప్రస్తుతం ఆమె లేఖలకు స్పందించి జవాబు ఇచ్చే వారి సంఖ్య పెరిగింది. భారతదేశంలోనే కాకుండా ఇతర దేశాల్లో ఉండే వారిలో సైతం పరొమిత రాసే లేఖలు చైతన్యం తీసుకువస్తున్నాయి. ఆమె చేస్తున్న ఉద్యమంలో కలిసి నడిచేందుకు ప్రతి నెలా 30 మంది కొత్త వారు ముందుకు వస్తున్నారు. 'కీబోర్డుతో టైపు చేస్తే కేవలం శరీరాన్నే తాకుతాయి. అదే చేత్తో రాస్తే అక్షరాలు మనసుకు తాకుతాయని' ఆమె అంటున్నది. ప్రపంచంలో ఏ మూలన ఉన్న వారికైనా పరొమిత ఫేస్‌బుక్ ద్వారా ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపుతుంది. ఆమె ఆలోచనతో కలిసి నడిచే వారే ఆమెకు వారి చిరునామా పంపుతారు. అటువంటి వారికే పరొమిత లేఖలు రాస్తుంటుంది. ఇప్పటి వరకు గృహహింస, లింగభేదం, మహిళలను కట్టుబాట్లకు పరిమితం చేయడం, మహిళ ఆర్థిక సాధికారత వంటి అంశాలపై లేఖలు రాసింది పరొమిత.

# తల నెరుస్తుందా?

**జుట్టు చివర్లు నెరవడం. చిట్లడం, రాలడం ప్రస్తుతం చాలామంది ఎదుర్కొన్న సమస్యే. అలాంటి వారు మందార ఆకులు, మందార పూలతో జుట్టును కాపాడుకోవచ్చు.**



- ఏడెనిమిది చొప్పున మందార పూలు, ఆకుల్ని శుభ్రంగా కడిగి ముద్దలా చేయాలి. కప్పు కొబ్బరి నూనెను వేడి చేసి ఈమిశ్రమాన్ని అందులో వేసి బాగా కలపాలి. నూనె చల్లారాక వడకట్టి రాత్రుళ్లు తలకు రాసుకొని మర్నాడు తలస్నానం చేయాలి. వారానికి రెండు సార్లు ఇలా చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.
- తెల్లవెంట్రుకలతో బాధపడేవారు గుప్పెడు మందార ఆకులూ, నాలుగు పెద్ద చెంచాల పెరుగు తీసుకొని మెత్తగా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని తలకు పట్టించి గంట తర్వాత షాంపూతో శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తుండడం వల్ల జుట్టు క్రమంగా నల్లబడుతుంది.
- మూడు చెంచాల ఉసిరిపొడి, రెండు చెంచాల ఉసిరిరసం, గుప్పెడు మందార ఆకుల్ని తీసుకొని మెత్తగా చేసుకోవాలి. ఈ ముద్దను తలంతా పట్టించి నలభై నిమిషాల తర్వాత కడిగేసుకుంటే చాలు.
- ఒక గిన్నెలో రెండు గ్లాసుల నీళ్లు పోసి వేడిచేయాలి. మరుగుతున్న నీళ్లలో గుప్పెడు మందార ఆకులు, అయిదారు పూలు వేయాలి. కాసేపు మరిగించాలి. చల్లారాక ఆకుల్ని ముద్దలా చేయాలి. కొద్దిగా శనగపిండి కలిపితే షాంపూ తయారైనట్లే.
- ఏడెనిమిది మందార పూలను ముద్దలా నూరుకోవాలి. దీన్ని తలకు పట్టించి గంటయ్యాక తలస్నానం చేయాలి. ఇలా వారంలో ఒకటిరెండు సార్లు చేయడం వల్ల జుట్టు బలంగా మారుతుంది.



సలహా

# హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో సర్వైకల్ క్యాన్సర్ నివారణ

**మీరు తరచూ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ టీకాల ప్రకటనలు చూసి కూడా పట్టించుకోలేదా? మీరు మరోసారి తప్పక ఆలోచించండి. భారతదేశంలో సర్వైకల్ క్యాన్సర్ బాధితుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నది.**

మన దేశంలో ఏటా 1,34,240 సర్వైకల్ క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయి. ఇవి 2025 నాటికి రెండు లక్షలకు పైగా చేరవచ్చని అంచనా. సర్వైకల్ క్యాన్సర్ వల్ల ఏటా 12,825 మంది మృత్యువు బారిన పడుతున్నారు.




### సర్వైకల్ క్యాన్సర్ అంటే?

గర్భాశయ ముఖద్వారం (సర్విక్స్) వద్ద వచ్చే క్యాన్సర్ ను సర్వైకల్ క్యాన్సర్ అంటారు. ఈ భాగం గర్భాశయానికి కింది భాగంలో ఉండే సన్నటి ప్రదేశం. పేరుకు తగ్గట్టు ఇది గర్భాశయ ముఖద్వారంలా పనిచేస్తుంది. ఇది గర్భాశయాన్ని యోనితో కలిపి ఉంచుతుంది. మిగతా అన్ని క్యాన్సర్లతో పోలిస్తే గర్భాశయ ముఖద్వారపు క్యాన్సర్ను చాలా సులువుగా నివారించవచ్చు. క్రమం తప్పకుండా స్క్రీనింగ్ చేయించడం దీనికి ఉత్తమ పరిష్కారం. సర్వైకల్ క్యాన్సర్‌కు చికిత్స కూడా చాలా సులభం. దీన్ని ఎంత ముందుగా గుర్తిస్తే అంత తేలిగ్గా చికిత్స చేయవచ్చు.

### కారణాలేంటి?

సర్వైకల్ క్యాన్సర్‌కు ముఖ్యమైన కారణాల్లో హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) ప్రధానమైంది. ఈ వైరస్ సెక్స్ ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. దాదాపు సగం జనాభాలో జీవితంలో ఏదో ఒక సమయంలో హెచ్‌పీవీ వైరస్‌ను కలిగి ఉంటారు. అయితే అందరిలోనూ ఇది సర్వైకల్ క్యాన్సర్‌కు దారితీయదు. కేవలం కొంత మందిలోనే క్యాన్సర్‌ను కలుగజేస్తుంది. సెక్స్‌లో పాల్గొన్న ప్రతివారికీ హెచ్‌పీవీ వైరస్ సోకే అవకాశాలు ఉంటాయి. అయితే తక్కువ వయసులోనే సెక్స్‌లో పాల్గొనడం మొదలుపెట్టిన మహిళల్లో మొదలుకొని, ఎక్కువమంది భాగస్వాములతో సెక్స్‌లో పాల్గొనే సందర్భాల్లో హెచ్‌పీవీ సోకే అవకాశం మరీ ఎక్కువ. ఈ వైరస్‌లోనూ అనేక రకాలు ఉంటాయి. సాధారణంగా హెచ్‌పీవీ వైరస్‌దానంతట అదే నశించిపోతుంది. అలా ఒకవేళ నశించకపోతే అది కొంతకాలం తర్వాత క్యాన్సర్‌కు దారితీయవచ్చు. హెచ్‌పీవీ వైరస్‌తో పాటు పొగతాగడం, ఎయిడ్స్, ఐదేండ్ల కంటే ఎక్కువకాలం గర్భనిరోధక మాత్రలు వాడటం, ముగ్గురు అంతకంటే ఎక్కువ మంది పిల్లలను కనడం వంటివి కూడా సర్వైకల్ క్యాన్సర్‌కు దారితీసే రిస్క్‌ఫ్యాక్టర్లలో కొన్ని.

### నివారణ ఎలా?

సర్వైకల్ క్యాన్సర్ నిర్ధారణలో పాప్‌స్మియర్ అనేది క్యాన్సర్ స్క్రీనింగ్‌కు ఉపయుక్తమైన పరీక్ష, 21 ఏండ్లు నిండిన మహిళలు మొదలుకొని, సెక్స్‌లో పాల్గొనడం ప్రారంభించి మూడేళ్లు దాటిన ప్రతి మహిళా తప్పనిసరిగా క్రమం తప్పకుండా పాప్‌స్మియర్ పరీక్ష చేయించుకోవాలి. అంటే మహిళలందరూ క్రమం తప్పకుండా స్క్రీనింగ్ చేయించుకోవడం అవసరం.

### హెచ్‌పీవీ వ్యాక్సిన్ అంటే?

శక్తిమంతమైన వైరస్, బ్యాక్టీరియాలను తట్టుకోవడానికి మన శరీరం 'యాంటీబాడీస్'ను తయారుచేస్తుంది. అయితే హెచ్‌పీవీ వైరస్ విషయంలో మాత్రం మన శరీరం ఎలాంటి యాంటీబాడీస్‌ను తయారు చేయదు. అందువల్ల ఒకసారి ఇన్ఫెక్షన్ వస్తే అది జీవితాంతం ఉండిపోతుంది. అది సర్వైకల్ క్యాన్సర్ కు దారితీయవచ్చు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ (టీకా) ఇప్పించడం వల్ల అది శరీరంలో యాంటీబాడీస్‌ను తయారుచేసి హెచ్‌పీవీ వైరస్ నుంచి శరీరాన్ని కాపాడుతుంది. హెచ్‌పీవీ వ్యాక్సిన్ యోని క్యాన్సర్, గర్భాశయ ముఖద్వారం వద్ద వచ్చే క్యాన్సర్లను నివారిస్తుంది. అమెరికన్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ సిఫార్సు ప్రకారం 11 ఏండ్లు నిండిన ప్రతి ఆడపిల్లకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఇప్పించాలి. అయితే తొమ్మిదేండ్లు నిండినవారి నుంచి 18 ఏండ్లు వరకు ఉండే ఆడపిల్లలకు ఈ వ్యాక్సిన్ ఇప్పించవచ్చు. ఈ వ్యాక్సిన్‌ను ఆర్నెల్ల వ్యవధిలో మూడుసార్లు ఇప్పించాలి. దీనివల్ల సర్వైకల్ క్యాన్సర్‌ను నివారించవచ్చు.



డా. సీహెచ్ మోహన వంశీ
చీఫ్ సర్జికల్ అంకాలజిస్ట్,
ఒమేగా హాస్పిటల్స్
హైదరాబాద్: 9848011421
కర్నూల్: 08518 273001
గుంటూర్: 08632 223300

నమస్తే తెలంగాణ
రైతుబడి
[ కరీంనగర్ ]
గురువారం 31 అక్టోబర్ 2019



మన ఆరోగ్యానికి ప్రధానంగా కావాల్సిన ప్రొటీన్లు, విటమిన్లు ఏ,సీ, ఇనుము, కాల్షియం, ఫాస్పరస్ వంటి ఖనిజ లవణాలను అందించేవి ఆకుకూరలు. ఆహార సమతుల్యతలో వీటిది ప్రధాన పాత్ర. రోజుకు కనీసం 116 గ్రాముల ఆకుకూరలు తినాలని ఆహార నిపుణులు సూచిస్తున్నారు. అయితే ఇవి కోసిన వెంటనే త్వరగా చెడిపోయే గుణం ఉంటుంది. అందుకే ఇంట్లోని పెరట్లో తాజా పెంచుకోవచ్చు. గింజలు విత్తిన నాలుగు నుంచి ఆరువారాల్లో త్వరగా ఎదిగి కోతకు వస్తాయి. వీటిని పెంచడం కూడా సులభమే.

# పెరట్లో ఆకుకూరల పెంపకం

### తోటకూర

విత్తిన నెలలోపే కోతకు వస్తుంది. లేత ఆకులు కాండం కూడా నెలల తరబడి వాడుకోవచ్చు. ఏడాదంతా పెంచుకునే ఆకుకూర ఇది. పీచుపదార్థంతో పాటు లైసిన్‌తో కూడిన ప్రొటీన్ ఉంటుంది. అందువల్ల పోషకలోపంతో బాధపడే వారికి ఇది మేలైన ఆహారం. వీటిని సంవత్సరమంతా విత్తుకోవచ్చు. ఈ పంట గింజలు తేలికగా ఉంటాయి. కాబట్టి పైపాటుగా వెదజల్లేటప్పుడు మెత్తని మట్టితో గాని, సన్నని ఇసుకతో గాని చల్లాలి. విత్త



నాలు చాలా చిన్నగా ఉంటాయి. కాబట్టి 1-1.5 సెం.మీ. కంటే ఎక్కువ లోతులో విత్తొద్దు. మిగతా అన్ని కాయగూరల్లో పోలిస్తే అతి తక్కువ నీళ్లు తీసుకుంటుంది. 3-4 వారాల్లో కోతకు వస్తుంది.

### కొత్తిమీర

విత్తనాన్ని పైపాటుగా కుండీల్లో మట్టిపై వెదజల్లాలి. మొక్కకు మొక్కకు 45 సెం.మీ దూరం ఉండేలా చూసి మిగతా వాటిని తీసివేయాలి. 60 సెం.మీ. ఎత్తు పెరుగుతాయి. 30-45 రోజుల్లో కోతకు వస్తుంది. అయితే ఎండ తగిలేలా కుండీ



లు ఉంచాలి. వర్మీకంపోస్ట్‌తో మల్చింగ్ చేసి మట్టిలో తడి ఆరకుండా చూడాలి. తరుచుగా నీటితో తుడుపాలి. నీటి ఎద్దడి ఉంటే పూతకు వచ్చి ఆకుల దిగుబడి తగ్గిపోతుంది. రోజూ కొన్ని మొక్కలు వాడుకునేందుకు వీలుగా ప్రతీవారం కొత్తగా కొన్ని గింజలు దఫాలుగా వేయాలి.

### మెంతికూర



నాటడానికి సరైన ప్రాంతం, అత్యధిక సూర్యరశ్మి అందే లా ఉండాలి. పోషకాలతో కూడిన బలమైన నేల ఉండి, మురుగునీరు పోయే సౌలతి ఉండాలి. నేలల్లో 6-7 ఉదజని సూచిక ఉండాలి. వెచ్చని పొడి వాతావరణం ఉండాలి. చల్లని బురదనేలలు వీటి పెంపకానికి పనికిరావు. ఇవి పెంచే నేలలకు నత్రజని అంది అవి మరింత సారవంతం అవుతాయి.

### పాలకూర



నాటిన మూడు రోజుల్లో మొలకెత్తుతుంది. నేలలో 2 సెం.మీ. లోతులో విత్తి, ఆపైన బురదతో పూయాలి. ఇవి కుండీలలో చల్లని ఉష్ణోగ్రత ఉంటే బాగా పెరుగుతాయి. నాటిన 4-5 వారాల్లో ఆకులు తెంపుకోవచ్చు. ఒకసారి ఆకులు తెంపిన తర్వాత ద్రవరూప పోషకాలను అందిస్తే కోతకు సిద్ధంగా ఉంటాయి. భూమి పైనుంచి ఒక ఇంచు ఎత్తులో ముదురు ఆకులను కత్తిరించి వాడుకుంటే లోపలి ఆకులు ముదరడంతోపాటు కత్తిరించిన చోట కొత్త ఆకులు వస్తాయి.

### గోంగూర

వేడి వాతావరణంలో పెరిగే మొక్క. మురుగు నీరు నిల్వకుండా ఉండే నేలల్లో పెంచాలి. విత్తనాలు నాటిన 7-9 వారాల్లో గోంగూర అందుబాటులోకి వస్తుంది. ఆ తర్వాత నుంచి ఆకులను మాత్రమే తీస్తే 10 నుంచి 12 రోజుల వ్యవధిలో చిగురించి కొత్త ఆకులు వస్తాయి. పీచు పదార్థంతోపాటు పొటాషియం, మెగ్నీషియం కలిగి ఉండటం వల్ల బలాన్ని ఇచ్చే ఆకుకూరగా పరిగణిస్తారు. అయితే అధిక వాన, గాలిలో తేమ ఎక్కువగా ఉంటే శిలీంద్రాలు ఆశించి నాణ్యత దెబ్బతింటుంది. విత్తనాల ద్వారా ప్రవర్ధనం చెందే మొక్క. నీటి ఎద్దడిని కూడా తట్టుకుంటుంది. మొక్కకు మొక్కకు మధ్య దూరం 35-45 సెం.మీ. ఉండేలా చూసుకోవాలి. పన్నెండు వారాల వ్యవధిలో 5-6 సార్లు ఆకులు తెంపుకోవచ్చు. ఘన రూప ఎరువుల కంటే ద్రవరూప ఎరువులకే ప్రాధాన్యం ఇవ్వాలి. వెంటనే ఫలితం కూడా కనిపిస్తుంది.



మట్టి మిశ్రమంలో సేంద్రియ ఎరువులు వాడేటప్పుడు పూర్తిగా చివికిన పశువుల ఎరువు, లేదా బాగా తయారైన వర్మీకంపోస్టు మాత్రమే వాడాలి.
మిద్దెతోటలో తరుచుగా ఎదురయ్యే వేరుకుళ్లు, మొక్క వడల తెగులు నివారణకు రసాయనాలకు బదులుగా జీవ శిలీంద్ర నాశనలు వాడాలి.

### పూదీన

పచ్చళ్లతోపాటు ఔషధ గుణాలు కలిగినది పూదీన. దీనిని ఏడాదంతా పెంచుకోవచ్చు. ఉష్ణ వాతావరణంలో బాగా పెరుగుతుంది. దీనికి వాడే నేల మట్టి ఉదజని సూచిక 6-7.5 మధ్య ఉండాలి. తీగ మొక్కలను 45 సెం.మీ. దూరంలో ఉండేలా ఇంటి పెరట్లో నాటుకోవచ్చు. వాటిపై మట్టికప్పితే చిగుర్లు తొడిగి తీగలుగా సాగుతాయి. ప్రతి 3-4 రోజులకొకసారి తప్పనిసరిగా నీటి తడులివ్వాలి. నాటిన 20 రోజుల నుంచి ఆకులు తెంపుకొని వాడుకోవచ్చు.ఆకులు తీసిన ప్రతీసారి ద్రవరూప ఎరువులను అందిస్తే మళ్లీ కాతకు వస్తాయి.



### మిద్దెతోటల్లో మట్టి, మొక్కల ఎంపిక

**మిద్దెతోటల్లో కుండీలలో మొక్కల పెంపకం చేపడుతున్నారు. మట్టి ఒక మిశ్రమంగా లభించదు. కాబట్టి తొట్లలో వాడే మట్టి మిశ్రమం తయారీలో పలు జాగ్రత్తలు తీసుకోవాలి.**

- ఎర్రమట్టిని మాత్రమే వాడాలి. నల్లరేగడి మట్టి వాడకూడదు. వాడే మట్టిలో గాజు పెంకులు, పెద్ద పరిమాణంలో ఉండే రాళ్లు, పూర్తిగా చివికిపోని చెత్తా, చెదారం లేకుండా చూసుకోవాలి.
- ఎర్రమట్టిని మాత్రమే కాకుండా పెంచాలనుకునే మొక్కల పోషక అవసరాలను బట్టి వర్మీకంపోస్టు, బాగా చివికిన పశువుల ఎరువు, వేప చెక్క, కొబ్బరిపీచును వాడాలి. ఏ మిశ్రమంలోనైనా 50 శాతానికి తగ్గకుండా ఎర్రమట్టి వాడాలి. వర్మీకంపోస్టు లేదా పశువుల ఎరువు వాడితే సమగ్ర పోషకాలు మొక్కలకు అందుతాయి. కొబ్బరిపీచు తగినంతగా చేర్చితే నీటిని పట్టి ఉంచుతాయి. తర్వాత మొక్క



తన అవసరం మేరకు వాడుకుంటుంది. అయితే వీటన్నింటినీ తొట్లు/కుండీలలో నింపే ముందే శుద్ధి చేస్తే శిలీంద్రాల సమస్య ఏర్పడదు. మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయి.
- మిరప, టమాటా, వంకాయ పంటలు పెంచుకునేటప్పుడు నులి పురుగుల సమస్య ఎక్కువగా ఉంటుంది. కాబట్టి మట్టి మిశ్రమంలో కచ్చితంగా వేప చెక్కను చేర్చాలి. ఈ పంటలను ఒకసారి పెంచిన తర్వాత ఆ మట్టిని కచ్చితంగా మార్చి వాడాలి. లేకపోతే అంతకు ముందు ఆశించిన తెగు ళ్లు మళ్లీ ఆశించే అవకాశం ఉంటుంది.
- ప్రతి రెండుసార్లు మొక్కలు పెంచిన తర్వాత మట్టిని కచ్చితంగా మార్చాలి. లేదంటే అందులోని పోషకాలన్నీ పోయి, ఆ తర్వాత పెంచే మొక్కల్లో పోషకధాతు లోపాలు ఏర్పడుతాయి.
- ఆకులు, కాయలు, పండ్ల నాణ్యత బాగుండాలంటే పైపాటుగా సూక్ష్మ ధాతు పోషకాలను పిచికారీ చేయాలి.
- తొట్లలో అడుగుభాగం నుంచి మొదట ఒక పొరగా చిన్నసైజు గులకరాళ్లు పేర్చి ఆ తర్వాత ఎర్రమట్టితో కూడిన మిశ్రమాన్ని నింపాలి. మొక్క పెరిగేటప్పుడు పైపాటుగా ఉన్న మట్టిని కొద్దిగా కదిలిస్తే మొక్కలకు పోషకాలు అందుతాయి.
- తొట్టిలో 80 శాతం మేర మాత్రమే మట్టి మిశ్రమంతో నింపాలి. మిగతాభాగం ఖాళీగా ఉంచాలి. దీంతో ఎరువులు, వర్మీకంపోస్టు వేయడం, నీటిని అందించడం తేలిక అవుతుంది.

డాక్టర్ పిడిగెం సైదయ్య
శాస్త్రవేత్త, రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం
7780509322



raithubadi@ntnews.com

## మునగలో ఎరువులు, పురుగుల యాజమాన్యం

మునగ సాగులో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. దీనివల్ల పెట్టుబడులు, శ్రమ తగ్గడమే కాకుండా అధిక దిగుబడులను సాధించవచ్చు. రైతులు మునగ విత్తనాలు నాటి నుంచి మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తూ సాగు చేపడితే కష్టానికి తగిన ఫలితం దక్కుతుంది.

### ఎరువుల యాజమాన్యం



ప్రతి పాదులో 10 కిలోల పశువుల ఎరువుతో పాటు 250 గ్రాముల వేపపిండి, 250 గ్రాముల సూపర్ ఫాస్ఫేట్ కలిపి వేయాలి. ఆలస్యంగా నాటితే మార్చి, ఏప్రిల్ మాసాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువ ఉంటే పూతరాలి కాపు రావడం నిలిచిపోతుంది. మొక్కలు 75-90 సెంటీమీటర్లు పొడవు పెరిగిన తరువాత కొమ్మలను కత్తిరిస్తే ఏపుగా పెరిగి అధిక దిగుబడి వస్తుంది.

### పురుగుల యాజమాన్యం


మునగను ఆశించే పురుగుల్లో గొంగలి పురుగు ప్రధానమైనది. గొంగలిపురుగు నివారణకు క్వినాల్‌ఫాస్ 2 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. దీంతో పాటు ఒక్కొక్క చెట్టుకు పాదులో 30 గ్రాములు కార్బాలిన్‌పొడి, కార్బోఫ్యూరాన్ గుళికలు వేసుకోవాలి. కాయతొలుచు ఈగ నివారణకు పూత ప్రారంభదశలో జోలోన్, పూర్తిగా పూత వచ్చిన తరువాత రోగార్, పిందెకట్టిన దశలో ఫిప్రొనిల్ 2 మిల్లీలీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

–నగిరి హరీష్, త్రిపురారం

## ఔషధ వేదం

(వ్యవసాయం, ఆరోగ్యంలో ఔషధ మొక్కలు)

వ్యవసాయక సమాజాల్లో ఆరోగ్యం కోసం మెజారిటీ ప్రజలు ఔషధ మొక్కలపైనే ఆధారపడుతారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ కూడా ప్రపంచవ్యాప్తంగా 80 శాతం మంది తమ ప్రాథమిక ఆరోగ్య అవసరాల కోసం ఔషధ మొక్కలపైనే ఆధారపడుతున్నారని తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రజారోగ్యంలో ఔషధ మొక్కల ప్రాధాన్యం అర్థం చేసుకోవచ్చు. ఈ అవసరాన్ని గుర్తించిన 'రైతునేస్తం' వారు దేశంలో ప్రజలకు అందుబాటులో ఉండే మొక్కల నుంచే ఆరోగ్య సమస్యలను ఎలా దూరం చేసుకోవచ్చో తెలియ చేయటం ముదావహం. ప్రజలకు సాధారణంగా వచ్చే ఆరోగ్య సమస్యలకే కాకుండా, వ్యవసాయ సంబంధ అవసరాలకు ఉపయోగపడే మొక్కలు తమ పరిసరాల్లోనే అందుబాటులో ఉండేవి ఎలా ఉపయోగపడుతాయో వివరిస్తూ అందరికీ అర్థమయ్యే రీతిలో, అందరూ గుర్తించేందుకు వీలుగా మంచి ఫొటోతో సహా ప్రచురించి అందుబాటులోకి తేవటం హర్షణీయం. ఈ పుస్తకం అందరికీ ఉపయుక్తం.




రచన: ప్రొఫెసర్ కోసరాజు చంద్రశేఖరరావు
వెల: రూ. 350
ప్రతులకు: రైతునేస్తం పబ్లికేషన్స్, 6-2-959, దక్షిణభారత హిందీ ప్రచార సభ కాంప్లెక్స్, ఖైరతాబాద్, హైదరాబాద్-4.
డోర్‌నెం:8-198, పుల్లడిగుంట దగ్గర, కొర్నెపాడు పోస్ట్, వట్టిచెరుకూరు మండలం, గుంటూరు జిల్లా-522017. ఫోన్:0863-2286255

## ఒకసారే పెట్టుబడి దీర్ఘకాలిక దిగుబడి


**డ్రాగన్‌ఫ్రూట్ మంచి ఔషధంగా పనిచేస్తుంది. ఈ పండులో వ్యాధి నిరోధకశక్తి అధికంగా ఉంటుందని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. కిడ్నీ సంబంధిత వ్యాధులకు, అజీర్ణ సమస్యలకు ఈ పండు ఔషధంగా పనిచేస్తుంది. ఇన్నిరకాలుగా ఉపయోగపడుతున్నది. ఈ పంట రైతులకు దీర్ఘకాలిక ఆదాయాన్ని అందిస్తుంది. రాష్ట్రంలో ఈ పంట సాగు విస్తీర్ణం పెరుగుతున్నది.**



డ్రాగన్ ఫ్రూట్‌కు మార్కెట్‌లో మంచి డిమాండు ఉన్నది. దీంతో రైతులు ఈ సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఈ పంట సాగు చేస్తే ఎక్కువ లాభాలు రావడానికి అవకాశం ఉన్నది. తైవాన్ దేశంలో పండే ఈ పంటకు మన దేశ నేలలు అనుకూలంగా ఉన్నాయని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. దీంతో ఈ పంట వేశానని రంగారెడ్డి జిల్లా మామిడిపల్లిలో రిటైర్డ్ ఐపీఎస్ ఆఫీసర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. తనకున్న ఎకరంనరలో ఈ పంట సాగు చేస్తున్నారు.

ఈ పంట సాగు కోసం చంద్రశేఖర్ రెడ్డి కలకత్తా నుంచి డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను తీసుకొచ్చారు. ఉద్యోగం నుంచి రిటైర్డ్ అయిన తర్వాత రైతులకు కొత్త పంటలు పరిచయం చేయడానికి అధ్యయనం చేసిన్నట్లు చెప్పారు. తనకున్న ఎకరంనర పొలంలో 16 వందల మొక్కలను నాటించారు. ఏడాదిన్నర లోపు పంట చేతికి వచ్చింది. మొదటి సంవత్సరమే మంచి లాభాలు రావడం ఆనందంగా ఉన్నదని సంతోషం వ్యక్తం చేశారు. ఎకరాకు నాలుగు టన్నుల డ్రాగన్‌ఫ్రూట్ దిగుబడి వచ్చిన్నట్లు తెలిపారు. ఈ పంట సాగులో ఎరువులుగా పశువుల పేడ మాత్రమే వాడుతున్నారు. ఈ పంట దాదాపు 30 ఏండ్ల వరకు పంట దిగుబడి వస్తుందన్నారు. పంట వేసినప్పటి నుంచి ఇప్పటివరకు పంటకు ఎలాంటి చీడపీడలు సోకలేదని చెప్పారు.
ఈ పంట సాగు చేయడానికి ఐదు లక్షల రూపాయలు ఖర్చు అయిందని తెలిపారు. అయితే 30 సంవత్సరాల వరకు ఏటా పంట తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. పంటవేసే మొదటిసారి మాత్రమే పెట్టుబడి పెట్టవలసి ఉంటుందని పేర్కొన్నారు. అట్లనే ఈ పంట సాగు చేయడం సులభం. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు ఆర్జించడానికి అవకాశం ఉంటుంది. జంతువులు ఏవీ కూడా ఈ పంటను తినే అవకాశం లేదు. చీడపీడల బెడద కూడా తక్కువే. రైతులకు అన్ని విధాలు లాభం చేకూర్చే పంట. పూర్తిగా సేంద్రియ పద్ధతిలో ఈ పంట సాగు చేస్తున్నాని చంద్రశేఖర్‌రెడ్డి తెలిపా రు. దీంతో పండు చాలా రుచి ఉంటుంది. ఈ పండుకు మార్కెట్‌లో కిలోకు రూ.200లు ఉన్నది. ఒకసారి పెట్టు బడి పెడితే ఏటా లాభాలే తప్ప నష్టాలు ఉండవన్నారు.

### మంచి లాభాలు



రైతులకు మేలు చేసే పంట. సాగులో పెద్దగా పని ఉండదు. మందులు వేయాల్సిన పని లేదు. నీటి అవసరం చాలా తక్కువే. సేంద్రియ పద్ధతిలో పంట పండిస్తున్నా. సులభ పద్ధతిలో సాగు చేసుకోవచ్చు. రైతులకు మంచి లాభాలు వస్తాయి. పంట వేసిన్నప్పుడు మాత్రమే ఎకరాకు ఐదు లక్షలు ఖర్చు అవుతుంది. ఆ తర్వాత ఖర్చు ఉండదు.
–పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రిటైర్డ్ ఐపీఎస్ ఆఫీసర్, రైతు

### సాగు పద్ధతులు

ఈసాగు చేయడానికి ముందు భూమిని చదును చేసుకోవాలి. భూసార పరీక్షలు చేయించాలి. నేలలో ఉదజని 7 శాతం ఉంటే సరిపోతుందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారని చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మూడుసార్లు భూమిని దున్నాలి. తర్వాత 10ఫీట్ల దూరంలో సాలు తోలాలి. అడ్డం నాలుగు ఫీట్ల దూరంలో 7 ఫీట్ల ఎత్తు ఉన్న సిమెంట్ స్తంభాలను నాటుకోవాలి. సిమెంట్ స్తంభంపై భాగంలో రౌండుగా ఉండే ఒక సిమెంట్ బిల్లను అమర్చాలి. ఎకరానికి 500 సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేసుకోవాలి. మొక్కలను నాటే ముందు పాదు దగ్గర పశువుల పేడ మాత్రమే వేశానని తెలిపారు. మొక్కలు కింద పడిపోకుండా టైరుతో సిమెంట్ కట్టారు. మొక్కలను నాటడానికి రెండు నుంచి మూడు ఫీట్ల లోతులో పాదు చేసుకోవాలి. ఒక్కో స్తంభానికి నాలుగు మొక్కలు నాటుకోవడానికి అవకాశం ఉంటుంది. లాంటి మందులు వాడవలసిన అవసరం లేదు. డ్రిప్ విధానం ద్వారా నీళ్లను అందిస్తున్నారు.

### మార్కెట్‌లో మంచి డిమాండు

డ్రాగన్ ఫ్రూట్‌కు మార్కెట్‌లో మంచి డిమాండు ఉన్నది. ఆరోగ్యానికి ఈ పండు శ్రేయస్కరంగా ఉంటుంది. దీంతో చాలా మంది ఈ పండును తినడానికి ఇష్టపడుతున్నారు. రాష్ట్రంలో డ్రాగన్ ఫ్రూట్ దిగుబడి తక్కువగా ఉన్నది. దీంతో మార్కెట్‌లో ఈ పంటకు మంచి ధర ఉన్నదని తెలిపారు.

బిరుదు చందర్, బడంగ్‌పేట
8096565106

అల్లం వాణిజ్యపరంగా సాగుచేయబడుతున్న సుగంధ ద్రవ్యపు పంట. ఈ పంట ఔషధంగా కూడా ప్రసిద్ధి చెందింది. అల్లాన్ని వంటల్లో విరివిగా వాడుతారు. అల్లం పంట రాష్ట్రంలో దాదాపు 1771 హెక్టార్లలో సాగుచేస్తున్నారు. ఈ పంటను ఉమ్మడి మెదక్, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి జిల్లాల్లో విస్తారంగా సాగుచేస్తున్నారు. అయితే ఇటీవల అల్లం పంటకు వివిధ రకాల పురుగులు, తెగుళ్లు ఆశించి పంటను తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. ఇందులో ముఖ్యమైనవి దుంపకుళ్లు ఈగ, మొవ్వ తొలుచు పురుగు, ఆకుముడత పురుగు, పొలుసు పురుగు, వేరు పురుగు మొదలైనవి. వీటి నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి. అప్పుడు రైతులు మంచి దిగుబడులు పొందవచ్చు.



## అల్లం సాగులో సమగ్ర సస్యరక్షణ

### సస్యరక్షణ చర్యలు

**దుంపకుళ్లు ఈగ:** ఈ పురుగు అక్టోబర్ నెలలో మొదలై కాపు ఉన్నంత వరకు ఉంటుంది. దుంపకుళ్లు ఈగ నలుపు రంగులో ఉండి తెల్లని గుడ్లను మొక్క మొద లు వద్ద గాని, నేల మీద గాని, రంధ్రాలు ఏర్పడిన నేల మీద గాని పెడుతుంది. గుడ్ల నుంచి పొదిగిన లార్వా తెలుపు రంగులో ఉంటుంది. కాండాన్ని, దుంపల్ని ఆశించి కాండాల్ని పూర్తిగా తొలిచి తింటుంది. దీనివల్ల ఆకులు పసుపు పచ్చరంగులోకి మారి, కాండాలు పడిపోతాయి. ఈ పురుగు వల్ల 40-50 శాతం నష్టం వస్తుంది.
**నివారణ:** దీని నివారణకు మొదటగా వేడి వాతావరణంలో లోతుగా దుక్కులు దున్నాలి. దుంపకుళ్లును తట్టుకునే, పీచు తక్కువగా ఉండే అల్లం రకాలను సాగు చేయాలి. మురుగు నీటి కాలువలు ఏర్పాటు చేసి, నీళ్లు నిల్వకుండా చేయాలి. ఎకరాకు 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను సన్నని ఇసుకతో కలిపి తోటంతా సమంగా వేసుకోవాలి.

**ఆకు ముడత పురుగు:** ఆకు ముడత పురుగు నలుపు రంగులో ఉంటుంది. దాని రెండు జతల రెక్కల మీద తెల్లని చారలు ఉంటాయి. ఈ పురుగు గుడ్లలను ఆకు పైభాగంలో పెడుతుంది. గుడ్లు ఎరుపు రంగులో ఉంటాయి. గుడ్ల నుంచి పొదిగిన లార్వా ఆకు పచ్చ రంగులో ఉంటుంది. లార్వా ఆకులను చుట్టి తింటుంది. దీంతో మొత్తం ఆకు వాడిపోతుంది.
**నివారణ:** దీని నివారణకు ప్రొఫెనోఫాస్ 1 మి.లీ/ లీటరు చొప్పున శాండివిట్‌తో కలిపి 200 మి.లీ. ఎకరానికి మందు ద్రావణాన్ని తయారుచేసుకొని ఆకులపై పిచికారీ చేయాలి. అలాగే లార్వాలను ఏరి నాశనం చేయాలి.

**మొవ్వ తొలుచు పురుగు:** ఈ పురుగు చూడటానికి పసుపు పచ్చ రంగులో ఉంటుంది. చిన్నచిన్న నల్లని మచ్చలను రెండు జతల రెక్కల మీద కలిగి ఉంటుంది. ఇది గుడ్లను ఆకుల మీద గుంపులు గుంపులుగా పెడుతుంది. గుడ్ల నుంచి లార్వా మొవ్వను తొలచడం వల్ల కొమ్మ లోపలి భాగం పసుపు రంగులోకి మారిపోయి చనిపోతుంది. ఆకులు ఎండిపోతాయి. ఈ పురుగు ఉధృతి ఎక్కువగా జూలై నుంచి అక్టోబర్ వరకు కనిపిస్తుంది.
**నివారణ:** దీని నివారణకు మొదట పురుగు ఆశించిన మొవ్వులను ఏరి నాశనం చేయాలి. అలాగే డైమిథోయేట్ 2 మి.లీ+శాండివిట్ 1 మి.లీ. లేదా క్వినాల్‌ఫాస్ 2 మి.లీ. శాండివిట్ లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ+ శాండివిట్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి ఆ ద్రావణాన్ని మొవ్వు ఆకులపై పిచికారీ చేయాలి.



**పొలుసు పురుగు:** విత్తిన దుంపలను ఆశించి రసం పీలుస్తుంది. అందువల్ల దుంపలు కుంచించిపోతాయి.
**నివారణ:** దీని నివారణకు విత్తిన దుంపలను లీటరు నీటికి 5 మి.లీ. చొప్పున మలాథియాన్ కలిపి ద్రావణంలో 30 నిమిషాలు నానబెట్టాలి. ఆ తర్వాత ఆరబెట్టి విత్తుకోవాలి.

**వేరు పురుగు:** వేరు పురుగు గుడ్లను కాండం మీద పెడుతుంది. దీంట్లోనుంచి పొదిగిన పిల్ల పురుగులు 'సీ' ఆకారంలో తెల్లగా ఉండి దుంపలను, వేర్లను, మొక్కల మొదళ్లను ఆశించి నష్టపరుస్తుంది. ఈ పురుగు ఆశించిన దుంపల మీద పెద్ద పెద్ద రంధ్రాలు చేసి నష్టం చేస్తాయి.
**నివారణ:** దీని నివారణకు ఫోరెట్ 5 కిలోలు లేదా కార్బోఫ్యూరాన్ గుళికలు 7 కిలోలు/ ఎకరానికి వేసి తీవ్రతను తగ్గించుకోవచ్చు.


–కస్తూరి మానస, శాస్త్రవేత్త
(ఎంటమాలజి విభాగం)
ఫల పరిశోధనా స్థానం,
సంగారెడ్డి జిల్లా
8978963303



# భారత్‌పై క్షిపణులు ప్రయోగిస్తాం

- కశ్మీర్‌పై మద్దతిచ్చే దేశాలపైనా దాడులు చేస్తాం
- పాకిస్థాన్ మంత్రి అమీన్ వ్యాఖ్యలు

**ఇస్లామాబాద్, అక్టోబర్ 30:** భారత్‌పై క్షిపణులు ప్రయోగిస్తామంటూ పాకిస్థాన్‌కు చెందిన కశ్మీర్ వ్యవహారాల మంత్రి అలీ అమీన్ గందాపూర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దుపై భారత్‌కు మద్దతిచ్చే దేశాలపైనా దాడులు చేస్తామని ఆయన అన్నారు. మంగళవారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న అమీన్ మాట్లాడుతూ.. 'కశ్మీర్ అంశంలో భారత్‌తో నెలకొన్న ఉద్రిక్తతలు మరింత పెరిగితే పాకిస్థాన్‌కు యుద్ధం అనివార్యం. భారత్‌కు (కశ్మీర్ అంశంలో) మద్దతిచ్చే దేశాలను మా శత్రువుగా పరిగణిస్తాం. భారత్‌తోపాటు ఆయా దేశాలపై క్షిపణులు ప్రయోగిస్తాం' అని అన్నారు. ఐరోపాకు చెందిన 23 మంది పార్లమెంట్ సభ్యుల బృందం జమ్ముకశ్మీర్‌లో పర్యటించి అక్కడి పరిస్థితిని సమీక్షించిన నేపథ్యంలో పాక్‌కు చెందిన కశ్మీర్, గిల్గిట్ బాలిస్థాన్ వ్యవహారాల మంత్రి అలీ అమీన్ గందాపూర్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఆర్టికల్ 370ని రద్దు చేయడంతోపాటు జమ్ముకశ్మీర్ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా కేంద్రం విభజించిననాటి నుంచి భారత్, పాక్ మధ్య దౌత్య సంబంధాలు దెబ్బతినడంతోపాటు ఉద్రిక్తతలు తలెత్తిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఐరాస సర్వసభ్య సమావేశంలో కశ్మీర్ అంశంపై సుదీర్ఘ ప్రసంగం చేసిన పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అణు దేశాలైన భారత్, పాక్ మధ్య యుద్ధం సంభవిస్తే ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందో చెప్పలేనంటూ ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.



## బంగారాన్ని మేసిన ఎద్దు



**సిర్సా, అక్టోబర్ 30:** ఓ ఎద్దు గడ్డికి బదులు బంగారాన్ని మేసింది. వినడానికి వింతగా ఉన్న ఈ ఘటన హర్యానాలో జరిగింది. సిర్సా జిల్లాలోని కలనావాలి ప్రాంతంలో జనకరాజ్ కుటుంబం నివసిస్తున్నది. అక్టోబర్ 19న ఆయన భార్య, కోడలు వంట పనుల్లో నిమగ్నమై ఉన్నప్పుడు తమ బంగారు ఆభరణాలు తీసి ఓ పాత్రలో ఉంచారు. ఆ విషయాన్ని మర్చిపోయి ఆ తర్వాత పొరపాటున కూరగాయల వ్యర్థాలను అదే పాత్రలో వేసి బయట ఉన్న చెత్త డబ్బాలో వాటిని పడేశారు. ఇంతలో అక్కడికి వచ్చిన ఓ ఎద్దు వాటిని తినేసింది. జరిగిన పొరపాటును గ్రహించి బంగారు ఆభరణాల కోసం వారు వెతకగా ఎద్దు తినేసినట్లు సీసీటీవీ దృశ్యాల ద్వారా గ్రహించారు. అనంతరం ఆ ఎద్దు కోసం పరిసర ప్రాంతాల్లో గాలించి పట్టుకున్నారు. ఓ పశువైద్యుడి సలహా మేరకు దాన్ని ఇంట్లో కట్టి నాటి నుంచి రోజు మేపుతున్నారు. పేడ ద్వారా బంగారం బయటకు వస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నారు. ఒకవేళ బంగారం బయటకు రానిపక్షంలో ఆ ఎద్దును గోశాలకు అప్పగిస్తామని జనక్‌రాజ్ మీడియాకు తెలిపారు.





బుధవారం డీటీసీ బస్సులో ప్రయాణికులతో మాట్లాడుతున్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్

## కాలుష్యం నుంచి రక్షణ కోసం మాస్కులు

**విద్యార్థులకు 50 లక్షల మాస్కులను పంపిణీ చేయనున్న కేజ్రీవాల్ సర్కార్**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 30:** ఢిల్లీలో వాయు కాలుష్య స్థాయి పెరుగడంతో ఆ రాష్ట్రంలోని పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం నుంచి మాస్కులను పంపిణీ చేయనున్నట్టు ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బుధవారం ప్రకటించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు 50 లక్షల ఎన్95 మాస్కులను వారం రోజుల పాటు పంపిణీ చేస్తామని, ఒక్కో కిట్‌లో రెండు మాస్కులు ఉంటాయని తెలిపారు. 'ఈ మాస్కులు మాకు డెలివరీ అవుతున్నాయి. శుక్రవారం నుంచి నేను కూడా వీటిని విద్యార్థులకు పంపిణీచేస్తా' అని అని కేజ్రీవాల్ చెప్పారు. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో వ్యవసాయ వ్యర్థాలను (పంట కోసిన తర్వాత మిగిలిపోయే పిలకలను) తగులబెట్టడమే వాయు కాలుష్య స్థాయి పెరుగుదలకు ప్రధాన కారణమని ఆయన పేర్కొంటూ.. దీన్ని నిరోధించేందుకు చర్యలు చేపట్టాలని ఇరుగుపొరుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

**డీటీసీ బస్సెక్కిన కేజ్రీవాల్**

ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (డీటీసీ) బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పించేందుకు మంగళవారం ఓ పథకాన్ని ప్రారంభించిన కేజ్రీవాల్.. బుధవారం ఆ బస్సుల్లో ప్రయాణించి ఈ పథకంపై మహిళా ప్రయాణికుల స్పందనను తెలుసుకొన్నారు. ఈ పథకాన్ని ప్రారంభించిన తొలిరోజే 4.77 లక్షల మందికిపైగా మహిళలు ఉచిత ప్రయాణం కోసం పింక్ టికెట్లను పొందినట్టు డీటీసీ బుధవారం అధికారికంగా వెల్లడించింది. 'ఉచిత ప్రయాణ సదుపాయంపై మహిళా ప్రయాణికుల అభిప్రాయాలను నేరుగా తెలుసుకొనేందుకు నేను కొన్ని డీటీసీ బస్సుల్లో ఎక్కి విద్యార్థులు, ఉద్యోగినులు, షాపింగ్‌కు వెళ్లే మహిళలతో పాటు తరచుగా వైద్యుల వద్దకు వెళ్లేవారిని కూడా కలుసుకున్నా. ఈ పథకం పట్ల వారు ఎంతో సంతోషంగా ఉన్నారు' అని కేజ్రీవాల్ ట్వీట్ చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం మోహరించిన బస్ మార్షల్స్ వల్ల మహిళా ప్రయాణికుల్లో భద్రతాభావం, ఈవ్‌టీజర్లల్లో భయం ఏర్పడుతున్నదని ఆయన మరో ట్వీట్‌లో పేర్కొన్నారు.

# నిత్యం 'ఉగ్ర' బెదిరింపులు

- మృతి చెందిన బెంగాలీ కార్మికుల కుటుంబ సభ్యుల ఆవేదన
- కశ్మీరీల ఉపాధి కొల్లగొడుతున్నారని, వెళ్లిపోవాలని బెదిరించేవారని వెల్లడి
- కాల్పుల ఘటనపై దర్యాప్తునకుపశ్చిమబెంగాల్ సీఎం మమత డిమాండ్
- జైషే మహ్మద్ ఉగ్రవాదుల పనేనని నిఘా వర్గాల అనుమానం
- కాల్పుల నేపథ్యంలో కశ్మీర్‌లోయలో భద్రత పటిష్ఠం



శ్రీనగర్‌లోని దవాఖానలో చికిత్స పొందుతున్న జహీరుద్దీన్ షేక్




పశ్చిమబెంగాల్‌లోని ముర్షీదాబాద్ జిల్లా బహల్‌నగర్‌లో రోదిస్తున్న మృతుల బంధువులు

**బహల్‌నగర్ (పశ్చిమబెంగాల్)/ శ్రీనగర్, అక్టోబర్ 30:**

కశ్మీర్ లోయలోని యాపిల్ తోటల్లో కార్మికులుగా పనిచేస్తున్న తమ వారికి తరుచూ బెదిరింపులు వచ్చేవని మంగళవారం ఉగ్రవాదుల చేతుల్లో ప్రాణాలు కోల్పోయిన బెంగాలీ కార్మికుల కుటుంబాలు వాపోయాయి. 'కశ్మీరీయేతరులు' లోయను వీడి వెళ్లాలని నిత్యం బెదిరించేవారని మృతుల కుటుంబాల సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి కుల్గాం జిల్లాలో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఆరుగురు వలస కార్మికులు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. వీరంతా పశ్చిమబెంగాల్‌లోని ముర్షీదాబాద్ జిల్లా సాగర్‌డిఘీ ప్రాంతం బహల్‌నగర్ వాసులు. పండ్లతోటల్లో పని చేసేందుకు ఏటా ఆగస్టులో కశ్మీర్‌కు వెళ్లి అక్టోబర్‌లో తిరిగి స్వస్థలానికి చేరుకుంటారు. ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన నయీముద్దీన్ తండ్రి జారిష్ షేక్ కూడా యాపిల్ పండ్లతోటల్లో పని చేశాడు. ఆయన మాట్లాడుతూ 'స్థానిక కశ్మీరీల ఉపాధి అవకాశాల్ని కొల్లగొడుతున్నారని ఉగ్రవాదులు ఆరోపించేవారు. వెళ్లిపోవాలని బెదిరించేవారు. దీంతో నేను నిన్న (మంగళవారం) వెనుకకు వచ్చేశాను. నా కొడుకు కూడా వేతనం తీసుకుని గురువారం తిరిగి వస్తానని చెప్పాడు. కానీ అదే వాడి కడసారి చూపవుతుందని అనుకోలేదు' అని బోరుమన్నాడు. మరో మృతుడు కమ్రుద్దీన్ షేక్ సోదరుడు అమినిరుల్ మాట్లాడుతూ.. 'కమ్రుద్దీన్ కొన్నేండ్లుగా కశ్మీర్‌లో పని చేస్తున్నాడు. కానీ ఈసారి లోయలో పరిస్థితులు బాగా లేవు. కశ్మీరేతరులు వెళ్లిపోవాలని నిరంతరం ఉగ్రవాదులు బెదిరిస్తున్నారు. దీంతో దీపావళి తర్వాత వెనుకకు వచ్చేస్తున్నానని మాతో చెప్పాడు. ఇంతలోనే ప్రాణాలు కోల్పోయాడు' అని తెలిపారు. తీవ్రంగా గాయపడి దవాఖానలో చికిత్స పొందుతున్న జహీరుద్దీన్ షేక్ భార్య పరామిత మాట్లాడుతూ 'నా భర్త సురక్షితంగా వచ్చేస్తాడని ఆశాభావంతో ఉన్నా. ఆయన సురక్షితంగా ఇంటికొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. ఒకసారి ఆయన వచ్చేస్తే కశ్మీర్‌లో పని చేసేందుకు మళ్లీ వెళ్లనివ్వను' అని తెలిపారు. 20 ఏండ్లుగా బహల్‌నగర్ వాసులు కశ్మీర్‌లో యాపిల్ తోటల్లో, భవన నిర్మాణరంగంలో కార్మికులుగా పని చేస్తున్నారు. ఇప్పటికీ ఆ గ్రామానికి చెందిన పలువురు కశ్మీర్‌లో ఉన్నారు. రోషిణి బీబీ అనే మహిళ మాట్లాడుతూ 'పది రోజులుగా నా భర్తతో మాట్లాడలేదు. కాల్పుల వార్త విన్న తర్వాత మాకెవరికి నిద్ర పట్టటం లేదు' అని తెలిపారు. కశ్మీర్ ఘటనపై పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీ తీవ్రంగా స్పందించారు. దీనిపై దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. ముష్కరుల దాడిలో ఆరుగురు బెంగాలీ కార్మికులు మరణించడం తమను దిగ్భ్రాంతికి గురి చేసిందని, ఈ ఘటన దురదృష్టకరం అని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తామని ప్రకటించారు. మరోవైపు బెంగాలీ కార్మికులపై కాల్పుల ఘటన వెనుక పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న జైషే మహ్మద్ ఉగ్రవాదసంస్థ హస్తం ఉందని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఉగ్రవాదుల దాడిని కేంద్ర ప్రభుత్వంతోపాటు, విపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. కాల్పుల ఘటన నేపథ్యంలో కశ్మీర్ లోయ అంతటా భద్రతను పటిష్ఠం చేయడంతో బుధవారం జన జీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు కశ్మీర్ లోయలో ప్రత్యేకించి సౌత్ కశ్మీర్‌లో ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. అడుగడుగునా వాహనాలను, ప్రజలను తనిఖీ చేస్తున్నారు. మార్కెట్లు మూతపడ్డాయి. రోడ్లపై జన సంచారం లేదు.

# అవార్డులొద్దు.. అవగాహన ముఖ్యం

- నోర్డియాక్ కౌన్సిల్ పురస్కారాన్ని తిరస్కరించిన యువ పర్యావరణ కార్యకర్త గ్రెటా థెన్‌బర్గ్
- ఉద్యమానికి బహుమతులు అవసరం లేదని వ్యాఖ్య
- సైన్స్ చెప్తున్న వాస్తవాల్ని దేశాల అధినేతలు గ్రహించాలని హితవు



**కోపెన్‌హెగన్, అక్టోబర్ 30:** పర్యావరణ మార్పులపై అశ్రద్ధ వహించడానికి 'మీకెంత ధైర్యం' అంటూ ప్రపంచ దేశాధినేతల్ని ఐక్యరాజ్యసమితి(ఐరాస) వేదికగా నిలదీసిన 16 ఏండ్ల పర్యావరణ కార్యకర్త గ్రెటా థెన్‌బర్గ్.. నాయకుల తీరుపై తన అసంతృప్తిని మరోసారి వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణకై విశేష కృషి చేస్తున్నందుకుగానూ ఈ ఏడాది 'నోర్డియాక్ కౌన్సిల్' ఇచ్చే పర్యావరణ అవార్డు విజేతగా స్వీడన్, నార్వే ఆమె పేరును ప్రకటించాయి. ఈ క్రమంలో గ్రెటాకు అవార్డుతో పాటు 3,50,000 డానిష్ క్రోనర్లు(దాదాపు 35 లక్షల రూపాయలు) బహుమతిగా లభించాయి. అయితే గ్రెటా మాత్రం ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును తిరస్కరించారు. 'పర్యావరణ పరిరక్షణ ఉద్యమానికి ఎలాంటి బహుమతులు అవసరం లేదు' అని చెబుతూ.. తనకు అవార్డులు అక్కర్లేదని, వాతావరణ మార్పుపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుంటే చాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం గ్రెటా అమెరికాలోని కాలిఫోర్నియా పర్యటనలో ఉన్నారు. దీంతో స్టాక్‌హోంలో మంగళవారం నిర్వహించిన నోర్డియాక్ కౌన్సిల్ అవార్డుల కార్యక్రమానికి ఆమె తరుపున సోఫియా, ఇసాబెల్లా ఆక్సెల్సన్ అనే ఇద్దరు పర్యావరణ కార్యకర్తలు హాజరయ్యారు. గ్రెటా రాసిచ్చిన సందేశాన్ని సభికులకు చదివి వినిపించారు. 'పర్యావరణ పరిరక్షణకు మన రాజకీయ నాయకులు, అధికారుల సహకారం మనకు కావాలి. సైన్స్ చెబుతున్న వాస్తవాల్ని వారు గ్రహించాలి' అని విజ్ఞప్తి చేశారు. పర్యావరణానికి సంబంధించి గ్రెటాను ఇదివరకే ఎన్నో ప్రతిష్ఠాత్మక అవార్డులు వరించాయి. ఇంకెన్నో అవార్డులకు ఆమె నామినేట్ అయ్యారు. గ్రెటా పాఠశాలలో చదువుతున్న సమయంలో పర్యావరణ మార్పులపై ఆందోళన వ్యక్తం చేస్తూ మూడు నెలల పాటు నిరసన వ్యక్తం చేశారు.



దీన్ని గుర్తించిన ఓ స్వీడన్ విద్యుత్ కంపెనీ గత సంవత్సరం ఆమెకు చిల్డ్రన్స్ క్లైమెట్ ప్రైజ్‌ను ప్రకటించింది. అయితే, ఈ అవార్డును ఆమె నిరాకరించారు. స్టాక్‌హోంలో ఈ అవార్డుల ప్రదానం జరగాల్సి ఉన్నది. అక్కడికి వెళ్లాలంటే విజేతలు విమానంలో ప్రయాణించాల్సి ఉంటుంది. విమానం నుంచి వెలువడే ఎక్కువ మోతాదు కర్బన ఉద్గారాల వల్ల పర్యావరణానికి చేటు కలుగుతుందన్న కారణంతో ఆమె ఈ అవార్డును తీసుకోవడానికి తిరస్కరించారు. 'ప్రత్యామ్నాయ నోబెల్'గా వ్యవహరించే రైట్ లైవ్లీహుడ్ అవార్డు 2019కు కూడా ఆమె నామినేట్ అయ్యారు. సెప్టెంబర్‌లో ఐరాస వేదికగా జరిగిన వాతావరణ సదస్సుకు హాజరు కావడానికి కూడా అట్లాంటిక్ మహా సముద్రం గుండా ఆమె రెండు వారాల పాటు కాలుష్య ఉద్గారాలు వెలువడని ఓ పడవలో ప్రయాణించారు. ఐరాస వేదికగా పర్యావరణ మార్పులపై దృష్టిసారించని ప్రపంచ దేశాధినేతలపై విరుచుకుపడ్డారు. 'పర్యావరణ విధ్వంసం వల్ల ప్రజలు జబ్బున పడుతున్నారు. చనిపోతున్నారు. మొత్తం పర్యావరణమే నాశనమైపోతున్నది. అంతరించిపోతున్న జీవజాతుల అంతిమ దినాలలో ఆఖరి శ్వాసను పీలుస్తూ కొన ఊపిరితో ఉన్నాం. మీకు డబ్బు కావాలి. వాటి కోసం మమ్మల్ని మభ్యపెడుతున్నారు. మీకెంత ధైర్యం!' అంటూ తన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రఖ్యాత టైమ్ మ్యాగజైన్ తన కవర్ పేజీపై 'తర్వాతి తరం నాయకురాలు' శీర్షికతో మే, 2019లో గ్రెటా థెన్‌బర్గ్ చిత్రాన్ని ప్రచురించింది.

## 13 వరకు జుడీషియల్ కస్టడీలోనే చిదంబరం

- ఢిల్లీ కోర్టు ఆదేశం

**ఢిల్లీ:** ఐఎన్‌ఎక్స్ మీడియా అవినీతి కేసులో కేంద్ర మాజీ మంత్రి పీ చిదంబరాన్ని ఢిల్లీ కోర్టు బుధవారం నవంబర్ 13 వరకు జుడీషియల్ కస్టడీకి పంపింది. చిదంబరాన్ని విచారించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఒకరోజు కస్టడీ విజ్ఞప్తిని ప్రత్యేక న్యాయమూర్తి అజయ్‌కుమార్ కుహర్ తిరస్కరించారు. చిదంబరానికి ఔషధాలు, ఆధునిక టాయిలెట్, రక్షణతోపాటు ప్రత్యేక సెల్ వసతిని కల్పించాలని తీహార్ జైలు అధికారులను కోర్టు ఆదేశించింది. సీనియర్ కాంగ్రెస్ లీడర్ అయిన చిదంబరం ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఇంటి భోజనాన్ని అనుమతించాలని సూచించింది. ఐఎన్‌ఎక్స్ మీడియా అవినీతి కేసులో ఆగస్టు 21న సీబీఐ చిదంబరాన్ని అరెస్టు చేయగా, అందుకు సంబంధించిన మనీ లాండరింగ్ విషయంలో ఈడీ అదుపులో ఉన్నారు. చిదంబరం ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో ఐఎన్‌ఎక్స్ మీడియా రూ.305 కోట్ల విదేశీ నిధులు సమకూర్చుకొనేందుకు విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎఫ్ఐపీబీ) అనుమతి మంజూరులో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ 15 మే 2007లో సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ విషయంలో మనీ లాండరింగ్ కేసును 2017లో ఈడీ నమోదు చేసి, గత అక్టోబర్ 16న ఆయనను అదుపులోకి తీసుకున్నది.



ముఖ్యమంత్రి కేసీఆర్, ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేస్తున్న గౌడసంఘం నాయకులు

## సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

**చొప్పదండి, నమస్తే తెలంగాణ:**

నీరా పాలసీని ఏర్పాటుచేస్తూ జీవో విడుదల చేయడంపై గౌడ సంఘం నాయకులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జిల్లా గౌడ సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్, ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. 70 ఏండ్లుగా ఎదురుచూస్తున్న కలను సాకారంచేసిన సీఎం కేసీఆర్‌కు గౌడ కులస్థులందరూ జీవితాంతం రుణపడి ఉంటారని జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్లపెల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌడ సంఘం నాయకులు ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్, టీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బందారపు అజయ్‌గౌడ్, చేపూరి రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానిస్తున్న తెలంగాణ గౌడ ఉద్యోగుల సమాఖ్య ప్రతినిధులు

## నీరా పాలసీ అద్భుతం

**మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు ఉద్యోగసంఘాల అభినందనలు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నీరా పాలసీ అద్భుతంగా ఉన్నదని, రాష్ట్రంలో ప్రవేశపెట్టనున్న నీరా అమ్మకాలు దేశ చరిత్రలో నిలిచిపోతాయని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం, తెలంగాణ గౌడ ఉద్యోగుల సమాఖ్య పేర్కొన్నది. నీరా పాలసీ చాలా పారదర్శకంగా ఉందని ఆబ్కారీశాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసి ప్రతినిధులు అభినందనలు తెలిపారు. గీత కార్మికులకు చేయూత నివ్వడమే కాకుండా నీరా ఆరోగ్య జీవనానికి తోడ్పడుతుందని చెప్పారు. గీత కార్మికులకు ఇచ్చిన హామీని సీఎం కేసీఆర్ నెరవేర్చారని, సీఎంకు రుణపడి ఉంటారని పేర్కొన్నారు. అనంతరం మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. మంత్రిని కలిసిన వారిలో టీజీవో వైస్ ప్రెసిడెంట్ పీ రవీంద్రకుమార్‌గౌడ్, ఉద్యోగసంఘాల ప్రతినిధులు తమటం లక్ష్మణ్‌గౌడ్, సత్యగౌడ్, దత్తురాజ్, గణేశ్‌గౌడ్, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## రైళ్ల వేగాన్ని పెంచాలి: గజానన్ మాల్యా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రైల్వేబోర్డు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి రైళ్ల సగటు వేగాన్ని పెంచాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ గజానన్ మాల్యా అధికారులకు సూచించారు. వేగ నిబంధనలను కనీసస్థాయికి తగ్గించి సమయపాలన పాటించాలని ఆదేశించారు. బుధవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో వివిధ విభాగాల ఉన్నతాధికారులతో భద్రత, సమయపాలన, సరుకు రవాణా విషయాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ డివిజన్ల డీఆర్‌ఎంలు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.



అమ్రాబాద్ అడవుల్లో క్షేత్ర పర్యటనలో పాల్గొన్న డాక్టర్ మురాట్కర్

## ఏటీఆర్ అడవుల్లో సంరక్షణ చర్యలు భేష్

- గడ్డి వనరుల శాస్త్ర నిపుణులు డాక్టర్ మురాట్కర్

**అమ్రాబాద్ రూరల్:** నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమల ప్రాంతంలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వు (ఏటీఆర్) అడవుల అభివృద్ధి కోసం చేపడుతున్న చర్యలు చాలా బాగున్నాయని మహారాష్ట్రలోని అమరావతి విశ్వవిద్యాలయానికి చెందిన గడ్డి వనరుల శాస్త్ర నిపుణులు డాక్టర్ మురాట్కర్ అధికారులను అభినందించారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల పరిధిలోని అడవుల్లో రెండు రోజుల క్షేత్ర పర్యటన అనంతరం మన్ననూర్‌లో ముగింపు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండు సంవత్సరాలుగా ఏటీఆర్ అడవుల్లో గడ్డి వనరులు, ఇతర అభివృద్ధి కోసం చేపడుతున్న పనులు ఎంతో పురోగతిని సాధించాయని గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వం హరితహారం ద్వారా రాష్ట్రంలో కోట్లాది మొక్కలను పెంచడం దేశానికే ఆదర్శమన్నారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫీల్డ్ డైరెక్టర్ ఏకే సిన్హా మాట్లాడుతూ అడవుల సంరక్షణలో గడ్డి విత్తనాల సేకరణకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, ఫైర్‌లైన్, ఇతర అభివృద్ధి పనులకు గాను ప్రతి బీట్ అధికారి ప్రణాళికను తయారు చేసి నివేదికలను అందజేయాలని సూచించారు.

## డిసెంబర్ 12న బ్రిటన్ ఎన్నికలు

**438-20 ఓట్ల తేడాతో కామన్స్ హౌస్ ఆమోదం**

**క్రిస్మస్‌కు ముందే బ్రెగ్జిట్‌కు అనుకూలంగా తీర్పు పొందాలని ప్రధాని జాన్సన్ వ్యూహం**

**లండన్, అక్టోబర్ 30:** ఈయూ నుంచి వైదొలిగేందుకు ప్రతిపాదించిన 'బ్రెగ్జిట్' ఒప్పందంపై నెలకొన్న ప్రతిష్ఠంభనకు తెర దించేందుకు డిసెంబర్ 12న ప్రజాతీర్పు కోరాలన్న ప్రధాని బోరిస్ జాన్సన్ పిలుపును బ్రిటన్ పార్లమెంట్ దిగువ సభ (కామన్స్‌హౌస్) ఆమోదించింది. బ్రెగ్జిట్ ఒప్పందాన్ని ఖరారు చేసుకోవడానికి వచ్చే ఏడాది జనవరి నెలాఖరు వరకు గడువు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ఈయూ ప్రకటించిన కొన్ని గంటల్లో ఎన్నికల నిర్వహణకు జాన్సన్ ప్రతిపాదించిన తీర్మానానికి మంగళవారం రాత్రి కామన్స్ హౌస్ 438–20 ఓట్ల తేడాతో ఆమోదం తెలిపింది. ఈ బిల్లును వచ్చేవారం ఎగువసభ (హౌస్ ఆఫ్ లార్డ్స్) ఆమోదించిన తర్వాత కామన్స్ హౌస్ రద్దు కానున్నది. అదే జరిగితే ఎన్నికల ప్రచారానికి వివిధ పార్టీలకు ఐదు వారాల సమయం లభిస్తుంది. కాగా, ప్రస్తుత పార్లమెంట్ దిగువ సభ గడువు 2022 మే వరకు ఉన్నది. 1923 తర్వాత నాలుగేండ్లలోపే బ్రిటన్ పార్లమెంట్‌కు ఎన్నికలు జరుగడం ఇది మూడోసారి. క్రిస్మస్‌కు ముందే బ్రెగ్జిట్‌కు అనుకూలంగా తీర్పు పొందాలని ప్రధాని జాన్సన్ భావిస్తున్నారు. ఇంతకు ముందు థెరెసా మే కూడా 2017లో ఎన్నికలకు వెళ్లారు. కానీ కామన్స్ హౌస్‌లో ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ సీట్లు పొందడంలో అధికార కన్జర్వేటివ్ పార్టీ విఫలమైంది. లేబర్ పార్టీ నేత జెరెమీ కార్బ్యన్ మాట్లాడుతూ బ్రెగ్జిట్‌కు మరో మూడు నెలల గడువు ఉన్నందున ఎన్నికల ప్రక్రియకు మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు.



## ప్రతి ఎకరాకూ సాగునీరే లక్ష్యం

**ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి**

**జడ్చర్లటౌన్:** రాష్ట్రంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదని మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు చేయూతనిస్తున్నదని చెప్పారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణశివారులోని పత్తి మార్కెట్‌యార్డులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడుతూ.. రైతుల పంటకు గిట్టుబాటు ధర, మార్కెటింగ్ సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వాలు వ్యవసాయరంగంపై చూపిన నిర్లక్ష్యం వల్ల పత్తి రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తుచేశారు. పాలమూరు ఎత్తిపోతల పథకం పనులు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయని, ఇవి పూర్తయితే మహబూబ్‌నగర్ జిల్లా సస్యశ్యామలం అవుతుందన్నారు. జడ్చర్ల పత్తి మార్కెట్‌లో పదేండ్ల తర్వాత సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభమైందని పేర్కొన్నారు.

# టెక్నాలజీని అందుబాటులోకి తేవాలి

**వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ వీ ప్రవీణ్‌రావు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అధునాతన టెక్నాలజీని సమర్థంగా వినియోగించుకొనేందుకు రైతులు, విద్యార్థులకు మరింత చేరువచేయాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ వీ ప్రవీణ్‌రావు సూచించారు. ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్న సమాచారాన్ని సరైన రీతిలో సంపూర్ణంగా వినియోగించుకోవాలన్నారు. బుధవారం రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ కళాశాల ప్లాంట్ బ్రీడింగ్ విభాగంలో ఈ-కోర్స్ రికార్డింగ్ ల్యాబ్ సదుపాయాన్ని ఆయన ప్రారంభించారు. ప్రస్తుతం అనేక రకాలైన టెక్నాలజీలు లభ్యమతున్నాయని, వాటిని ఉపయోగించుకొని వినూత్న పద్ధతుల్లో బోధన చేయాలన్నారు. విద్యార్థులరు ఉపయుక్తమయ్యే కోర్సులను పూర్తిగానూ, సంక్షిప్తంగానూ రికార్డుచేసి అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఎన్ని ఆధునిక టెక్నాలజీలు అందుబాటులోకి వచ్చినప్పటికీ మానవ మేధస్సుకు ఏదీ సాటిరాదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి రిజిస్ట్రార్ డాక్టర్ సీమ, ప్లాంట్ బ్రీడింగ్ విభాగం అధిపతి డాక్టర్ రాధాకృష్ణతోపాటు ఉన్నతాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బుధవారం ఈ-కోర్స్ రికార్డింగ్ ల్యాబ్ సదుపాయాన్ని ప్రారంభిస్తున్న ప్రవీణ్‌రావు



దుబార్‌పేట్‌లో అర ఎకరం స్థలం ఇస్తున్నట్టు బాండ్ పేపర్ అందజేస్తున్న దాత సాలంరావ్

## శ్మశానవాటికకు అరెకరం విరాళం

**ఇచ్చోడ:** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని దుబార్‌పేట్ (బీ) గ్రామంలో శ్మశానవాటిక స్థలం కోసం ఓ గిరిజన రైతు అర ఎకరం భూమిని విరాళంగా ఇస్తున్నట్టు ప్రకటించారు. దుబార్‌పేట్ (ఏ) గ్రామపంచాయతీలోని అనుబంధ గ్రామమైన దుబార్‌పేట్ (బీ) గ్రామానికి చెందిన సాలంరావ్ అనే రైతుకు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. గ్రామంలో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియల కోసం స్థలం లేకపోవడంతో ఇబ్బందులు పడుతుండేవారు. గ్రామానికి చెందిన సర్పంచ్ చాహాకటి అభిమాన్ ప్రత్యేక చొరవ తీసుకుని సాలంరావ్‌తో మాట్లాడారు. తనకున్న పట్టా భూమి సర్వేనంబర్ 33 నుంచి అర ఎకరం భూమిని శ్మశానవాటికకు ఉచితంగా ఇస్తున్నట్టు కుటుంబసభ్యుల సమక్షంలో సాలంరావ్ బుధవారం బాండ్‌పేపర్ రాసి ఇచ్చారు. దాత సాలంరావ్‌ను దుబార్‌పేట్ (ఏ), దుబార్‌పేట్ (బీ) గ్రామాల ప్రజలు అభినందించారు.

నమస్తే తెలంగాణ
చిత్రం
[కరీంనగర్]
గురువారం 31 అక్టోబర్ 2019


విజయ్ దేవరకొండ

# కలలా జరిగిపోయింది

'కొత్త ప్రతిభను ప్రోత్సహించాలనే బాధ్యతతో ఈ చిత్రాన్ని నిర్మించాను. ఈసినిమా ద్వారా పదిమంది కలల్ని నిజం చేయడం సంతృప్తిగా ఉంది' అని అన్నారు హీరో విజయ్ దేవరకొండ. కింగ్ ఆఫ్ ది హిల్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై వర్ధన్ దేవరకొండతో కలిసి ఆయన నిర్మించిన చిత్రం 'మీకు మాత్రమే చెప్తా'. తరుణ్‌భాస్కర్, అభినవ్, అనసూయ, అవంతిక ప్రధాన పాత్రల్లో నటించారు. నవంబర్ 1న విడుదలకానుంది. మంగళవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక జరిగింది. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ 'కొత్త నిర్మాణ సంస్థ, నటీనటులు, సాంకేతిక నిపుణుల కలయికలో రూపొందిన చిత్రమిది. ఈ సినిమా ప్రయాణం ఓ కలలా జరిగిపోయింది. గర్వం, సంతోషంతో ఈ సినిమా చేశాం. ఐదేళ్ల క్రితం సినీ ప్రముఖుల్ని కలవడానికి భయపడేవాన్ని. అబద్ధం చెప్పడానికి ధైర్యం లేక స్టూడియోల ముందు నుంచి తిరిగివచ్చేవాన్ని. డబ్బులు అవసరమైతే పూరి జగన్నాథ్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేయమని అప్పట్లో నాన్న సలహా ఇచ్చారు. అలాంటిది నేను నిర్మించిన సినిమాను ఆశీర్వదించడానికి ఆయనతో పాటు పలువురు సినీ ప్రముఖులు రావడం, నాతో పనిచేయాలని అనుకోవడం గర్వంగా ఉంది. మరొకరికి చేయూత నిచ్చి పైకి తీసుకురావాలనే ఆలోచనతో నిర్మించిన సినిమా ఇది' అని అన్నారు. 'విజయ్ దేవరకొండ నిర్మించిన ఈ సినిమా పెద్ద విజయాన్ని సాధించాలి. అందరిలాగే నేను ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని దర్శకుడు పూరి జగన్నాథ్ చెప్పారు. విజయ్ దేవరకొండ చేస్తున్న ఈ చిన్న ప్రయత్నం ఘన విజయాన్ని సాధించాలని సురేష్‌బాబు తెలిపారు. దర్శకుడు షమ్మీర్ సుల్తాన్ మాట్లాడుతూ 'రాకేష్ పాత్రలో తరుణ్ అద్భుతమైన అభినయాన్ని కనబరిచాడు. అభినవ్, అనసూయ పాత్రలు మెప్పిస్తాయి' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అనసూయ, అవంతిక తదితరులు పాల్గొన్నారు.


# 'రెడ్' మొదలైంది..

'కెరీర్‌లో తొలిసారి థ్రిల్లర్ జోనర్‌లో నేను చేస్తున్న సినిమా ఇది. వాణిజ్య హంగుల మేళవింపుతో విభిన్నంగా ఉంటుంది' అని అన్నారు రామ్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న 'రెడ్' చిత్రం బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. శ్రీ స్రవంతి మూవీస్ పతాకంపై స్రవంతి రవికిషోర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కిషోర్ తిరుమల దర్శకుడు. పూజా కార్యక్రమాల అనంతరం రామ్‌పై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు పూరి జగన్నాథ్ క్లాప్‌నివ్వగా, నిర్మాత జెమిని కిరణ్ కెమెరా స్విఛాన్ చేశారు. ఈ సందర్భంగా హీరో రామ్ మాట్లాడుతూ 'భిన్న భావోద్వేగాల సమాహారంగా సాగుతుంది. నవ్యమైన పాయింట్‌తో తెరకెక్కిస్తున్నాం. నా గెటప్ వినూత్నంగా



రామ్‌పై క్లాప్‌నిస్తున్న పూరి జగన్నాథ్

ఉంటుంది. ఏప్రిల్‌లో సినిమాను విడుదల చేస్తాం' అని తెలిపారు. నిర్మాత మాట్లాడుతూ 'నవంబర్16 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. ఓ విజయవంతమైన సినిమాలోని ఆత్మను తీసుకొని తెలుగు నేటివిటీకి అనుగుణంగా మార్పులు చేసి తెరకెక్కిస్తున్నాం'అని అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ.


దేవిశ్రీప్రసాద్, రవిశంకర్, నవీన్, సుకుమార్, అల్లు అర్జున్, అల్లు అరవింద్, చెర్రీ

# హ్యాట్రిక్ సినిమా షురూ

తెలుగు చిత్రసీమలో హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్‌లది విజయవంతమైన కాంబినేషన్. వీరిద్దరి కలయికలో రూపొందుతున్న హ్యాట్రిక్ చిత్రం బుధవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. మైత్రీ మూవీ మేకర్స్, ముత్తంశెట్టి మీడియా పతాకాలపై రూపొందుతున్న ఈ చిత్రానికి నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మాతలు. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్నది. దేవుని పటాలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత అల్లు అరవింద్ క్లాప్‌నివ్వగా, దర్శకుడు సురేందర్‌రెడ్డి చిత్రబృందానికి స్క్రిప్ట్ అందజేశారు. 'ఆర్య', 'ఆర్య-2' తర్వాత అల్లు అర్జున్, సుకుమార్ కలయికలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. వాటికి తగినట్లుగానే నవ్యమైన కథ, కథనాలతో ఈ సినిమా రూపుదిద్దుకోనున్నది. దేవిశ్రీప్రసాద్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. ఎర్రచందనం అక్రమరవాణా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో అల్లు అర్జున్ పాత్ర నవ్యరీతిలో ఉండనున్నట్లు సమాచారం. త్వరలో ఈ సినిమా గురించిన పూర్తి వివరాల్ని తెలియజేస్తామని చిత్రబృందం ప్రకటించింది. 'డార్లింగ్ సుకుమార్‌తో నేను చేస్తున్న మూడో సినిమా ఇది. దేవిశ్రీప్రసాద్ సంగీతం మరోసారి మ్యాజిక్‌ను పునరావృతం చేస్తుందనే నమ్మకముంది' అని అల్లు అర్జున్ ట్విట్టర్ ద్వారా పేర్కొన్నారు. ఈ చిత్ర ప్రారంభోత్సవ వేడుకలో కొరటాలశివతో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: మిరోస్లా కుబా బ్రోజెక్, సంగీతం:దేవిశ్రీప్రసాద్, ఎడిటర్:కార్తిక్ శ్రీనివాస్, కళా దర్శకత్వం: ఎస్.రామకృష్ణ, మోనిక, సీఈఓ:చెర్రీ, సహనిర్మాత:ముత్తంశెట్టి మీడియా, లైన్ ప్రొడ్యూసర్:బాలసుబ్రహ్మణ్యం కె.వి.వి.

# సెంటిమెంట్‌ను రుజువుచేసింది


ప్రభు, కార్తి, రాధామోహన్

'గొప్ప సినిమా తీశారంటూ ప్రతి ఒక్కరూ ప్రశంసిస్తున్నారు. నటుడిగా ఇలాంటి భిన్నమైన కథ, పాత్రలు నాకు దొరకడం అదృష్టంగా భావిస్తున్నాను' అని అన్నారు కార్తి. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఖైదీ'. లోకేష్ కనకరాజ్ దర్శకుడు. కె.కె.రాధామోహన్ ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందించారు. ఇటీవల ఈ సినిమా విడుదలైంది. బుధవారం హైదరాబాద్‌లో చిత్రబృందం విజయోత్సవ వేడుకను నిర్వహించింది. కార్తి మాట్లాడుతూ 'చాలా రోజుల తర్వాత పండగ సమయంలో నేను నటించిన సినిమా విడుదలకావడం ఆనందంగా ఉంది. హీరోయిన్, పాటలు లేకుండా తెరకెక్కించిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పిస్తున్నది. యాక్షన్, మాస్, వినోదంతో పాటు తండ్రీకూతుళ్ల అనుబంధంతో కనెక్ట్ అవుతున్నారు. ఒక్క నిమిషం కూడా చూపు తిప్పుకోనివ్వకుండా ఉత్కంఠను పంచుతున్నదని చెబుతున్నారు. 'ఖైదీ' టైటిల్ పెడితే సినిమా విజయవంతమైనట్లేననే సెంటిమెంట్‌ను మరోసారి రుజువు చేసింది. అన్నయ్య సూర్యతో పాటు హీరో రవితేజ ఈ సినిమా చూసి బాగుందని మెచ్చుకున్నారు. ఈ చిత్రానికి కొనసాగింపుగా 'ఖైదీ-2' చేయబోతున్నాం' అని తెలిపారు. 'పాటలు, హీరోయిన్ లేకుండా తీసిన సినిమా కావడంతో ప్రేక్షకులు ఎలా స్వీకరిస్తారోననే అనుమానం ఉండేది. కానీ అన్ని ప్రాంతాల్లో హౌస్‌ఫుల్ కలెక్షన్స్ రాబడుతున్నది. కథ బాగుంటే ప్రేక్షకులు ఆదరిస్తారని మరోసారి నిరూపించింది. దీపావళికి విందుభోజనం లాంటి సినిమా ఇది'అని నిర్మాత రాధామోహన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఆర్.ప్రభు పాల్గొన్నారు.


ప్రీతి అస్రాని, సాయిరోనక్

# అమెరికా ప్రయాణం

సాయిరోనక్, ప్రీతి అస్రాని జంటగా నటిస్తున్న చిత్రం 'ప్రెషర్ కుక్కర్'. సుజోయ్, సుశీల్ దర్శకత్వం వహిస్తూ అప్పిరెడ్డితో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించారు. అభిషేక్ పిక్చర్స్ అధినేత అభిషేక్ నామా ఈ చిత్ర థియేట్రికల్ హక్కులను సొంతం చేసుకున్నారు. నవంబర్‌లో విడుదలకానుంది. దర్శకద్వయం మాట్లాడుతూ 'తండ్రి కోరిక మేరకు అమెరికా వెళ్లాలని కలలుగనే యువకుడి కథ ఇది. ఆద్యంతం వినోదభరితంగా ఉంటుంది. దర్శకుడు తరుణ్‌భాస్కర్ కట్ చేసిన టీజర్‌కు చక్కటి స్పందన లభిస్తున్నది' అని తెలిపారు. రాహుల్‌రామకృష్ణ, తనికెళ్లభరణి ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు.

# యాక్షన్ సినిమా చేయాలనుంది


రవిబాబు

''అదుగో' తుదిదశలో ఉన్న సమయంలో వరంగల్ కలెక్టర్ అమ్రపాలి బంగళాలో దయ్యం ఉందంటూ, ఆ దయ్యాన్ని చూసి ఆమె భయపడిందనే వార్త కథనాన్ని చదివాను. ఆ పాయింట్ నుంచి స్ఫూర్తి పొంది కల్పిత అంశాలతో 'ఆవిరి' కథ రాసుకున్నాను' అన్నారు రవిబాబు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం ' 'ఆవిరి'. నవంబరు 1న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం గురించి రవిబాబు మాట్లాడుతూ 'అందరూ అనుకుంటున్నట్లుగా ఇది హారర్ సినిమా కాదు. ఫ్యామిలీ థ్రిల్లర్ ఇతివృత్తంతో రూపొందించాం. కొత్త కథను థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో ఆసక్తికరంగా తెరపై ఆవిష్కరించే ప్రయత్నం చేశాం. సినిమా చూసి ఉత్సుకతకు లోనైన 'దిల్'రాజు మా చిత్రాన్ని పంపిణీ చేయడం ఆనందంగా వుంది. నవ్యమైన ఆలోచనలతో నాలో ఆసక్తిని రేకెత్తించిన కథాంశాలనే తెరపై ఆవిష్కరిస్తుంటాను. నా సినిమాలకు ప్రేక్షకుల ఆదరణతో పాటు విమర్శకుల ప్రశంసలు ముఖ్యమే. రెండింటిలో ఏది రాకపోయినా దర్శకుడిగా విఫలమైనట్లుగా భావిస్తాను. కమర్షియల్ ఈక్వేషన్స్ కోసం ఎప్పుడూ సినిమాలు చేయను. దర్శకత్వ బాధ్యతలతో బిజీగా ఉండటంతో నటనపై దృష్టిసారించలేకపోతున్నాను. 'సాహో' సినిమాను వదులుకున్నాను. 'అవిరి' తర్వాత మళ్లీ నటుడిగా బిజీ అవుతాననే నమ్మకం ఉంది. దర్శకుడిగా యాక్షన్ సినిమా చేయాలనే కోరిక ఉంది. తెలుగులో హీరో కొట్టగానే పదిమంది గాల్లోకి ఎగరడం లాంటి యాక్షన్ సన్నివేశాలు లేకుండా లక్ష్యాన్ని ఛేదించడానికి ప్రమాదకరమైన పరిస్థితుల్ని హీరో ఎలా దాటాడనే ఇతివృత్తంతో చేస్తా. అలాగే ఓ సీనియర్ సిటిజన్ కథాంశంతో చాలా ఏళ్ల నుంచి సినిమా చేసే ప్రయత్నాల్లో ఉన్నా. అక్కినేని నాగేశ్వరరావు బతికుంటే ఆయన్ని ఒప్పించి తనతో ఈ సినిమా చేసుండేవాణ్ణి. ఆ పాత్రకు సరిపోయే నటుడు దొరికితే తప్పకుండా ఈ కథను తెరపైకి తీసుకొస్తా. అమెరికా నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది' అని తెలిపారు.







